ఈనాడు

విజయవాడ 20-8-2017 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 11

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-00 పేజీలు 14+24+32 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



శనివారం ముజఫర్‌నగర్‌లోని ఖతౌలీ సమీపంలో రైలు పట్టాలు తప్పిన ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

యూపీలో ఘోరం

పట్టాలు తప్పిన కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్

23 మంది మృతి... 60 మందికి గాయాలు

మృతుల కుటుంబాలకు రూ. 3.5 లక్షల పరిహారం: సురేశ్ ప్రభు

ముజఫర్‌నగర్ (యూపీ)

మరో రైలు ఘోర ప్రమాదానికి గురయింది. రెండు పుణ్యక్షేత్రాల మధ్య రాకపోకలు సాగించే రైలు పట్టాలు తప్పింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు 40 కి.మీ. దూరంలోని ఖతౌలీ వద్ద వేగంగా వెళ్తున్న పూరీ-హరిద్వార్ కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం ప్రమాదానికి గురి కావడంతో 23 నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. రైల్వే అధికారులు మాత్రం మృతులు 12 మందేనని చెబుతున్నారు. దాదాపు 60 మంది గాయాలపాలయ్యారు. రైలుకు చెందిన 14 పెట్టెలు పట్టాలు తప్పాయి. పట్టాల పక్కనే ఉన్న ఇంటి గోడలోకి ఒక పెట్టె దూసుకుపోయింది. ఆ శిథిలాల కింద ఎవరైనా ఉన్నారేమోనని భయపడుతున్నారు. ప్రమాదానికి కారణాలేమిటో వెంటనే తెలియరాలేదు. రైలు పెట్టెల నుంచి ప్రయాణికుల్ని బయటకు తీయడం కోసం భారీ క్రేన్లను, గ్యాస్ కట్టర్లను పెద్దఎత్తున తరలించారు. స్థానికులు ముందుకొచ్చి సహాయక కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు రైల్వేశాఖ మంత్రి సురేశ్‌ప్రభు తెలిపారు. ఏదైనా లోపాల వల్ల ప్రమాదం జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిస్థితిని తానే స్వయంగా సమీక్షిస్తున్నట్లు (మిగతా 2లో)

నేర్చుకుంటే రాజాలే

- కృత్రిమ మేధస్సుతో ఉద్యోగాల్లో కోత
- మొదట్లో తగ్గినా తర్వాత ఎన్నో అవకాశాలు
- నైపుణ్యం పెంచుకోవడం తప్పనిసరి



ఓ పాతికేళ్ల క్రితం..

కంప్యూటర్లు వచ్చిన కొత్తల్లో.. ఇక చాలా ఉద్యోగాలు పోవడం ఖాయమనేది ఎంతోమందిలో నెలకొన్న ఆందోళన.

కాని ఆశ్చర్యం..

మొదట్లో కొంత ఇబ్బంది ఎదురైనా.. తర్వాత అనూహ్యంగా ఉద్యోగాల సంఖ్య పెరిగింది. అనివార్యమైన ఈ మార్పునకు ప్రజలు నెమ్మదిగా అలవాటు పడిపోయారు.

ఇప్పుడు మళ్లీ మరో కుదుపు..

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్), రోబోటిక్స్ విప్లవం శరవేగంగా ప్రపంచాన్ని చుట్టుముడుతున్నాయి. దీనివల్ల ఉద్యోగాలు పోతాయని, ఇప్పటికే అధికంగా ఉన్న నిరుద్యోగ సమస్య ఇంకా పెరిగి పెద్దదవుతుందనే ఆందోళన మొదలైంది. మరి ఇది నిజమేనా?

నిజానికి కృత్రిమ మేధస్సు, రోబోటిక్ విప్లవం వల్ల కొన్నిరకాలైన ఉద్యోగాలు పోయినప్పటికీ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఆ స్థానంలో ఇంకా అధిక సంఖ్యలో కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాకపోతే దీనికి సన్నద్ధత ఎంతో ముఖ్యం. శరవేగంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా తగిన నైపుణ్యాలను సమకూర్చుకున్న వారికి ఎటువంటి ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు.

కొత్త కొలువులు ఎలా ఉంటాయి?


- పని ప్రదేశంలో ఒక రోబోట్‌ను ఏర్పాటు చేస్తే అక్కడ దాదాపు అరుగురు ఉద్యోగాలు పోగొట్టుకోవలసి వస్తుంది.
- ఉద్యోగాలు కోల్పోయిన వారికి వెంటనే కొత్త ఉద్యోగాలు లభించవు. కొత్త ఉద్యోగాలు చేయటానికి అవసరమైన నైపుణ్యం, పరిజ్ఞానం వారికి ఉండనందునే ఈ సమస్య.
- కృత్రిమ మేధస్సుతో కూడిన ఆటోమేషన్ విస్తరించిన కొద్దీ అత్యధిక నైపుణ్యమున్నవారికే ఉద్యోగాలు, అధిక జీతభత్యాలు లభిస్తాయి.
- తొలిదశలో ఈ ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన అనుభవం, విజ్ఞానం గల వారి కొరత ఉంటుంది.
- కొత్త తరహా ఉద్యోగాల సంఖ్య మొదట్లో తక్కువగా ఉంటుంది. కానీ నెమ్మదిగా వీటి సంఖ్య పెరుగుతుంది. గతంలో ఇటువంటి సాంకేతిక మార్పులు వచ్చిన సందర్భాల్లో ఈ విషయం నిర్ధారణ అయింది.

ఇటువంటి ఉద్యోగాలు ఉండవు...

- కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ తీసుకువస్తున్న మార్పులను నాలుగో పారిశ్రామిక విప్లవంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనివల్ల ప్రస్తుత వ్యవస్థలు, విధానాలు భారీగా మార్పులకు లోనవుతాయి. పాత తరహా పద్ధతులు, (మిగతా 2లో)

‘బ్లూ వేల్’కు కళ్లెం

- ప్రమాదకర క్రీడ కట్టడికి చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, అంతర్జాల సంస్థలు



దిల్లీ: చిన్నారులను ఆత్మహత్యలకు పురిగొల్పుతున్న ‘బ్లూ వేల్ ఛాలెంజ్’ అంతర్జాల క్రీడకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఈ ప్రమాదకర క్రీడకు సంబంధించిన సమాచారాన్ని తొలగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఇండియా చర్యలను వేగవంతం చేసింది. ఈ విషయాన్ని సంస్థ ఉన్నతాధికారులు ధ్రువీకరించారు. బ్లూ వేల్ నిర్వాహకులు (క్యూరేటర్‌లు) సామాజిక మాధ్యమాలనే (మిగతా 11లో)

అమ్మాయీ అందుకో

- సైనిక పాఠశాలల్లో వారికీ సీట్లు
- మైనింగ్ టెక్నాలజీలో ప్రవేశాలు మరా..
- ఐఐటీల్లో ఇక 20 శాతం సీట్లు మహిళలకే

9లో

ఓటుతోనే ఖతం చేయాలి

- వైకాపా అధినేత జగన్‌పై చంద్రబాబు వ్యాఖ్య
- తల్లిదండ్రులు లేని భూమా పిల్లలపై ప్రతాపం చూపుతున్నారు
- మంత్రిగా అభివృద్ధి చేయని శిల్పా గెలిస్తే నా ప్రభుత్వంలో ఏం చేస్తారు?
- చరిత్రలో నిలిచిపోయే మెజారిటీతో తెదేపా అభ్యర్థిని గెలిపించాలి
- ‘నంద్యాల’ ప్రచారంలో సీఎం

2లో



నంద్యాలలోని ఎన్జీవో కాలనీలో నిర్వహించిన రోడ్‌షోలో పాపను ఎత్తుకున్న ముఖ్యమంత్రి

ఒక్క నిజం చెప్పని వ్యక్తి చంద్రబాబు

- అర్ధరాత్రి ఆర్యవైశ్యులపై దాడి దుర్మార్గపు చర్య
- ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లా చేస్తా..
- ఉపఎన్నికల ప్రచారంలో విపక్ష నేత జగన్

2లో

ప్రేమించనంటే చంపేశాడు

పెట్రోలు పోసి యువతి సజీవదహనం

అడ్డుకున్న ఆమె సోదరుడిపైనా దాడి


- అక్కా తమ్ముళ్లిద్దరూ మృతి
- విశాఖ శివారు నగరపాలెంలో దారుణం
- రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న నిందితుడు
- రెండు ముక్కలైన శరీరం



రూప (పాతచిత్రం)

ఏడాది కాలంగా ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. పెళ్లి చేసుకోమని బెదిరించాడు. అయినా ఆమె లొంగలేదు. ఇటీవలే ఆమెకు వివాహం కుదరడంతో ప్రేమోన్మాదిలో పైశాచికత్వం పెచ్చుమీరింది. తనకు దక్కని ప్రేమ మరొకరికి దక్కకూడదనుకున్నాడు. ఆమె ఇంట్లో పెద్దవాళ్లు ఎవరూ లేని సమయం చూసుకున్నాడు. ఇంటికి వెళ్లి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. వెంటనే తనతో తెచ్చుకున్న పెట్రోలును ఆమెపై గుమ్మరించి నిప్పు అంటించేశాడు. దీనిని అడ్డుకున్న ఆమె తమ్ముడిపైనా మిగిలిన పెట్రోల్ పోసేసి తలుపు గడియపెట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో (మిగతా 2లో)

ఇదీ సంగతి!



నేర్చుకుంటే రాజాలే

(మొదటి పేజీ తరువాయి)

పనులు, ఉద్యోగాలకు కాలం చెల్లిపోతుంది. దీని వల్ల కొద్దికాలం పాటు సాంఘిక అశాంతి చోటుచేసుకునేందుకు అవకాశం ఉంది.

- మనం రోజువారీ చేసే పనుల్లో ఎన్నో పనులను కంప్యూటర్లు పూర్తిచేసే పరిస్థితి వస్తుంది. అటువంటి పనులకు మున్ముందు మనుషులు అవసరం లేదు. రిటైల్ వర్తకం, రెస్టారెంట్ సర్వీస్, తయారీ రంగాల్లో మనుషులు చేసే ఎన్నో పనులను పూర్తిగా యంత్రాలతో నిర్వహించే పరిస్థితి వస్తుంది.
- ఉదాహరణకు భవిష్యత్తులో క్యాషియర్ ఉద్యోగం ఉండకపోవచ్చు. క్యాషియర్ చేసే పనులన్నింటినీ రోబోలు నిర్వహిస్తాయి.
- మధ్యస్థంగా ఉండే ఉద్యోగాలకు పెద్దఎత్తున నష్టం జరుగుతుంది. ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) అంచనా ప్రకారం అమెరికాలో 9 శాతం ఉద్యోగాలకు ఆటోమేషన్‌తో ముప్పు ఎదురవుతుంది. ఇవన్నీ కింది, మధ్యస్థాయి ఉద్యోగాలే.

ఈ నైపుణ్యాలు ఉంటేనే..

సంక్లిష్టమైన సమస్యల పరిష్కారం: కొన్నిసార్లు అనూహ్యమైన సమస్యలు ఎదురవుతాయి. వీటికి సాధారణ పద్ధతుల్లో పరిష్కారం లభించదు. వినూత్నంగా ఆలోచిస్తే గానీ వాటి నుంచి బయటపడటం సాధ్యం కాదు. చదువు, అనుభవం, వివేచన ద్వారా ఇటువంటి సంక్లిష్టమైన సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనే శక్తి అలవడుతుంది. దీన్ని పెంపొందించుకున్న వారు కృత్రిమ మేధస్సుతో కూడిన వాతావరణంలో మెరుగైన ఫలితాలు సాధించగలుగుతారు.

ఆలోచనా ధోరణి: ఒక నిర్ణయానికి వచ్చే ముందు ఎటువంటి ఒత్తిళ్లకు, ఇష్టాయిష్టాలకు లోనుకాకుండా వ్యవహరించగలగటం. హేతుబద్ధమైన ఆలోచన అని చెప్పవచ్చు.

సృజనాత్మకత: కొత్తదనాన్ని ఆవిష్కరించటమే సృజనాత్మకత. ఒక ఆలోచన, ఒక సిద్ధాంతం, శాస్త్రీయమైన ఆలోచన, ఒక కొత్త పని.. ఇవన్నీ సృజనాత్మకతకు ఉదాహరణలు.

ఇతరులతో సమన్వయం: ఒక వ్యక్తి అన్ని పనులు చేయలేడు. బృందంగా అయితే ఎన్నో పనులు సాధించవచ్చు. కానీ బృందాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలంటే సమన్వయం ఎంతో అవసరం. బృంద సభ్యులందరితో కలిసిమెలిసి ఉండగలిగితేనే ఇది ఇసాధ్యపడుతుంది.

భావోద్వేగ మేధస్సు: ఒక వ్యక్తి తనలోని భావాలను, ఎదుటివారిలోని భావాలను గుర్తించగలిగే శక్తి కలిగి ఉండటం. ఒకరి వ్యక్తిత్వాన్ని అంచనా వేసేందుకు దీన్ని ప్రామాణికంగా భావిస్తారు. అందుకే ఉద్యోగార్థుల్లో ఇటువంటి శక్తి ఏమేరకు ఉందనేది పరిశీలనగా చూస్తారు.

నిర్ణయాలు తీసుకునే శక్తి: నిర్ణయాలు తీసుకోగలిగిన శక్తిని మనలోని దృఢచిత్తానికి సంకేతంగా ఎదుటి వారు భావిస్తారు. ఇదేదో సులువైన పనే కదా... అనుకోవచ్చు. కానీ అదంత సులువు కాదు. చిన్న చిన్న విషయాల నుంచి సంక్లిష్టమైన సమస్యలు ఎదురైనప్పుడు నిర్ణయాలు తీసుకోవటం ఎంతో కష్టమవుతుంది. ఒత్తిడిలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు. అనుభవం, వివేకం ద్వారా సరైన నిర్ణయాలు తీసుకోగలిగిన శక్తి అలవడుతుంది.

సేవా దృక్పథం: ఒక ఉద్యోగానికి వెళ్లిన అభ్యర్థిలో సేవాతత్పరత ఏమేరకు ఉందనే అంశాన్ని తప్పక పరిశీలిస్తారు.

సంప్రదింపులు సాగించగలిగే శక్తి: ఒక బృందంలో పనిచేయటానికి, విభేదాలు పరిహరించటానికి సంప్రదింపులు దోహదపడతాయి. ఎటువంటి వారికి నచ్చే విధంగా మాట్లాడటం, హేతుబద్ధమైన తర్కాన్ని ఆవిష్కరించగలిగిన వ్యక్తికి ఇతరులతో పోల్చితే ఎక్కువ విలువ ఉంటుంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

ఓటుతోనే ఖతం చేయాలి

నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి కూడలిలో చంద్రబాబు ప్రచార సభకు హాజరైన ప్రజలు

"నన్ను నడిరోడ్డుపై కాల్చేయాలని, ఉరేయాలని, నా బట్టలు ఊడదీయాలని అంటున్న వైకాపా అధినేత జగన్‌ను ఓటుతోనే ఖతం చేయాలి. చిరునామా గల్లంతు చేయాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నంద్యాల ఉప ఎన్నికలో భాగంగా ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. రోడ్ షోలు, సభలు, సమావేశాల్లో సీఎం మాట్లాడుతూ జగన్ తీరును ఎండగట్టారు.."నన్ను ఎందుకు కాల్చాలి, ఉరేయాలి? నేనేం తప్పుచేశాను. పింఛన్లు ఇచ్చినందుకా? పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమే నేను చేసిన తప్పా? ప్రతిపక్ష నేత జగన్ ఇలాంటి మాటలు మాట్లాడుతుంటే మీకు బాధేయడం లేదా తమ్ముళ్లూ..? ఏం చేయాలో మీరందరూ ఆలోచించాలి. ఓటుతోనే బుద్ధి చెప్పాలి. నంద్యాల చరిత్రలో. . రాష్ట్రమే ఆశ్చర్యపడే మెజారిటీతో గెలిపించాలి. ఓటేసే ముందు భూమాను, తల్లిదండ్రులు లేని వారి పిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలి. 'నంద్యాల్లో పులివెందుల సంస్కృతి తీసుకొస్తా' అని జగన్ అంటున్నారు. ఇది జరిగితే పిల్లలకు అన్నప్రాసన రోజున పెన్ను, పుస్తకానికి బదులు తుపాకులు, బంగారు బిస్కెట్లు ఇవ్వాల్సి ఉంటుంది. పులివెందులనే నంద్యాలలా శాంతియుతంగా మారుస్తా. అభివృద్ధికి అడ్డం పడితే బుల్లెట్‌లా దూసుకుపోతా. 23న పండగ రోజు. ఆ రోజు బ్రహ్మానందరెడ్డిని ఎంత మెజారిటీతో గెలిపిస్తే నాకు అంత టానిక్. మెజారిటీ 50-60వేలు అన్నది మీకే వదిలిపెడుతున్నా. వైకాపా అధినేత జగన్ తనకు పత్రిక, ఛానల్, ఆస్తులు లేవంటున్నారు. ఆయనకు ఉన్న సాక్షి పత్రికలో అసత్యాలన్నీ రాస్తున్నారు. అవి చదివితే చికాకు వస్తుంది. సాక్షి టీవీలో 24గంటలూ దుష్ప్రచారం చేస్తున్నారు. రూ.లక్ష కోట్ల అవినీతి సొమ్ముకు వివరాలు అడిగితే చెప్పడం లేదు. జగన్ ఓటర్ల గడ్డం, బుగ్గలు పట్టుకుంటూ ఏదో చేసినట్టు నటిస్తున్నారు. నాకోసం తిండిని తీసుకువచ్చే వాహనాన్నీ తనిఖీ చేయించారు. అందులో రాగులు, సజ్జలు, కూరగాయలు ఉండడంతో వారికి కొండను తవ్వి ఎలుకను పట్టినట్లయింది. భూమా పిల్లలపైనా వైకాపా అధినేత జగన్ ప్రతాపాన్ని చూపుతున్నారు. వారిని మీరే తల్లిదండ్రులుగా ఆదరించాలి. వైకాపా పోటీ పెడితేనే నంద్యాలలో అభివృద్ధి జరుగుతుందని ప్రతిపక్ష నేత అంటున్నారు. ఎవరో అడిగితే నేను అభివృద్ధి చేయడం లేదు. ఇది నా బాధ్యత. ప్రతిపక్ష పార్టీ అవినీతి, నేరచరిత్ర కలిగిన పార్టీ. అది మనకు వద్దు" అని ముఖ్యమంత్రి అన్నారు.

ఇప్పుడు గెలిచి ఏం చేస్తారు..?: "కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లు ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి అప్పుడు ఏం అభివృద్ధి చేశారు.. ఇప్పుడు ఓటేస్తే ఏం పొడుస్తారు. మంత్రిగా ఉంటేనే చేయలేని వ్యక్తి.. ఇప్పుడు గెలిచి నా ప్రభుత్వంలో ఏం చేస్తారు. 3ఏళ్లు తెదేపాలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న శిల్పా మోహన్‌రెడ్డి ఎలాంటి అభివృద్ధి పనులు అడగలేదు. ఆయనకు డబ్బులు, వ్యాపారాలు, ప్లాట్లు కావాలి. అధికారాన్ని అమ్ముకుంటారు. మార్కెట్ యార్డులోని స్థలాన్ని చవకగా కొట్టేసి, పెద్ద సేవ చేస్తున్నట్లు పోజుకొడుతున్నారు. ఎస్సీల భూములను ఆక్రమించేశారు. పేదలకు ఇళ్లు కట్టమంటే హౌజింగ్‌బోర్డు భూమిని అందుకిచ్చి, లాభాలు తీసుకున్న వ్యక్తిగా జగన్ ఏ1 ముద్దాయిగా ఉన్నారు. దీనికి శిల్పా సహకారం అందించారు. మేం జలవనరుల శాఖ భూమినిచ్చి ఇళ్లు కట్టిస్తుంటే వారు భూములను ఆక్రమించుకున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు సీటు ఇద్దామంటే కాదని, ఇంకా మోసం చేయడానికి వైకాపాలో చేరారు" అని విమర్శించారు.

బాధితులకు న్యాయం చేస్తాం: "అగ్రిగోల్డ్, కేశవరెడ్డి విద్యాసంస్థల బాధితులకు న్యాయం చేస్తాం. ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. నిందితులు జైల్లో ఉన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు వేలం వేసి, బాధితులకు డబ్బులు ఇప్పిస్తాం. ఆస్తులను రికవరీ చేసి డబ్బులు అందిస్తాం. అగ్రిగోల్డ్ విషయంలో న్యాయమైన చిక్కులున్నాయి అందుకే కొంత ఆలస్యమవుతోంది. ప్రభుత్వంలో ఎవరైనా తప్పు చేస్తే తొలిరోజే చొక్కా పట్టుకునే వ్యక్తిని. కాంగ్రెస్ హయాంలోని అవినీతి కారణంగానే ఇవి పుట్టుకొచ్చాయి. రూ.లక్ష కోట్లు దోచుకున్న వ్యక్తి మీకు న్యాయం చేస్తానంటున్నాడు మీరు నమ్ముతారా?" అని చంద్రబాబు ఓటర్లను ప్రశ్నించారు.

మీరంతా ఒక్కటై నిలవాలి: తెదేపా అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబడిన భూమా బ్రహ్మానందరెడ్డికి ఓటు వేయమని కోరడానికి రాలేదు. అభివృద్ధి పనులు చూసేందుకు వచ్చాను. మీరు ఎప్పుడో గెలుపును నిర్ణయించేశారు. మెజారిటీ ఎంతో మీరే చెప్పాలి. గత సాధారణ ఎన్నికల్లో శోభనాగిరెడ్డి చనిపోతే ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెదేపా పోటీ పెట్టలేదు. రాజశేఖరెడ్డి మృతి అనంతరం జరిగిన ఎన్నికల్లోనూ తెదేపా పోటీ చేయలేదు. కానీ, అమ్మానాన్నా లేని పిల్లలపై జగన్ పోటీ పెట్టారు. మూడు నెలల్లో రాష్ట్రంలో 28సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నానంటే అదీ నా పట్టుదల. ఈ ప్రాజెక్టుల్లో 16 రాయలసీమలోనేఉన్నాయి. వీటిని పూర్తిచేసి సీమను సస్యశ్యామలంచేస్తాం." అని చంద్రబాబు ఆకాంక్షించారు.

క్విడ్‌ప్రోకో సిలబస్‌లో జగన్ చరిత: "వైకాపా అధినేత జైల్లో 16 నెలలు ఉన్నారు. తర్వాత ఎక్కువ సమయం నంద్యాలలోనే ఉన్నారు. నేను ఫోకస్ పెడితే వదిలిపెట్టను. వస్తా.. మళ్లీమళ్లీ వస్తా.. అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు వస్తా.. యంత్రాంగాన్ని పరిగెత్తిస్తా. జగన్‌కు గర్వం వచ్చి కళ్లు కనపడడం లేదు. మదమెక్కి వాస్తవాలు గుర్తించడం లేదు. కాంగ్రెస్ హయాంలో దెయ్యాలు పింఛన్లు తీసుకొని శ్మశానాలకు వెళ్లాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇటీవల క్రిమినల్ లా సిలబస్‌లో కిడ్ ప్రోకో సబ్జెక్టు పెట్టారు. ఇందులో జగన్‌ని, గాలి జనార్దన్‌రెడ్డిని ఉదాహరణలుగా చూపిస్తూ ఎలా అవినీతి పాల్పడొచ్చో ప్రస్తావించారు. ఇటువంటి వాళ్లు ఎన్నికల్లో గెలిస్తే అవినీతే నీతిశాస్త్రంగా పెట్టేస్తారు" అని ముఖ్యమంత్రి విమర్శించారు.

కశ్మీర్ అంశంలో పాకిస్థాన్‌ను ఎట్టి పరిస్థితుల్లో సమర్థించేది లేదని ఇజ్రాయెల్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అమెరికన్ యూదుల కమిటీ (ఏజేసీ) నేతృత్వంలో ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న భారత పాత్రికేయులు, రాజకీయ నాయకుల ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు అధికారులిలా స్పందించారు. కశ్మీర్‌లో పరిస్థితి ఎలా ఉన్నా.. పాక్‌కు మద్దతు నిచ్చే ప్రశ్నే లేదని పేర్కొన్నారు.





శనివారం ముజఫర్‌నగర్‌లోని ఖటౌలీ సమీపంలో రైలు పట్టాలు తప్పి నుజ్జునుజ్జయిన బోగీలు ★ రైలు పట్టాలు తప్పి భవనంలోకి దూసుకెళ్లిన బోగి

యూపీలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.3.5 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడినవారికి రూ.50వేలు, స్వల్పగాయాలైన వారికి రూ.25వేలు చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారు. సహాయ మంత్రి మనోజ్‌సిన్హా ఘటనా స్థలానికి వెళ్లారనీ, పునరావాస కార్యకలాపాలను రైల్వేబోర్డు ఛైర్మన్ పర్యవేక్షిస్తున్నారనీ ఆయన చెప్పారు. జాతీయ విపత్తు ఉపశమన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) నుంచి బలగాలు, వైద్య బృందాలు ఘటనాస్థలికి వెళ్లాయని తెలిపారు. తక్షణం సహాయం అందేలా అన్ని చర్యలూ తీసుకున్నట్లు చెప్పారు.

2370 కి.మీ. దూరం... 48 గంటల ప్రయాణం

ఒడిశాలోని పూరీ నుంచి ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ మధ్య 2370 కి.మీ. దూరాన్ని కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ 48 గంటల్లో పూర్తి చేస్తుంది. గురువారం రాత్రి 8.55 గంటలకు పూరీలో బయల్దేరిన ఈ రైలు శనివారం రాత్రి 9 గంటలకు హరిద్వార్ చేరుకోవాల్సి ఉండగా కొన్ని గంటల ముందు ప్రమాదానికి గురయింది. ఎస్-1 నుంచి ఎస్-10 వరకు స్లీపర్ పెట్టెలు, ఒక తృతీయశ్రేణి ఏసీ, ఒక ద్వితీయ శ్రేణి ఏసీ, ప్యాంట్రీ కారు దెబ్బతిన్నాయి. ప్రమాదం వెనక ఉగ్రవాద కోణమేదైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించగా- యూపీ ఉగ్రవాద వ్యతిరేక దళం అన్ని కోణాలనూ పరిశీలిస్తుందని అదనపు డీజీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

రాష్ట్రపతి, ప్రధానుల సంతాపం

దిల్లీ: కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం తెలిపారు. ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "చాలా బాధ కలిగింది. నా ఆలోచనలన్నీ ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల చుట్టూ తిరుగుతున్నాయి. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నా. పరిస్థితిని రైల్వే మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అన్ని రకాల సహాయం అందిస్తోంద"ని పేర్కొన్నారు. ఈ ప్రమాదం తననెంతో కలచివేసిందని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొనాల్సిందిగా పార్టీ కార్యకర్తలకు సూచించినట్లు ట్వీట్ చేశారు. కేంద్ర మంత్రి జె.పి.నడ్డా రైల్వేశాఖ మంత్రితోమాట్లాడి తమశాఖ తరపున ఎలాంటి సహకారంకావాలన్నా అందించేందుకు సిద్ధమేనని చెప్పారు.

సత్వర చర్యలు చేపట్టిన యూపీ ప్రభుత్వం

లఖ్‌నవూ: రైలు ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. ఇద్దరు సీనియర్ మంత్రుల్ని సంఘటన స్థలానికి పంపించారు. ముజఫర్‌నగర్ కలెక్టర్‌తో మాట్లాడి అన్ని రకాల సహాయం అందించాలని సూచించారు. బాధితులకు ఉచితంగా వైద్య సహాయం అందించాలని అన్ని ఆసుపత్రులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు. సంఘటన స్థలానికి 35 అంబులెన్సులతోపాటు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను, ఆహార పొట్లాలను పంపించారు. సేవలు అందించడానికి సమీపంలోని మేరఠ్ నుంచి స్వచ్ఛంద సేవకులు వెళ్లారు. గాయపడ్డవారికి చికిత్సలు అందించడానికి అన్ని వైద్య కళాశాలల ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రయివేటు ఆసుపత్రులను సన్నద్ధం చేశారు.



బోగిలో నుంచి ప్రయాణికుడిని బయటకు తీస్తున్న సహాయక సిబ్బంది

ఒడిశా వాసులకు రూ.5 లక్షల పరిహారం: నవీన్

కటక్, న్యూస్‌టుడే: ప్రమాదంపై ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ రైలులో పూరీ నుంచి 86 మంది హరిద్వార్‌కు బయలుదేరారు. మృతుల్లో ఎక్కువ మంది ఒడిశా వాసులు ఉంటారని రైల్వే వర్గాలు తెలిపాయి. మృతి చెందిన ఒడిశా వాసులు ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు పరిహారం, గాయపడిన వారికి రూ.50 వేలు సహాయాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒడిశాకు చెందిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రైల్వే శాఖ మంత్రి సురేష్ ప్రభుతో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు.

జీవితంలో ఒక్క నిజం చెప్పని వ్యక్తి చంద్రబాబు

- వైకాపా నేత జగన్

నంద్యాల, న్యూస్‌టుడే: 'జీవితంలో ఒక్క అబద్ధం చెప్పని వారిని హరిశ్చంద్రుడు అంటాం.. ఒక్క నిజం చెప్పని వ్యక్తి చంద్రబాబునాయుడ'ని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన నంద్యాలలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నంద్యాల పెద్దబండలో నిర్వహించిన బహిరంగ సభలోనూ మాట్లాడారు. రుణాలు మాఫీ చేస్తానని రైతులను, డ్వాక్రా సోదరీమణులను, చదువుకునే పిల్లలను చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. ప్రత్యేక హోదా వస్తే కాస్తోకూస్తో పిల్లలకు మేలు కలుగుతుందని, దాన్నీ దూరం చేశారని తెలిపారు. నంద్యాల కుందూ నదికి వరదలు వచ్చి కాలనీలు మునుగుతుంటే రూపాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి, ఆయన మనుషులు కాలనీలకు వస్తారు. మూటలు, మూటలు తెస్తారు. నిన్నటినుంచే నంద్యాల, పల్లెల్లో పంపిణీ మొదలుపెట్టారు. దేవుడి పటం తీసి ప్రమాణం చేయిస్తారు. ఇలా చేసేది దెయ్యాలే. వారితో లౌక్యంగా వ్యవహరించాల'ని సూచించారు. సంతలో గొర్రెలు కొన్నట్లు ఎమ్మెల్యేలను లోగడ కొనుగోలు చేశారని, మిమ్మల్ని కొనేందుకు వస్తారని పేర్కొన్నారు. ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ.. ఉపఎన్నికల సందర్భంగా ఆర్యవైశ్యులు సత్యనారాయణ, రమేష్ ఇళ్లపై అర్ధరాత్రులు పోలీసు దాడులు చేయించడం దుర్మార్గమని విమర్శించారు. తెదేపా వారు ఓటుకు రూ.ఐదు వేలు ఇస్తున్నట్లు పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. రహదారి విస్తరణలో నిబంధనలు పాటించకపోవడం వల్ల ఆర్యవైశ్యులు భారీగా నష్టపోయారన్నారు. ఏడాదిలో వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే విస్తరణలో జరిగిన నష్టాన్ని పూడ్చుతామన్నారు. స్థలం విలువ ప్రకారం గజం రూ.లక్ష ఇచ్చి ఆదుకుంటామని హామీనిచ్చారు. రాక్షసపాలనను అంతమొందించేందుకే నంద్యాల ఉపఎన్నికలు వచ్చాయని వివరించారు. 'మూడేళ్లపాటు ఆర్యవైశ్య కార్పొరేషన్ కోసం తిరిగారు. ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. ఎవరి చుట్టూ తిరగాల్సిన పని లేదు. మేము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కార్పొరేషన్ ఏర్పాటుచేస్తాం. సంఘానికి రూ.వేల కోట్లను కేటాయించి అండగా నిలుస్తా'మని ప్రకటించారు. వ్యాపారులపై వాణిజ్య అధికారుల దాడులు అధికమయ్యాయని పేర్కొన్నారు. రాజకీయాలలోకి రాకముందు తానూ వ్యాపారం చేశానని, వారి బాధలు తనకు తెలుసని, వారిని ఆదుకుంటానని హామీనిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించింది వైఎస్ అని గుర్తుచేశారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లా చేస్తానని ప్రకటించారు. నంద్యాలలో జిల్లా కేంద్రం ఉంటే జిల్లా కలెక్టరు, ఎస్పీ కార్యాలయాలు వస్తాయని.. నంద్యాల అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కలుగొట్ల వీరభద్రస్వామి, మాజీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



నంద్యాలలో శనివారం చిన్నారితో వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి

గ్రహం అనుగ్రహం

20–8–2017 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
చతుర్దశి: రా. 1-59 తదుపరి అమావాస్య
పుష్యమి నక్షత్రం: సా. 6-01 తదుపరి ఆశ్లేష
అమృతఘడియలు: మ. 11-58 నుంచి 1-29 వరకు
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: సా. 4-40 నుంచి 5-31 వరకు
రాహుకాలం: మ. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5-47; **సూర్యాస్తమయం:** సా.6-21
మాస శివరాత్రి

ప్రేమించనంటే చంపేశాడు

(మొదటి పేజీ తరువాయి)

రూప అక్కడికక్కడే మృతి చెందగా..ఆమెను రక్షించబోయిన తమ్ముడు ఉపేంద్ర చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన విశాఖజిల్లా భీమిలి మండలంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అనంతరం నిందితుడు విజయనగరం వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

విశాఖ జిల్లా భీమిలి మండలం తగరపువలస పట్టణానికి అనుకుని వున్న టి.నగరపాలెంకు చెందిన పొట్నూరు రూప సమీపంలోని బాసర కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాలకు సమీపంలోని బాలాజీనగర్‌లో దుప్పట్లు కుట్టుకుని జీవించే పతివాడ వెంకటరమణ, గోపమ్మ కుమారుడు హరిసంతోష్ (24) డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నాడు. కళాశాలకు వెళ్లొచ్చే దారిలో కాపు కాసి రూపను ఏడాదిగా ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేశాడు. ఆమె తిరస్కరించడంతో మూడు నెలల క్రితం తన తల్లి, అక్కను తీసుకుని విశాఖ నగరం చినగదిలి ప్రాంతంలో ఉంటున్న రూప పిన్ని ఇంటికి వెళ్లాడు. రూపను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. దీనిపై రూప పిన్ని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి నుంచి రూపను కళాశాలకు మాన్పించేసి ఇంట్లోనే ఉంచారు. అయినప్పటికీ సంతోష్ ఆమె ఇంటి పరిసరాల్లోనే తిరుగుతుండటంతో విషయాన్ని స్థానిక పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారు సంతోష్‌ను మందలించారు. ఇక ఆ అమ్మాయి జోలికి వెళ్లనని పెద్దల సమక్షంలోనే అతను అంగీకరించాడు. ఇటీవల రూపకు బావ వరసయ్యే వెంకటేశ్‌తో పెళ్లి నిశ్చయమైందని సంతోష్ తెలుసుకున్నాడు. ఆ అమ్మాయి తనను ప్రేమించిందని ఆమెను ఎవరు పెళ్లి చేసుకున్నా ఒప్పుకునేది లేదంటూ వెంకటేశ్‌కు కూడా తరచూ సందేశాలు పంపి వేధింపులకు గురి చేశాడు. శనివారం మధ్యాహ్నం సంతోష్.. నేరుగా రూప ఇంట్లోకి వచ్చాడు. గదిలో రూప, ఆమె తమ్ముడు ఇంట్లో టీవీ చూస్తున్నారు. ఇంట్లోకి రాగానే ఆమెతో గొడవకు దిగాడు. అనంతరం పెట్రోల్‌ను ఆమెపై పోసి నిప్పంటించాడు. కళ్ల ముందే అక్క మంటల్లో కాలిపోతుంటే అడ్డుకుందామని ప్రయత్నించిన తమ్ముడు ఉపేంద్రపైనా పెట్రోలు పోసి నిప్పంటించి గదికి బయట గడియపెట్టి పారిపోయాడు. అరుపులు విని పక్కింటి వారు, రూప చిన్నాన్న వేరే ద్వారం ద్వారా తలుపుతీసి లోపలికి వెళ్లారు. అప్పటికే పూర్తిగా కాలిపోయిన రూప పిన్నీ..పిన్నీ.. అంటూ ప్రాణాలు విడిచింది. తీవ్రంగా కాలిపోయిన ఉపేంద్ర మాట్లాడుతూ ఇంట్లోకి ఎవరో ఓ వ్యక్తి వచ్చి తన అక్కను కాల్చేసి పారిపోయినట్లు చెప్పాడు. చివరకు శనివారం రాత్రి అతను కూడా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపేంద్ర తాటితూరులో పదోతరగతి చదువుతున్నాడు.



రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న హరిసంతోష్

విజయనగరం వచ్చి ప్రాణం తీసుకున్న ప్రేమికుడు... నగరపాలెం నుంచి పారిపోయిన సంతోష్ విజయనగరం వచ్చాడు. గతంలో అతని కుటుంబం నివాసం ఉన్న బీసీ కాలనీకి వెళ్లాడు. తన బంధువులకు మధ్యాహ్నం కనిపించాడు. అక్కడి నుంచి బయల్దేరి గోకపేట సమీపంలో రైలు పట్టాల వద్దకు వెళ్లాక రూప బాబాయ్‌కు ఫోన్ చేసి ఆమెను తానే చంపానని చెప్పి.... ఏ జరిగిందో చూశావా? అని ఫోను పెట్టేశాడు. అనంతరం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.



యువతి సోదరుడు ఉపేంద్ర

కష్టాలతోనే జీవించి.. రూప, ఉపేంద్ర పరిస్థితి చూసి పలువురు కంటి తడిపెడుతున్నారు. తల్లి వరలక్ష్మి పిల్లల చిన్నవయస్సులో ఉన్నప్పుడే ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి సూరిబాబు సరోజిని అనే మహిళను వివాహం చేసుకున్నారు. ఇటీవల వారు వేరే ఇంటికి వెళ్లిపోగా.. రూప, ఉపేంద్ర మాత్రం తాత యల్లయ్య, నానమ్మ అప్పచ్చమ్మ వద్దనే ఉంటున్నారు.

ఉపాధి కోసం నగరానికి వచ్చి.. సంతోష్ విజయనగరం జిల్లా చెల్లూరి ప్రాంతానికి చెందిన వ్యక్తి. వీరి కుటుంబం ఎనిమిదేళ్ల కిందట బతుకు తెరువుకోసం తగరపువలసకు వచ్చింది. తండ్రి వెంకటరమణ దుప్పట్లు, పరుపులు కుడుతుంటాడు. కుమారుడు చేసిన అఘాయిత్యం తెలుసుకున్న తల్లిదండ్రులు తగరపువలసలో తాము అద్దెకుంటున్న ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఘటనాస్థలానికి ఏసీపీ మోహనరావు, సీఐ బాలసూర్యారావు, ఎస్ఐ పి.శ్రీను చేరుకుని వివరాలు నమోదు చేశారు. తన అవయవాలను దానం చేస్తానని ఓ సంస్థకు సంతోష్ ఫోన్‌చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

– ఈనాడు, విశాఖపట్నం, తగరపువలస, విజయనగరం, న్యూస్‌టుడే

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	21.9	25.7
కర్నూలు	23.2	29.1
తాడేపల్లిగూడెం	24.0	28.5
గుంటూరు	24.0	29.0
రాజమహేంద్రవరం	24.0	29.0
శ్రీకాకుళం	24.0	32.0
నరసాపురం	24.3	29.8
ఒంగోలు	24.9	29.8
అనంతపురం	25.3	32.2
విజయవాడ	25.4	29.1
విశాఖపట్నం	26.0	30.8
కడప	26.0	34.0
తిరుపతి	26.2	34.4
నెల్లూరు	28.0	33.0

గుర్.. గుర్.. గుర్...

మందలు మందలుగా పందులు!

● ప్రజలపై దూసుకెళుతున్న వరాహాలు ● హడలిపోతున్న చిన్నారులు, వృద్ధులు ● నేటికీ కొలిక్కిరాని నియంత్రణ చర్యలు

నెల్లూరు జిల్లా కావలిలోని కలుగోళమ్మ పేటలో 65ఏళ్ల బీబీజాన్‌పై రెండు పందులు శుక్రవారం దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించటంతో ప్రాణాలు నిలిచాయి.

విజయనగరంలోని గుంటూరివారి వీధిలో మూడు నెలల క్రితం వీధిలో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై పందులు దాడిచేశాయి. తీవ్ర గాయాలైన ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించడంతో ప్రాణ హాని తప్పింది..

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో పెచ్చుమీరుతున్న పందుల దాడులకు నిదర్శనమీ ఘటనలు.. ఇళ్ల ముందు కాలువల్లో, చెత్తకుండీల చుట్టూ ఆహారం కోసం మందలు మందలుగా ఎగబడే పందులు ఇప్పుడు ప్రజలపైకి దూసుకొస్తోండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు పందుల్ని చూస్తేనే హడలిపోయే పరిస్థితి. స్వైన్‌ఫ్లూ, మెదడువాపు వంటి వివిధ వ్యాధులకు మూలమవుతున్న పందులను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా నేటికీ ప్రజలకు వీటి బెడద తప్పడం లేదు.

● మెదడువాపు వ్యాధి బాధితుల సంఖ్య రాష్ట్రంలో పెరిగాక మూడు నెలల క్రితం పందుల నియంత్రణపై పురపాలక పట్టణాభివృద్ధిశాఖ దృష్టి సారించింది. వీటిని గుర్తించే సర్వే ఇప్పటికే 106 పట్టణాల్లో పూర్తయ్యింది. మరో నాలుగు పట్టణాల్లో నెలాఖరులోగా పూర్తిచేయనున్నారు. అనంతరం తదుపరి చర్యలపై విధివిధానాలు రూపొందించి పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలకు ఆదేశాలు జారీచేస్తారు.

● సమస్య తీవ్రంగా ఉన్న 87 పట్టణాల్లో గత ఐదు నెలల వ్యవధిలో 7వేల పందులపై పురపాలక యంత్రాంగం వేటువేసింది. మిగతా ప్రాంతాల్లో వీటిని పట్టణాలకు దూరంగా పెంచేలా అవగాహన కల్పిస్తున్నారు. అనంతపురం, చీరాల, తెనాలి, విజయవాడ శివారు, గుంటూరు, విజయనగరంలో పందుల సమస్య తీవ్రంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు గుర్తించాయి.

● 38 పట్టణాల్లో నిబంధనలకు విరుద్ధంగా పందుల పెంపకాన్ని చేపడుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పురపాలక కమిషనర్ల నుంచి అనుమతులు తీసుకోవాలి. రాజకీయ నేతల అండతో పెంపకందారులకు ఇవేవీ పట్టడం లేదు. ఏడు జిల్లాల్లో ఏడాదిన్నర వ్యవధిలో వీటి సంఖ్య రెండింతలైందని అధికార వర్గాలే అంగీకరిస్తున్నాయి.

● ప్రజారోగ్యంపై దుష్ప్రభావం చూపే పందులను పట్టణాలు, గ్రామాల్లోకి రాకుండా కట్టడి చేయాలని హైకోర్టు ఒక కేసులో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖకు స్పష్టంగా సూచించింది. అవసరమైతే కాల్చి చంపాలని ఆదేశించినా అత్యధిక పట్టణాల్లో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో చర్యలు తీసుకోడానికి వెనుకడుగు వేస్తున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో ఇలాంటి పరిస్థితి ఉంది.

● పట్టణాలకు దూరంగా పందుల్ని తరలించి అక్కడ కొంత ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి పెంపక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్న ఆదేశాలు అనంతపురంలోనే అమలుకు నోచుకున్నాయి. కమిషనర్ల చొరవ కరవై మిగతా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. అనంతపురంలో ప్రభుత్వ, ప్రయివేట్ ఆధ్వర్యంలో పందుల పెంపకానికి ప్రత్యేక కేంద్రాలను నెలకొల్పారు. మిగతాచోట్లా ఇలాంటివి ఏర్పాటుచేయాలన్న యోచన పురపాలక, పట్టణాభివృద్ధిశాఖకు ఉంది.

● పందులు పెంపకమే జీవనాధారమైన కుటుంబాలను ఇతర వృత్తుల్లోకి మళ్లించే ప్రయత్నం రాష్ట్రంలో మొదలైనా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మెప్మా, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి ఆయా కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందించి ఇతర చేతివృత్తుల్లోకి మళ్లించే కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా ఆరు జిల్లాల్లో అమలుచేసేలా కార్యాచరణ రూపొందించారు. అమలుకు నోచుకున్న దాఖలాల్లేవు.

● పందుల నియంత్రణకు తుపాకులు కొనుగోళ్ళ, డెప్యుటేషన్‌పై పోలీసు కానిస్టేబుళ్ల సేవలు వినియోగించుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలు పురపాలక, నగరపాలక సంస్థల్లో ఆచరణకు నోచుకోవడం లేదు. మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ)లో నాలుగున్నరేళ్ల క్రితం పందులను తుపాకులతో కాల్చుతున్నపుడు అదుపు తప్పి స్థానికులపైకి గుళ్లు దూసుకెళ్లడం గొడవలకు దారితీసింది. మిగతా ప్రాంతాల్లో పోలీసు కానిస్టేబుళ్ల సేవల వినియోగంపై దృష్టి సారించలేదు.



నెల్లూరు జిల్లా కావలిలో ఇళ్ల ముంగిటే పందుల సంచారం



విజయనగరం వీధుల్లో సూకర సంతతి

నాలుగు పురపాలక ప్రాంతీయ ప్రాంతాల వారీగా పందుల వివరాలు..	
అనంతపురం	43,000
గుంటూరు	28,000
రాజమండ్రి	25,000
విశాఖపట్నం	11,000

రాష్ట్రంలో పందుల పెంపకం కుటుంబాలు **4,752**

సర్వేలో గుర్తించిన పందులు **1,07,000**

ఇప్పటివరకు నిర్మూలించిన పందులు **7,000**



విశాఖ గాజువాక డంపింగ్ యార్డులో తిండి కోసం ఎగబడుతున్న వరాహాలు



అనంతపురంలో నిర్వహిస్తున్న పందుల పెంపక కేంద్రం

నియంత్రణకు ప్రత్యేక చర్యలు...



'పట్టణాల్లో పందుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నెలాఖరులోగా సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో పూర్తిగా నిరోధించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజారోగ్యంపై ప్రభావం చూపే పందుల పెంపకాన్ని ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. జిల్లా, పురపాలక స్థాయుల్లో కమిటీలు ఏర్పాటు చేసేలా మార్గదర్శకాలు జారీచేశాం. పట్టణాలకు దూరంగానే పందులను పెంచాలి. పట్టణాల్లోకి విడిచిపెడితే కఠినంగా వ్యవహరించాలని కమిషనర్లకు సూచించాం. అనంతపురం తరహాలో కొన్ని ప్రాంతాల్లో పెంపకం కేంద్రాల ఏర్పాటుకు యోచిస్తున్నాం. ఇందుకోసం అధ్యయనానికి వివిధ ప్రాంతాల నుంచి అధికారులను అనంతపురానికి పంపుతాం'

–డాక్టర్ కన్నబాబు, సంచాలకులు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ

21న రాష్ట్రపతి లద్దాఖ్ సందర్శన!

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఈ నెల 21న జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతం లద్దాఖ్‌ను సందర్శించనున్నారు. ఇటీవల చైనా సైనికులు చొరబాటుకు యత్నించగా భారత సైనికులు గట్టిగా అడ్డుకున్న ఈ ప్రాంతంలోనే సర్వసైన్యాధిపతి హోదాలో రాష్ట్రపతి పర్యటించనుండటం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్రపతి లద్దాఖ్ స్కౌట్స్‌కు చెందిన అయిదు బెటాలియన్లకు గౌరవ పురస్కారాలను అందజేయనున్నారు.

26న తెనాలికి ఉప రాష్ట్రపతి

తెనాలి(మారీస్‌పేట)న్యూస్‌టుడే: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ నెల 26న తెనాలి రానున్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి అధికారిక సమాచారాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ కోన శశిధర్, జిల్లా గ్రామీణ ఎస్పీ అప్పలనాయుడు శనివారం తెనాలి వచ్చారు. హెలిపాడ్‌ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ మంత్రి ఆలపాటి వెంకట్రామయ్య శతజయంతి సభలో పాల్గొనేందుకు ఉపరాష్ట్రపతి తెనాలి వస్తున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు గవర్నర్ వచ్చే అవకాశముందన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమతో మాట్లాడి కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రసాదం పథకంలో శ్రీశైలం క్షేత్రానికి గుర్తింపు

● రూ.45 కోట్లు మంజూరు
● మంత్రి మాణిక్యాలరావు వెల్లడి

తాడేపల్లిగూడెం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పట్టణాలను అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ప్రసాదం పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఈ పథకం కింద శ్రీశైలం క్షేత్రానికి రూ.45 కోట్లు మంజూరయ్యాయని దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కాకినాడను రూ.800 కోట్లతో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసేందుకు పూనుకుందని, మొదటి విడతగా రూ.225 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్రంలో పర్యటించనున్నారని ఇదే సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసవర్మ వెల్లడించారు.

రేపు భాజపా పాలిత సీఎంలతో మోదీ, అమిత్ షా భేటీ

ఈనాడు, దిల్లీ: భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షాలు ఈనెల 21న ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సంపూర్ణ విజయమే లక్ష్యంగా భాజపా అగ్రనేతలు వ్యూహరచన చేస్తున్నారు. ఇందులో భాగంగా దిల్లీలోని పార్టీ కార్యాలయంలో 13 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులతో భేటీ అవుతున్నారు. రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత అనేది లేకుండా తగిన వ్యూహరచన చేయాలని రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలకు మోదీ, షాలు సూచనలు చేస్తారని భాజపా నేత ఒకరు తెలిపారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజారంజక విధానాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఎలా చేరువ చేయాలో వివరిస్తారని పేర్కొన్నారు. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితిని మరింత మెరుగుపరిచేందుకు సీనియర్ కేంద్ర మంత్రులకు అమిత్ షా బాధ్యతలు అప్పగించారు. అసోం ఇన్‌ఛార్జిగా రవిశంకర్ ప్రసాద్‌కు, పశ్చిమ్‌బెంగాల్ బాధ్యతలను నిర్మలా సీతారామన్‌తో పాటు, జేపీ నడ్డాకు అప్పగించారు.

బోగస్ కాల్‌సెంటర్ ముఠా అరెస్టు

ముంబయి: భారీ మొత్తంలో నగదు ఆశజూపి పలువురిని మోసంచేసిన బోగస్ కాల్ సెంటర్ ముఠాను ముంబయి పోలీసులు ఛేదించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని నొయిడాకు చెందిన ఇద్దరు బీమా సంస్థ మాజీ ఉద్యోగులు సహా 8మందిని అరెస్టుచేశారు. '2015లో ముంబయికి చెందిన ఓ బాధితుడికి ప్రధాన నిందితుడు కప్తాన్ సింగ్ ఫోన్ చేశాడు. కొత్త బీమా పాలసీ తీసుకుంటే బహుమతి వస్తుందని ఆశజూపాడు. మళ్లీ ఫోన్‌చేసి రూ.32.47 లక్షలు బహుమతి తీసుకునేందుకు రుసుము చెల్లించాలని కోరాడు. ఏప్రిల్ 2015 నుంచి ఫిబ్రవరి 2017 మధ్య రూ.22.02 లక్షలు చెల్లించినా ఎలాంటి నగదు తనకు తిరిగి చెల్లించలేదని బాధితుడు చెప్పారు. ఆయన ఫిర్యాదుపైనే కేసు దర్యాప్తు చేపట్టాం'అని డీసీపీ నిసార్ తంబోలి తెలిపారు.



కళాకారులతో కలిసి కర్రసాము చేస్తున్న న్యాయమూర్తి రామలింగేశ్వరరావు

చెట్ల నరికివేతను యువత అడ్డుకోవాలి

- హైకోర్టు న్యాయమూర్తి రామలింగేశ్వరరావు

అద్దంకి, న్యూస్‌టుడే: పర్యావరణ దుష్పరిణామాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చెట్ల నరికివేతను యువకులే అడ్డుకోవాలని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా అద్దంకి, పంగులూరులో శనివారం పర్యటించిన న్యాయమూర్తి 'వనం-మనం' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పంగులూరులో జరిగిన కార్యక్రమంలో కర్రసామును ఆసక్తిగా తిలకించిన న్యాయమూర్తి.. కర్ర చేతపట్టి కళాకారులతో కలిసి ఆడారు. అనంతరం మాట్లాడుతూ.. ముంబయి వంటి నగరాల్లో కృత్రిమ ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితికి పచ్చదనం లేమే కారణమన్నారు. బోరు వేసే, చెట్లు నరికే సమయాల్లో ఎవరూ చట్టాలను అతిక్రమించకుండా చూడాల్సిన బాధ్యతను యువత తీసుకోవాలన్నారు. అనంతరం అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు దత్తతఇచ్చారు. కార్యక్రమంలో గ్రామభారతి ట్రస్టు అధ్యక్షులు ఘంటా రామారావు, బొడ్డు భాస్కరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కరి రామకృష్ణారావు, వీరవల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆధార్ ఉంటే రాష్ట్రమేదైనా సిమ్‌కార్డు

ఈనాడు, హైదరాబాద్: కొత్త సిమ్ కార్డు తీసుకునేందుకు చిరునామా సమస్య ఎదుర్కొంటున్నవారికి బీఎస్ఎన్ఎల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిళ్లు పరిష్కారం చూపించాయి. ఆధార్ సంఖ్య ఉంటే ఇతర రాష్ట్రాలవారికైనా తక్షణమే కొత్త సిమ్‌కార్డును యాక్టివేట్ చేస్తామని తెలంగాణ టెలికాం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్. అనంతరాం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కొత్త గురుకుల పాఠశాలలకు పోస్టులు

ఈనాడు అమరావతి: బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మత్స్యకార పిల్లల కోసం ఆరు జిల్లాల్లో ప్రారంభించే గురుకుల పాఠశాలలకు బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 13 ఉపాధ్యాయ పోస్టుల కోసం శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టేలా, బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల కింద ఎంపిక చేసుకునేలా ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి బీసీ సంక్షేమశాఖకు అనుమతులిచ్చారు.

సైనిక వైద్యుల వేతనాలు పెంపు

దిల్లీ: సైనిక వైద్యులు, వైద్య నిపుణుల వేతనాలను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకొంది. మాజీ సైనికుల భాగస్వామ్య ఆరోగ్య పథకం కింద నిర్వహిస్తున్న పాలిక్లినిక్‌ల ఆఫీసర్ ఇన్‌ఛార్జి, వైద్యాధికారులు, డెంటల్ అధికారులకు నెలకు రూ.75 వేలు చెల్లిస్తారు. వైద్య నిపుణులకు మొదటి ఏడాది నెలకు రూ.87 వేలు, రెండో ఏడాది నుంచి రూ.లక్ష చెల్లిస్తారు. నిర్ణయం తక్షణం అమల్లోకి వచ్చింది.

వేతనాల కోసం వేదన!

● ఉపాధి కూలీల బకాయిలు రూ.500 కోట్లు పైనే
● కేంద్రం నుంచి రావలసినవి రూ.1951 కోట్లు
● ఇప్పటికే రూ.1351 కోట్ల రాష్ట్ర నిధుల సర్దుబాటు
● చెల్లింపులపై చేతులెత్తేస్తున్న అధికారులు

ఈనాడు – అమరావతి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన బకాయిలు రోజురోజుకీ పోరుకుపోతున్నాయి. నెల రోజుల పనుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్లపైనే చెల్లించాల్సిన పరిస్థితి. వేతనాల చెల్లింపులు వారం రోజులకు మించరాదని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా... నిధులు ఉన్నంతమేరకు ఇన్నాళ్లు సర్దుబాటు చేస్తూ వచ్చిన అధికారులు ఇప్పుడు పూర్తిగా చేతులెత్తేశారు. చేసిన పనికి ప్రతిఫలం అందక ఉపాధి కూలీలు లబోదిబోమంటున్నారు. నెల రోజుల వరకు చేసిన పనులకు మాత్రమే బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికార వర్గాలు చెబుతున్నా, అనేక జిల్లాల్లో రెండు నెలలైనా కూలీల చేతికి వేతనాలు అందలేదని సమాచారం. పలు జిల్లాల్లో బ్యాంకుల, తపాలా కార్యాలయాలకు వెళ్లడం ఖాతాల్లో వేతనాలు జమ కాలేదని తెలిసి నిరాశతో వెనుతిరగడం కూలీలకు నిత్యకృత్యమవుతోంది.



విశాఖ జిల్లా అనంతగిరిలో ఉపాధి వేతనాల కోసం తపాలా కార్యాలయం ముందు కూలీల అగచాట్లు

ఉపాధి హామీ పథకం అమలు నుంచి కూలీలకు చెల్లింపుల వరకు మిగతా రాష్ట్రాలతో పోల్చిచూస్తే ఆంధ్రప్రదేశ్ ఎంతో ముందుండేది. కేంద్రం నుంచి సకాలంలో నిధులు విడుదలవ్వకపోయినా రాష్ట్ర బడ్జెట్ నుంచి ఎంతో కొంత కేటాయించి కూలీలకు ఇబ్బంది లేకుండా చెల్లింపులు చేసే పరిస్థితి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాక చెల్లింపుల్లో జాప్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు చేసిన ఉపాధి పనులపై కేంద్రం నుంచి రూ.రూ. 1951 కోట్లు రావాలి. ఇందులో వేతనాలతోపాటు 'మెటీరియల్ కాంపోనెంట్' కింద చేసిన పనుల బిల్లులూ ఉన్నాయి. జూన్, జులై నెలల్లో వేతనాల కిందే రూ.600 కోట్లకుపైగా కేంద్రం చెల్లించాలి. కూలీలకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి రూ.1351.81 కోట్లు ఖర్చు చేశారు. కేంద్రం నిధులు విడుదల చేశాకే మినహాయించుకోవచ్చన్న ఉద్దేశంతో తాత్కాలికంగా సర్దుబాటు చేసింది. ఇప్పటికే ఆర్థిక లోటులో ఉన్న ప్రభుత్వానికి మిగిలిన మొత్తాన్ని సర్దుబాటు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఇదే విషయాన్ని ఇటీవల దిల్లీ పర్యటనలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ముందు ప్రస్తావించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన ఉపాధి నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదుల ప్రభావం?

ఉపాధి హామీ పనులపై కేంద్రానికి ఫిర్యాదుల ప్రభావం నిధుల విడుదలపై పడిందన్న వాదనా వినిపిస్తోంది. ఇప్పటికే రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో కేంద్ర అధికార బృందాలు ఉపాధి హామీ పనుల తీరును పరిశీలించాయి. ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రానికి సమగ్ర వివరణ పంపింది. ఒక ఫిర్యాదుపై వివరణ ఇచ్చుకునేలోగా రెండో ఫిర్యాదుతో అధికారులూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనకపోతే గ్రామీణ ప్రగతి, ప్రజలకు ఉపాధి దెబ్బతినే అవకాశాలున్నాయని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ఉపాధి హామీ పథక స్వరూపం..	
జిల్లాలు	13
మండలాలు	661
గ్రామ పంచాయతీలు	12,947
ఆవాస ప్రాంతాలు	47,138
జారీ చేసిన ఉపాధి జాబ్ కార్డులు	86,10,312
కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు	రూ.500 కోట్లు

తెదేపా పాలనలో పురపాలక సంఘాల సమగ్రాభివృద్ధి

మంత్రి నారాయణ

ఈనాడు అమరావతి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పురపాలక సంఘాలను సమగ్రంగా అభివృద్ధి చేసి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌర సేవల కోసం ప్రజలు గంటల తరబడి నిరీక్షించే అవకాశం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. పురపాలక సంఘాల్లో అన్ని సేవల నుంచి చెల్లింపుల వరకు ఆన్‌లైన్ విధానం అమలులో ఉన్నట్లు తెలిపారు. పట్టణీకరణకు అనుగుణంగా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. కేంద్రం ప్రకటించిన స్వచ్ఛభారత్ గణాంకాల్లో రాష్ట్రం మెరుగైన స్థానాన్ని దక్కించుకున్న విషయాన్ని ప్రస్తావించారు. 2018 నాటికి బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా పట్టణాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు మంత్రి వివరించారు.



సత్యసాయి ఆరోగ్య ప్రేమాంజలి చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ, కర్ణాటక మంత్రులు, ట్రస్టు సభ్యులు, వైద్యులు

సత్యసాయి సంస్థలు వైద్య వ్యవస్థకే ఆదర్శం

● మంత్రి కామినేని శ్రీనివాస్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: వైద్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో పైసా ఖర్చు లేకుండా వైద్యాన్ని అందిస్తున్న సత్యసాయి వైద్య సంస్థలు..వైద్య వ్యవస్థకు ఆదర్శమని ఏపీ, కర్ణాటక వైద్యారోగ్యశాఖ మంత్రులు కామినేని శ్రీనివాస్, రమేష్‌కుమార్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి జాతీయ వైద్య సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే సదస్సును ఇరువురు మంత్రులు, ట్రస్టు సభ్యులు రత్నాకర్, ప్రసాదరావు, కేర్ ఆసుపత్రి డైరెక్టర్ సోమరాజు తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సదస్సులో 'శ్రీసత్యసాయి ఆరోగ్య ప్రేమాంజలి' చిహ్నాన్ని (లోగో) ఆవిష్కరించారు. అనంతరం ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ..వైద్య సేవలు భారీ ఖర్చుతో ముడిపడి ఉన్న ఈ రోజుల్లో గ్రామీణ నిరుపేదల చెంతకే వెళ్లి ఆధునిక వైద్యసేవలందించడం సాయి వైద్య సంస్థలకే సాధ్యమన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో ఉన్న అపనమ్మకాన్ని తొలగించే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులకు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే తాను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నట్టు చెప్పారు. సత్యసాయి వైద్య సేవలను ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సదస్సులో 45 మంది వైద్యులకు ధన్వంతరి అవార్డులను ప్రదానం చేశారు.

బకాయిల విడుదలకు తెలంగాణ డిస్కమ్స్‌పై న్యాయపోరాటం!

ఈనాడు, అమరావతి: తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్స్) నుంచి రావలసిన బకాయిల విడుదలపై ఏపీజెన్‌కో న్యాయపోరాటానికి సిద్ధమైంది. కనీసం సింగరేణి కాలరీస్‌కు తాము ఇవ్వాల్సిన మొత్తాన్నయినా తొలుత ఇవ్వాలని పదేపదే విన్నవించినా తెలంగాణ డిస్కమ్స్ నుంచి స్పందన లేకపోవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. బకాయిల వివాదం నేపథ్యంలోనే జూన్ 11 నుంచి తెలంగాణ డిస్కమ్స్‌కు ఇస్తున్న విద్యుత్‌ను ఏపీజెన్‌కో నిలిపివేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ డిస్కమ్స్‌కు ఇచ్చే విద్యుత్‌ను తెలంగాణ జెన్‌కో ఆపేసింది. మే నాటికి తెలంగాణ డిస్కమ్స్ నుంచి రూ.3,803 కోట్లు తమకు రావలసి ఉందని, తాము సింగరేణి కాలరీస్‌కు రూ.1,437 కోట్లు చెల్లించాల్సి ఉందని దక్షిణప్రాంత లోడ్ డిస్పాచ్ సెంటర్‌కి గతంలో రాసిన లేఖలో ఏపీజెన్‌కో తెలిపింది.

రెగ్యులర్ ఉద్యోగులతోపాటే అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు: ఏపీట్రాన్స్‌కో

రెగ్యులర్ ఉద్యోగులతోపాటు ప్రతి నెలా అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా వేతనాలు అందే విధంగా చూడడానికి ఏపీట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పరుచూరి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హాజరు వివరాలను ప్రతి నెలా 21వ తేదీకే పంపాలని వివిధ విభాగాల అధిపతులను కోరారు.

ఈనాడు

మెదడును మథిస్తేనే...

మస్తకం అంటే తల. మస్తిష్కం అంటే మెదడు. మస్తిష్కం కలిగినది కాబట్టి- మస్తకం అన్నారు. మానవ మస్తిష్కం శక్తి అపరిమితమైనది, అనంతమైనది. ఆదిమ జాతికి, ఆధునిక జగతికి మధ్య ఇంతటి వ్యత్యాసానికి కారణం- మానవ మస్తిష్కపు సముచిత వినియోగమే. 'మెదడన్నది మనకున్నది అది సరిగా పని చేస్తే విశ్వరహః పేటిక విపాటన జరగక తప్పదు' అన్న శ్రీశ్రీ ఉవాచ- మెదడు అపరిమిత శక్తికి పతాక శీర్షిక! 'కాలాన్ని కాగితం చేసుకుంటా... దానిమీద స్వప్నం రాసిస్తా... దానికింద నా ఊపిరితో సంతకం చేస్తా' అనేది మెదడు సత్తా ఎరిగిన కవి శేషేంద్ర పూనిక! 'అరయ నా భావనా శక్తికి అవధి లేదాయె' అన్న విశ్వనాథ ధీమా మెదడు అనంతత్వానికి జయపతాక! అయితే, అందరూ ఆలోచించరు. కొందరికి ఆలోచించే అవసరం లేదు. 'నేను సజీవుణ్ని' అనే అర్హత మనిషికి మాత్రమే ఉందన్నది యోగ వాసిష్ఠం! ఎందుకంటే, 'మననే వహి జీవతి... జ్వలించే ఆలోచనలతో సృజనాత్మకంగా జీవిస్తాడు కనుక' అంది. కవిత్వ రచన దానికి పరమోదాహరణ. 'భారతం నిజంగా జరిగి ఉంటే అద్భుతం. కవి కల్పనే అయితే పరమాద్భుతం' అన్న జార్జి బెర్నార్డ్ షా నివాళి- వ్యాసముని సృజన పాటవానికి కనకాభిషేకం. 'సమ్మోహిని' అనే మత్తుమందిచ్చి, భోజరాజు మెదడు కణితిని తొలగించిన 'భోజ ప్రబంధం'లోని శస్త్రచికిత్సా నైపుణ్యం- సత్యమే అయితే ఆ నేర్పునకు జేజేలు. కల్పనే అయితే ఆ ఊహకు జోహార్లు. మనిషి దేహానికి ఏనుగు తలను అతికించాలన్న యోచన- మెదడును పూర్తిస్థాయిలో ఉపయోగించే బుర్రకు మాత్రమే తోచే ఆలోచన! 'పెళపెళ మరిగే మనసుంటేనే తళతళ ఊహలు తోచేది, సలసల కాగిన పిదపే పాలకు కమ్మని పరిమళమొచ్చేది' అన్న కవి వాక్కు అక్షర సత్యం!

లోకంలోని ఎన్నో వినూత్న ఆవిష్కరణలకు మానవ మస్తిష్కం మూలకారణంగా నిలిచింది. లోకుల హృదయాలను గెలిచింది. 'రాలిన పండ్లు కూడ కథలన్ విన్పించె ఆ జ్ఞానికిన్' అంటూ కవుల ప్రశంసలందుకున్నాడు న్యూటన్ మహాశయుడు. 'ప్రకృతి నిగూఢ భాషకు కళాత్మక భాష్యమెరింగి... ప్రకటిత హోమియో మధుర వైద్యము, టీక రచించె క్రొత్తగా' అని జోతలందుకున్నాడు హానిమన్. వీరంతా మెదడుకు పదును పెట్టిన మేధావులే! 'చిన్న పెద్ద లేదు మిన్నైన మన్నైన తరచగలడు వెలుగు పరచగలడు' అని మనిషి పట్ల గొప్ప ఆశాభావం లోకానికి. 'మనిషి ప్రజ్ఞకు దేవతలు సైతం ఈర్ష్యపడతారు' అన్నారు రచయిత రాంషా. హనుమంతుడి నోట విశ్వనాథ పలికించిన 'పుడమిం చీల్చెద రెండుగా నడిమికిన్... భూమీ ధరంబుల్(పర్వతాలను) పొడిం పొడిగా చేసెద, వార్ధి వారి (సముద్ర జలాలను) ధరణిం పూరింతు గగ్గోలుగా' అన్నది మనిషి అంతస్సత్వానికి చెందిన ప్రకటన! 'జగన్నాథ రథచక్రాలను భూ మార్గం పట్టిస్తాను భూకంపం పుట్టిస్తాను' అని శ్రీశ్రీ గర్జించడం సైతం మనిషి సామర్థ్య ప్రకటనే! మనిషి మెదడుకు ఆ సత్తా నిశ్చయంగా ఉంది. మనసు పెట్టి ఆలోచిస్తే సృష్టి రహస్యాలెన్నో మనిషి దృష్టికి వచ్చి తీరుతాయి. కాకపోతే, 'నాకు మెదడుంది' అనుకుంటే చాలదు. పూర్తిస్థాయిలో దాని సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంలోనే ఉంది మనిషి గొప్పదనం. అరకొర మెరుపులతో నల్ల కొండలా మెరుస్తున్నందుకు కాదు- అఖండ వర్షంగా కురుస్తున్నందుకు, భూమిని పండిస్తున్నందుకు మబ్బుకు మన్నన లభిస్తుంది. 'చీకటులన్ భరియింపలేనిచో జీవిని జీవకళల్ వరియింప నేర్చునే?' అన్న పరమ సత్యాన్ని మనిషి గుర్తించాలి. తీవ్రంగా శ్రమించాలి. మెదడును పూర్తిగా ఉపయోగించాలి. అప్పుడే మనిషి జన్మ ధన్యమవుతుంది. 'నిప్పును కనుగొన్నంతనె చప్పన యగు జీవితాన చవి(రుచి) జనియించెన్' అని మనిషి ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

కవి బుర్రలోంచి కవిత పురుడు పోసుకోవడం ఎంత సంక్లిష్ట భరిత ప్రక్రియా విశేషమో చెబుతూ విశ్వనాథ, దాన్ని 'లలాటంతప రూక్షచింతన' అన్నారు. అంటే, నిశితమైన ఆలోచనలతో మెదడు వేడెక్కి నుదుట చెమట బిందువులు అంకురించడం! అంత తపన దేనికంటే 'కాలాంతర కీర్తి వ్యష్టిగతమై చను లాభము నెంచుచున్...' కావ్యం ద్వారా రేపెప్పుడో వర్షించే కీర్తికోసం అన్నారు. కవులే కాదు- కళాకారులు, శాస్త్రజ్ఞులు, పరిశోధకులు... అందరిదీ ఇదే ఆలోచన. ఆ క్రమంలో అద్భుతాలు ఆవిష్కారం అవుతాయి. లోకానికి మేలు చేస్తాయి. 'అంబుధి బోలు శాస్త్రములకు అంతు కనుంగొన ఈదు వేళ ఊహం పులకింప చేసెడి రహస్యములు ఎన్నియొ కానవచ్చు' అన్నారు గరికిపాటి. స్థిరవాణిని కనుగొనే క్రమంలో గ్రాహంబెల్ 'ఎంత తపించిపోవ జనియించినదో అది!' గమనించాలి. ఇటీవల ఒకవైపు రోగి స్పృహలో ఉండి గిటారు వాయిస్తుంటే- మరోవైపు వైద్యనిపుణులు అతడి మెదడుకు శస్త్రచికిత్స చేశారని తెలిస్తే మనం జేజేలు చెప్పక తప్పదు. చేతివేళ్ల కదలికకు కారణం మెదడునుంచి అందే సంకేతాలే! వయొలిన్ వీణ గిటారు వంటి పరికరాలు వాయించేటప్పుడు వేళ్లు సహకరించకపోతే- వాటి కదలికను నియంత్రిస్తున్న మెదడును సరిచేయాలి. మెదడులో ఏ భాగం మరి దానికి కారణం అవుతోందో తెలియాలంటే తీగలను వేళ్లు సవరిస్తూనే ఉండాలి. బెంగళూరులోని మహావీర్ జైన్ ఆస్పత్రి వైద్యనిపుణులు 'మ్యుజీషియన్స్ డైస్టోనియా' అనే ఆ వ్యాధి చికిత్సకు ఇంతటి అద్భుత సంక్లిష్ట శస్త్రచికిత్స చేబట్టి విజయం సాధించారు. మెదడును పూర్తిగా ఉపయోగించే ఇలాంటి మేధావులే 'అద్భుతములు సృష్టి సేతురు అవనీ స్థలిలో!' అనక తప్పదు. 'కానిది లేదు మానవుడు గాఢతరమ్ముగ దీక్ష పూనుచో' అన్న కవివాక్కును ఈ ప్రతిభావంతులు మరోసారి గొప్పగా రుజువు చేశారు.

కమలం కదన కుతూహలం!

భారతీయ జనతాపార్టీలో సంపూర్ణ ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోందిప్పుడు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఎదురే లేదని, మరోమారు అత్యద్భుత విజయాన్ని సొంతం చేసుకొని తీరుతామని ఆ పార్టీ గట్టిగా నమ్ముతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షా సహా పాలకపక్షంలోని ప్రతీఒక్కరూ ఎన్డీఏ రెండో దఫా విజయంమీద భరోసా వ్యక్తంచేస్తున్నారు. రాజకీయాలు ముందు ఎలాంటి మలుపులు తిరుగుతాయో చెప్పలేం. పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అయినాసరే, వరసగా రెండోసారి అధికార పీఠాన్ని కైవసం చేసుకోకుండా ఎన్డీఏను అడ్డుకోవడం విపక్షాలకు సాధ్యంకాదనిపిస్తోంది. మోదీ వ్యతిరేకులు సైతం ఇప్పుడు ఈ మాట కాదనడంలేదు. మొన్న, ఆగస్టు 15న ఎర్రకోట బురుజులపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ సందేశమిస్తూ ప్రధానమంత్రి ఎన్నో విషయాలు చెప్పారు. ఆయన పెట్టుకొన్న లక్ష్యాలు మాత్రం 2022 లోపున పూర్తిస్థాయిలో నెరవేరే అవకాశాలు లేవని ఆ ప్రసంగం లోతుల్లోకి వెళ్లినప్పుడు స్పష్టమవుతుంది. మరోవైపు ప్రజలు ప్రధానిపై పూర్తి నమ్మకం కలిగి ఉన్నారు. ఒక ప్రముఖ మీడియా సంస్థ ఇటీవల జరిపిన జనాభిప్రాయ సేకరణలో ఇదే విషయం వెల్లడైంది. దరిమిలా పాలక పక్షంలో ఆత్మవిశ్వాసం మరింత ఇనుమడించింది. ఆ సర్వే ప్రకారం ఈ రోజున ఎన్నికలు నిర్వహిస్తే ఎన్డీఏకు దాదాపు 350 లోక్‌సభ సీట్లు దక్కుతాయి. 350 సీట్లు గెలుచుకోవడమే తమపార్టీ లక్ష్యమని అమిత్ షా అంటున్నారు. ఆ సర్వే ఫలితాన్ని ప్రాతిపదికగా తీసుకొనే ఆయన ఆ లక్ష్యాన్ని నిర్దేశించుకొన్నారేమో అనిపిస్తోంది. నేడు ప్రతిపక్షం కకావికలమై అత్యంత అయోమయావస్థను ఎదుర్కొంటున్న మాట నిజం. ఇప్పట్లో అది కోలుకొని, నిలదొక్కుకుంటుందా అనేది అనుమానమే. ఇటు ప్రధానమంత్రి మోదీకి ప్రజానీకంలోగల పట్టు ఎంతమాత్రం చెక్కు చెదరలేదు. పైగా ఆయన నానాటికీ బలోపేతుడవుతున్నారు. ఇలాంటప్పుడు పార్టీ లక్ష్యాన్ని సాధించడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు.



సమన్వయంతో ముందుకు

భారతీయ జనతాపార్టీ జాతీయ అధ్యక్షుడిగా అమిత్ షా పకడ్బందీ వ్యూహాలు రచిస్తున్నారు. పార్టీలో కిందినుంచి పైవరకు కొత్త ఉత్సాహం నింపారు. ఇప్పటివరకు భాజపా ఉనికి పెద్దగాలేని రాష్ట్రాల్లో సైతం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండేలా, ప్రజలతో మమేకమయ్యేలా, ప్రజాసంబంధాలను పటిష్ఠం చేసుకొనేలా గట్టి చర్యలు తీసుకున్నారు. భారీయెత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. అమిత్ షా ముద్ర అడుగడుగునా కనిపిస్తోంది. ఇదే సమయంలో మరో ముఖ్య విషయం గమనించాలి. నరేంద్ర మోదీ వంటి శక్తిమంతుడు, గొప్ప జనాకర్షణశక్తిగల నాయకుడు తోడుగా లేకుండా ఉంటే, అమిత్ షా ఇన్ని విజయాలు సాధించగలిగి ఉండేవారు కాదు. జనాకర్షణ విషయంలో ఏడో దశాబ్దంనాటి ఇందిరాగాంధీని మోదీ మరిపిస్తున్నారు. మోదీ ఆకర్షణ శక్తి సూదంటురాయిని తలపిస్తోంది. భాజపా నేడు దేశవ్యాప్తంగా ఘనవిజయ కేతనాలు ఎగురవేస్తోందంటే, అందుకు ముఖ్య కారణం ఇదే.

మోదీ జనాకర్షణ శక్తిని ఎంతవరకు సీట్లుగా మలచగలరన్నది అమిత్ షా శక్తి సామర్థ్యాల మీద ఆధారపడి ఉంటుంది. వాజ్‌పేయీ సంగతే చూడండి. దేశవ్యాప్తంగా విశేష ఆదరాభిమానాలు చూరగొన్న విశిష్ట నాయకుడాయన. ఆయన జనాకర్షణ శక్తి ఏమీ తక్కువ కాదు. అయినా, ఆయన ఆకర్షణ శక్తిని సీట్లుగా మలచేవారు అప్పుడు లేకుండా పోయారు. అడ్వాణీ గొప్ప కార్యదక్షుడే. కాదనలేం. కానీ, ప్రధాని పదవికి ఆయనా పోటీదారే. అలాంటప్పుడు వాజ్‌పేయీని మళ్ళీ గెలిపించడానికి ఆయన మనస్ఫూర్తిగా గట్టి ఎన్నికల వ్యూహాలు రచించి ఉండకపోవచ్చు, ప్రచారం నిర్వహించి ఉండకపోవచ్చు. గెలుపు-ఓటములను నిర్ణయించేది కొద్దిపాటి ఓట్ల తేడానే. చివరకు ఆ తేడాయే వాజ్‌పేయీ పునర్విజయానికి విఘాతంగా పరిణమించి ఉంటుంది. అమిత్ షా విషయం అలా కాదు. ఆయన మోదీకి ప్రత్యర్థి కాదు. మోదీ స్థానే ప్రధానమంత్రి పీఠంపై కూర్చోవాలన్న ఆసక్తి ఇప్పటికైతే ఆయనకు ఉన్నట్లు కనిపించడంలేదు. ఇద్దరూ గుజరాతీలే. పరస్పర అవగాహన, చక్కటి సమన్వయ-సహకారాలతో ముందుకెళుతున్నారు. రెండోదఫా విజయం సాధిస్తే, 2024లో పదవీకాలం ముగిసేవరకు మోదీకి ఆయన ఎలాంటి అడ్డంకులూ కల్పించకపోవచ్చు. తరవాత పార్టీకి ఎవరు సారథ్యం వహిస్తారో, ప్రజలు ఎవర్ని కోరుకుంటారో చెప్పలేం. వరసగా మూడోసారి గెలుపు గుర్రాన్నెక్కడం మాత్రం ఎవరికైనా కొంచెం కష్టమే. 2024 తరవాత మోదీ స్వచ్ఛందంగా తప్పుకొంటే, ప్రధానమంత్రి పదవికి అభ్యర్థిగా ఎంపికయ్యే అవకాశం అమిత్ షాకు దక్కవచ్చు. ఆయన అవకాశాలకు గండికొట్టేవారు భాజపాలో లేకపోలేదు. కానీ, వ్యూహ చతురుడైన అమిత్ షాకు అలాంటి అవరోధాలను అధిగమించే సత్తా ఉంది.

ప్రస్తుత పరిస్థితికి వద్దాం. మోదీ-షా ద్వయం మరో లోక్‌సభ ఎన్నికలను

విపక్ష శిబిరం అతలాకుతలం

గెలిచే అవకాశాలు ఇప్పటికైతే ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ప్రజలు మోదీ పట్ల ఇంతటి ఆదరాభిమానాలు వ్యక్తపరచడానికి కారణం- ప్రభుత్వ ఆలోచనలను ప్రజలకు సమర్థంగా చేరవేయడం, గొప్ప వాగ్ప్రవాహం మాత్రమే కాదు. ఇంకా అనేక అంశాలు అందుకు దోహదపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిపాలనలో తేడాను 'ఆమ్‌ఆద్మీ' గ్రహించగలుగుతున్నాడు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి వంటగ్యాసు (ఎల్‌పీజీ) సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు ఇప్పుడు చక్కగా అమలవుతున్నాయి. పేదరికాన్ని రూపుమాపేందుకు ఉద్దేశించిన కార్యక్రమాల అమలులో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. అవినీతి, నల్లధనంపై ప్రభుత్వం యుద్ధమే ప్రకటించింది. ఇలాంటి ఎన్నో కారణాల వల్ల ప్రధానమంత్రి పేరుప్రతిష్ఠలు ఇనుమడిస్తున్నాయి. అవినీతి మరక అంటని స్వచ్ఛనాయకుడిగా, పేదలను పట్టించుకుని, వారి అభ్యున్నతికి పాటుపడే నేతగా మోదీ పేరు ప్రఖ్యాతులు నానాటికీ కాంతులీనుతున్నాయి. అన్నింటికీ మించి- మోదీ వ్యతిరేక పక్షాలు కుప్పకూలబడిపోవడం, ఇప్పట్లో అవి లేచి నిలబడే సూచనలు కనిపించకపోవడం- 2019లో తిరిగి అధికారంలోకి వస్తామన్న ధీమాను భాజపాలో పెంచుతున్నాయి.

పరిణతి లేని రాహుల్

నీతిమంతుడిగా పేరుపొందిన నితీశ్ కుమార్‌ను 2019 ఎన్నికల్లో ప్రధానమంత్రి పదవికి అభ్యర్థిగా ముందుకు తేవాలని కొన్ని ప్రతిపక్షాలు భావించాయి. నితీశ్ ఇప్పుడు మళ్లీ మోదీ శిబిరంలోకి చేరడంతో వాటి గుండెలపై బండరాళ్లు పడ్డట్లయింది. జేడీ(యు) అధ్యక్షుడిగా వ్యవహరించిన శరద్ యాదవ్ భిన్నస్వరం వినిపించి ఇప్పుడు ఎటూకాకుండా పోయారు. శరద్ యాదవ్ ఎప్పుడూ స్వయంసిద్ధ నాయకుడు కాదు. పార్లమెంటులో సభ్యత్వం కోసం ప్రతిసారీ ఇతరులమీదే ఆధారపడ్డారాయన. ఇప్పుడు రాజకీయ జీవిత చరమాంకంలో మాత్రం తన ఉనికి చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు ఫలించే అవకాశాలు లేవు. ప్రతిపక్షాలకు కొత్త ఊపిరి అందే పరిస్థితులూ లేవు. ఇక మమతా బెనర్జీ సంగతి. పశ్చిమ్ బంగ మినహా ఎక్కడా ఆమె ప్రభావం లేదు. లాలు ప్రసాద్ యాదవ్ వివిధ కేసుల ఉచ్చులో ఇరుక్కుపోయారు. కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? రాజకీయంగా ఇంకా ఓనమాల దశే దాటలేదు. ఎంతమాత్రం పరిణతి కనబరచడం లేదు. కాంగ్రెస్ పార్టీకి పెద్ద గుదిబండగా, ప్రతిపక్ష ఐక్యతకు తీవ్ర అవరోధంగా మారారాయన. బానిస సంకెళ్లు తెగతెంచుకుని, ఆ కుటుంబం నీడసోకని కొత్త నాయకత్వాన్ని ఎంచుకొనేంత గుండెధైర్యం ఆ పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. ప్రతిపక్ష రథచక్రాలు నేలలో కూరుకుపోవడానికి అదే ప్రధాన కారణమని వారు గ్రహించడంలేదు. కాంగ్రెస్‌లో యువరాజు హవా కొనసాగినంతకాలం విపక్షాలు ఒక జట్టుగా ముందుకు కదలడం కష్టమే.

అంతా బాగానే ఉందికదా అని మోదీ-షా ద్వయం దిలాసాగా, ఏమరుపాటుగా ఉండటం కూడా సరికాదు. ప్రజల మనసు ఎప్పుడు ఎలా మారుతుందో ఎవ్వరూ చెప్పలేరు. నేడు ఉన్నట్లే రేపు ఉండకపోవచ్చు. తిరుగులేదనుకొన్న పాలక పక్షాలు, తీరా ఎన్నికల ఫలితాలు చూసి తెల్లమొహం వేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా, కొట్టొచ్చినట్లు కనిపించే కొన్ని పొరపాట్లు వారిని ప్రభావితం చేయవచ్చు. గోరక్షణ పేరుతో కొంతమంది రెచ్చిపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వివిధ అంశాలపై కొందరు విషం చిమ్ముతున్నారు. లవ్-జిహాద్‌ను వ్యతిరేకిస్తున్న మరికొందరు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. కొన్ని చోట్ల హిందీ భాషాభిమానం వెర్రితలలు వేస్తోంది. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం చాలా జాగ్రత్తగా వ్యవహరించక తప్పదు. హద్దు దాటేవారిని అదుపు చేయాల్సిందేనడంలో మరో మాటలేదు. రాహుల్ గాంధీ కారణంగా కాంగ్రెస్ డీలా పడిపోవడమే కాకుండా, ప్రతిపక్షాలు జట్టుకట్టే అవకాశాలకు గండిపడిందని ప్రభుత్వానికి తెలుసు. ఇలాంటి సమయంలో తనపై విమర్శలు, ఆరోపణలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలి. తద్వారా ప్రతిపక్షాలమీద అది కోలుకోలేని దెబ్బ తీయవచ్చు. ఉదారవాదులతో ఘర్షణకూ దూరంగా ఉండాలి. దానివల్ల మోదీ విమర్శకుల నోటికి తాళం పడుతుంది. భాజపా పునాది మరింత బలపడుతుంది.

శరద్ యాదవ్ సొంతదారి వెనక...

నితీశ్‌కుమార్ మళ్ళీ ఎన్డీఏ గూటికి చేరినప్పటికీ, జేడీ(యూ) అధ్యక్షుడిగా వ్యవహరించిన శరద్ యాదవ్ భిన్నమైన దారిలో ఎందుకు వెళ్లినట్లు? శరద్ యాదవ్ అంటే మోదీకి అసలు ఇష్టంలేదని విశ్లేషకులు అంటున్నారు. ఎన్డీఏ ఛత్రచ్ఛాయలోకి వచ్చిన జేడీ(యూ) నాయకుల్లో కొందరికి మోదీ కేంద్ర మంత్రిమండలిలో చోటు కల్పించే సూచనలు ఉన్నాయి. శరద్‌యాదవ్‌కు మాత్రం ఆ అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ దక్కదని ముందుగానే స్పష్టమైపోయిందని అంటున్నారు. ఆయన నితీశ్‌తో విభేదించి సొంతకుంపటి పెట్టుకోవడానికి ఇదే కారణమని చెబుతున్నారు. పరిస్థితుల్ని చూస్తుంటే ఈ వాదనలో బలం ఉన్నట్లే కనిపిస్తోంది!

వీరూ.కె

రాచరిక రాజకీయాలు

'ఇది నేను స్థాపించిన పార్టీ... నాతో వచ్చిన పార్టీ నాతోనే పోతుంది'- ప్రజాస్వామ్య మౌలిక సిద్ధాంతానికి ఏమాత్రం పొసగని నేతాగణాల మనోవికారం అది. ప్రజలకు మంచి చెయ్యాలన్న తలంపుతో పాటు, భిన్న మార్గంలో అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించగల వీలుందో సిద్ధాంతీకరిస్తూ, ఆ సైద్ధాంతిక ప్రాతిపదికకు కట్టుబాటును చాటే సమూహ శక్తి- పార్టీ. ఏక వ్యక్తి పెత్తనమో, ఏక కుటుంబ వారసత్వమో జవజీవాలుగా మనుగడ సాగించే వాటిని పార్టీలుగా గుర్తించడమే తప్పు. తరతమ భేదాలతో అలాంటి పార్టీలతోనే దేశం లుకలుకలాడి పోతుండటం- డెబ్బయ్యేళ్లుగా భారత ప్రజాస్వామ్యానికి పట్టిన తుప్పు! దాన్ని ఎలా వదలగొట్టాలో ఆలోచించే ముందు- తమిళనాట పురచ్చి తలైవి అకాల మరణం దరిమిలా ఏఐఏడీఎంకే నేలబారు రాజకీయాల నుంచి గుణపాఠాలు నేర్వాలిప్పుడు!

2004లో దేశదేశాల్నీ చుట్టబెట్టిన సునామీ తమిళనాట మహా విషాదాన్ని మేట వేసింది. సరిగ్గా పుష్కర కాలానికి జయలలిత తీవ్ర అనారోగ్యంతో కన్నుమూయడంతో రాజకీయ సునామీ రాష్ట్రాన్ని చుట్టుముట్టేసింది. 2016 మే నెల నాటి ఎన్నికల్లో చరిత్రను తిరగరాసి పునరధికారం చేపట్టిన జయ పట్టుమని ఆరు నెలల్లో అకాల మృత్యువాత పడటంతో రాష్ట్రంలో రాజకీయ శూన్యం ఆవరించింది. 234 మంది సభ్యుల అసెంబ్లీలో 40.8 శాతం ఓట్లతో 134 సీట్లు సాధించిన ఏఐఏడీఎంకే జయ మరణంతో దిక్కుతోచని స్థితికి- కాదు, దిక్కులేని స్థితికి చేరింది. జయతో పాటే రెండాకుల పార్టీలో పత్రహరితం పోయినట్లుగా కార్యవర్గ శ్రేణులు మొహం వేలాడేయగా- పురచ్చి తలైవికి సిసలైన రాజకీయ వారసత్వం తనదేనంటూ నెచ్చెలి శశికళ నడిపిన హై డ్రామా, రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితికి అంటుకట్టింది. 'జయలలితలో మనం ఎంజీఆర్‌ను చూసుకొన్నట్లే, శశికళలో అమ్మను చూసుకొందాం' అంటూ అప్పటి ముఖ్యమంత్రిగా పార్టీగత తీర్మానం ప్రవేశపెట్టిన పన్నీర్ సెల్వం- 'అమ్మ సాక్షి'గా ఆనక మాట ఫిరాయించింది మొదలు ఏఐఏడీఎంకే రెండు వేర్వేరు ఆకులుగా చీలిపోయింది. పన్నీర్ సెల్వం వర్గం పురచ్చి తలైవి పేరిట మాతృసంస్థను చీల్చగా, శశికళ నియమించిన ముఖ్యమంత్రిగా పళని స్వామి కూటమి అమ్మవర్గంగా చలామణీ అవుతున్నాయి. రెండాకుల గుర్తును ఏ వర్గానికీ కేటాయించకుండా ఈసీ స్తంభింపజేయడంతో- విడిపోతే పడిపోతాం అన్న స్పృహతో విలీన ప్రక్రియ ఇప్పుడిప్పుడే పట్టాలకెక్కుతోంది. అంత తేలిగ్గా కథ సుఖాంతమైతే తమిళ రాజకీయాల్లో మజా ఏముందనేమో- శశికళ తన పక్షాన మోహరించిన అక్క కొడుకు దినకరన్ కూటమి కొత్తగా తల ఎగరేస్తోంది. పార్టీ, ప్రభుత్వాల మీద జయ సర్వం సహాధిపత్యం చలాయించినన్నాళ్లు- ఆమె పాదాలకు మొక్కడం మాత్రమే తెలిసిన మరుగుజ్జులే అందరూ! మూల విరాట్టు పోయేసరికి ఆస్తులు, అధికారంలో వాటల కోసమే ఈ ఎత్తులు, జిత్తులు, కుమ్ములాటలూ! పీనుగ మీద పేలాల కోసం వెంపర్లాట తరహాలో ఉన్న ఈ దుర్రాజకీయం ప్రజాస్వామ్యయుతమా? సైద్ధాంతిక నిబద్ధతతో నిమిత్తం లేని ఈ రాజకీయ కోలాటం- జనస్వామ్య హితమా?

దాదాపు 30 ఏళ్లనాటి సంగతి. 1988లో ఏఐఏడీఎంకే


పళని స్వామి


శశికళ


పన్నీర్ సెల్వం

పుణ్యభూమి

వ్యవస్థాపక అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంజీఆర్ మరణించినప్పుడు- ఆ పార్టీ కార్యవర్గం అప్పటిదాకా గడప దాటని జానకి (ఎంజీఆర్ సతీమణి)నే ముఖ్యమంత్రిగా, పార్టీ అధినేత్రిగా ఔదల దాల్చింది. ప్రచార కార్యదర్శి హోదాలో అప్పటికే పార్టీలో ఎంతో సేవ చేసి ప్రజాజీవితంలో చురుకుగా ఉన్న జయలలిత- తన అస్తిత్వ నిరూపణ కోసం అలుపెరుగని పోరాటం చెయ్యాల్సి వచ్చింది. నేడు అవినీతి కేసులో శిక్ష పడి కర్ణాటక జైలులో ఉన్న శశికళ పార్టీమీద, పాలన పైనా తన పట్టు జారకూడదన్న పంతంతో పావులు కదుపుతున్నారు. ఒకనాడు పార్టీ నుంచి జయలలిత బహిష్కరించిన తన అక్క కుమారుణ్ని చేరదీసి పార్టీ నియమావళికి భిన్నంగా ఉప ప్రధాన కార్యదర్శి పదవి సృష్టించి అందులో అతగాణ్ని కూర్చోబెట్టిన శశికళ- పన్నీర్, పళని వర్గాలు విలీనమైతే తన పప్పులు ఉడకవన్న భయంతో 15 మంది ఎమ్మెల్యేల దన్నుతో అస్థిర రాజకీయ అగ్గికి తన వంతు ఆజ్యం పోస్తున్నారు! పగిలిన అద్దం లాంటి ఏఐఏడీఎంకేలో ఇప్పటికీ ఎవరి ముక్క వారిదే. సొంత లాభం ఎంతవరకు జుర్రుకోగలమన్నది ఆయా వర్గాల అజెండా అయితే- ముక్కలు చెక్కలైనవి రాష్ట్ర ప్రజల ఆశలూ ఆకాంక్షలే!

'నీవే తప్ప ఇతఃపరం బెరుగ' అంటూ అధిష్ఠానాధీశుల కుర్చీల ఎదుట గుంజీలు తీసే కుచ్చీకాయల్లా పార్టీలు మారిపోయిన దుష్ప్రభావాలే ఇవన్నీ! ఇటీవల ఎన్నికల సంఘం చెప్పినట్లు కుక్కగొడుగుల్లా పార్టీలు పుట్టుకురావడంలోనే పెను అవినీతి దాగుంది. దేశంలో నేడు దాదాపు 1800 పార్టీలు నమోదై ఉన్నా వాటిలో అత్యధికం అసలు ఎన్నికల్లో పాల్గొనక పోవడంలోని గూడుపుఠాణీని గుర్తించిన ఈసీ, అమిత జనాదరణ కలిగి అన్ని ఎన్నికల్లోనూ పాల్గొంటూ అధికార పీఠాలు అందుకొంటున్న పదుల సంఖ్యలోని రాజకీయ పక్షాల్లో అంతర్గత ప్రజాస్వామ్యం విలుప్తం కావడం దేశ ప్రజాతంత్రానికి ఎనలేని చెరుపు చేస్తున్న వాస్తవాన్ని గ్రహించలేకపోతోంది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేతగా లాలూ అవినీతి కేసుల్లో చిక్కి ముఖ్యమంత్రిత్వం కోల్పోగానే- ఆయన భార్య రబ్రీదేవి సీఎం కుర్చీలో కూర్చోవడం ఏ తరహా ప్రజాస్వామ్య సంవిధానం? 'డబ్బులు తీసుకొనే పార్టీ టికెట్లు ఇస్తున్నా... అందులో తప్పేమిటి' అని దబాయించే స్థాయిలో పార్టీగత అవినీతి పగలబడుతుండటానికి- ఏక వ్యక్తి నియంతృత్వ పార్టీ వ్యవస్థే కారణమంటే... ఎలా కాదనగలం?

'అన్ని రకాల అవినీతికీ తల్లివేరు రాజకీయ అవినీతే'నంటూ లోగడ ఓ పెద్దాయన చెప్పిన మాట అక్షర సత్యం. ఫిరాయింపుల నిషేధ నిబంధనల రీత్యా భారత రాజ్యాంగం దాదాపు 50 సార్లు రాజకీయ పక్షాలు అంటూ ప్రస్తావించినా, వాటి నడతను కట్టడి చేసే విధి విధానాలేవీ అందులో లేకపోవడం దౌర్భాగ్యం. కాబట్టే, పార్టీలు ఆడింది ఆటగా సాగుతోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలని గొంతు చించుకొనే పార్టీలు- అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పార్టీపరంగా వివిధ పదవులకు నియమబద్ధంగా ఎన్నికలు జరపాల్సిన అవసరాన్ని దశాబ్దాలుగా అలక్ష్యం చేస్తున్నాయి. ఈసీ దస్త్రాలను బట్టి చూస్తే- 2014లో పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి వేరెవరూ నామినేషన్ దాఖలు చెయ్యకపోవడంతో జయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు! అదే సంవత్సరం లాలూ ఆర్‌జేడీ అధ్యక్షుడిగా తనను తాను ప్రకటించుకొని కేంద్ర పార్లమెంటరీ బోర్డు సహా సమస్త కార్యవర్గాన్నీ తానే నియమించారు. అంతెందుకు- దేశంలో నేడు ఏడు జాతీయ పార్టీలు ఉన్నాయి. వాటిలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలను, క్రమానుగతంగా కార్యవర్గ భేటీల్ని నిర్వహించే భాజపాను మినహాయిస్తే తక్కిన నాలుగింటిలో- అధిష్ఠానాల మాటే వేదవాక్కు! అత్యంత పురాతన పార్టీగా ప్రకటించుకొనే కాంగ్రెస్ గాని, దాని నుంచి చీలి వచ్చిన ఎన్‌సీపీ, తృణమూల్ గాని, మాయావతి సారథ్యంలోని బహుజన్ సమాజ్ పార్టీగాని ఒంటెత్తు పెత్తందారుల హక్కుభుక్తంగానే మనుగడ సాగిస్తున్నాయి. లోక్‌సభలో సభ్యత్వం గల 37 పార్టీల చిట్టా తిరగేసినా- ఏక వ్యక్తి కేంద్రకంగానే, ఒకే కుటుంబం చుట్టూ పరిభ్రమించేవిగానే కనిపిస్తాయి. కీలక సరిహద్దు రాష్ట్రమైన జమ్ము కశ్మీరులో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ మొదలు తమిళనాట డీఎంకే, ఏఐఏడీఎంకేల దాకా అన్నింటి జన్మపటం ఒక్కటే. మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీల గురించి ఎవరికీ పట్టింపు లేదు. వాటికి భిన్నంగా జనం ఆకాంక్షలకు గొడుగు పట్టి, వారి ఆదరణతో ప్రబల శక్తులుగా ఎదిగి, రాజ్యాంగబద్ధ బాధ్యతల్ని నిష్ఠగా నిర్వర్తించాల్సినవీ- పై ఎత్తున ఒక్క తార నేల రాలితే చాప చుట్టేసే పరిస్థితికి రావడం దేశ ప్రజాస్వామ్యానికి క్షేమకరం కాదు. వ్యక్తులు కాదు, వ్యవస్థలు ప్రధానం అన్న ప్రాప్తకాలజ్ఞత పార్టీల్లో మొగ్గ తొడగకుంటే- రాజ్యాంగబద్ధంగా దిద్దుబాట్లకు, దీటైన సంస్కరణల ద్వారా పార్టీల్లో ప్రజాస్వామ్యయుత కార్యవర్గ నిర్మాణాలకు చోటుపెట్టక తప్పదు. కాదంటారా?

– పర్వతం మూర్తి

విజయానికి ఒకటే మెట్టు!

అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నిరంతర ప్రయాణం సాగించడమే మనిషి జీవితాశయం కావాలని వేదాలు, ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. అజ్ఞాన తిమిరాన్ని ఛేదించుకొని, జ్ఞానజ్యోతి వైపు పయనించాల్సిన బాధ్యత అతడిదే! అత్యుత్తమ జ్ఞానాన్ని 'సంవిత్తు' అంటారు. ఆత్మజ్ఞాని కానివాడికి విజయం లభించదు, మోక్షమూ ప్రాప్తించదు. సప్తజ్ఞాన భూమికల గురించి ఆదిశంకర విరచిత 'సర్వ సిద్ధాంత' గ్రంథం విపులీకరించింది.


అన్ని జ్ఞానాల్లో ఆత్మజ్ఞానం ఉత్తమమైనది. మనిషి 'నేను, నాది' అనే పరిధిని దాటాలి. అతడు సంపూర్ణ జ్ఞాని అయినప్పుడే- జగత్తు మిథ్య, బ్రహ్మ సత్యం అని గ్రహించగలడు. సర్వ విధాలైన భవబంధాల నుంచి విముక్తి ప్రసాదించే ఆత్మజ్ఞానాన్ని మించిన శక్తి లోకంలో మరేదీ లేదు. సంపూర్ణ జ్ఞాని సముద్రుడితో సమానుడు. అన్ని వైపుల నుంచి వచ్చే జలాల్ని సముద్రుడు తనలో ఇముడ్చుకుంటాడు. అలాగే జ్ఞాని ఏ వైపు నుంచి ఏ జ్ఞానం వచ్చినా, ఆహ్వానించి స్వీకరించాలి. ఆత్మజ్ఞాని హృదయంలో ఉదయించే శాశ్వతానంద అనుభూతి ఇంద్రాదులకైనా లభించదని 'బ్రహ్మపురాణం' చెబుతోంది.

మానవుడు చేసే ప్రతి సత్కర్మ ఆత్మజ్ఞానం పొందడానికి మూలమని శంకరులు 'హస్తామలక స్తోత్రం'లో వ్యాఖ్యానించారు. శ్రద్ధాళువుకే జ్ఞానం ప్రాప్తిస్తుంది. దానికన్నా పవిత్రమైనది లోకంలో ఏదీ లేదన్నదే శ్రీకృష్ణ పరమాత్మ గీతాబోధ సారాంశం. ఆత్మజ్ఞానం అనే ఒకే ఒక మెట్టును అధిరోహించాలంటే- నిరంతర కఠిన సాధన, సద్గురు బోధ, వేద-ఉపనిషత్తుల అధ్యయనం అవసరమవుతాయి.

ఇంద్రియాలన్నింటిలోనూ మనసు గొప్పది. దానికన్నా బుద్ధి, బుద్ధి కంటే ఆత్మసాక్షాత్కారం గొప్పవి. జితేంద్రియుడై- మట్టిని, బంగారాన్ని సమంగా చూసేవాడే మోక్షానికి అర్హుడు అంటుంది భగవద్గీత. ఆత్మజ్ఞాని మాత్రమే తనకు సన్నిహితుడు కాగలడన్న పరమాత్మ వాక్కును 'నారద పంచరత్నం' విశ్లేషించింది.

ఆత్మకు రూపం లేదు. గాలిలా, విద్యుత్తులా అది చైతన్యపూరితం. పాలలోని మీగడలా, ఆత్మ మానవ శరీరంలోనే ఉండి స్ఫూర్తినిస్తుంది. శాశ్వత సుఖ శాంతులు కలిగించేదే ఆత్మజ్ఞానం. ఆత్మదర్శనం పొందినవారికి ఎటువంటి సందేహమూ ఉండదంటుంది 'మాండూక్యోపనిషత్తు'. లౌకికార్థంలో 'ఆత్మ' అంటే 'తాను'. మనిషి మానసికంగా, భౌతికంగా ఎదిగితే చాలదు. ఆధ్యాత్మికంగా ఎదగాలి. అప్పుడే మోక్షం సాధ్యమవుతుంది.

మనోవికారాలకు అతీతమైనది ఆత్మ. అదే ప్రతి ప్రాణిలోనూ కదలికకు మూలం. మానవుడిలోని ఇంద్రియ శక్తుల్ని నడిపేవి- భూత, తన్మాత్ర, ఇంద్రియ, అంతఃకరణ తత్వాలు. వాటన్నింటిలోనూ వ్యాపించిన ఈశ్వర చైతన్యమే ఆత్మతత్వం!



అంతర్యామి

అరిస్టాటిల్ వంటి జ్ఞానులు అనేక పరిశోధనలు చేసి 'ఆత్మ ఒక్కటే ఆరాధనీయం' అనే సూత్రాన్ని సమర్థించారు. ఆత్మ నివేదనం అంటే, ఆత్మ సమర్పణం. భగవంతుడికి దాన్ని మించిన నైవేద్యమే ఉండదు. సర్వ ప్రాణుల్ని తనలా చూసుకోవాలి. అంటే, భూతదయ కలిగి ఉండాలని ఉపనిషత్ కథాసారం. గృహస్థు సైతం తన గృహధర్మాలు పాటిస్తూనే ఆత్మజ్ఞానం పొందవచ్చు. అత్రి, వసిష్ఠ మహర్షులు; జనక మహారాజు వంటివారు గృహస్థాశ్రమ ధర్మాలు నిర్వర్తిస్తూనే ఆత్మతత్వాన్ని సంపూర్ణ అవగాహన చేసుకున్నారు.

పరమాత్మకు స్వాధీనమయ్యేలా, జీవాత్మ తనకు తాను సిద్ధం కావడమే ఆధ్యాత్మిక చింతనకు పరాకాష్ఠ. ఆత్మజ్ఞాని మరణానికి భయపడడు. వ్యామోహాలకు, ప్రలోభాలకు, ఎటువంటి మనో వికారాలకూ అతడు ప్రభావితుడు కాడు. అటువంటివాడు మరణించినా అమరుడే! నిత్య సాధన, అధ్యయనం, ధ్యానం, తపోదీక్ష, సమవర్తిత్వం- మోక్షానికి గల ఒకే ఒక్క మెట్టుపై అతణ్ని నిలబెడతాయి.

ఎదుటివాడి లోపాలు లెక్కించనివాడు, తన బలహీనత గ్రహించి సరిదిద్దుకొనేవాడు, తనలోకి తాను సర్వదా చూసుకొనేవాడు ఆత్మజ్ఞాని కాగలడు. అతడే ధర్మానువర్తనుడు అవుతాడు. అప్పుడు 'లోకం వల్ల నాకు ఉపయోగం ఏమిటి' అనే ప్రశ్న ఉండదు. 'లోకానికి నేను కలిగించే ఉపయోగం ఏమిటి' అనే ప్రశ్న అతడిలో ఉంటుంది. అదే అసలైన ఆత్మజ్ఞానం!

– చిమ్మపూడి శ్రీరామమూర్తి



రెక్కల చాటున భద్రంగా!

మాతృ ప్రేమకు కొలమానం లేదు. పిల్లల క్షేమమే తన ఆనందంగా మమకారం పంచుతుందా ప్రేమ. చెప్పడానికి మాటలు, రాయడానికి అక్షరాలు సరిపోవు. సమస్త జీవకోటిలో అమ్మ ప్రేమను మించింది మరొకటి లేదు. విశాఖ జిల్లా గూడెంకొత్త వీధి మండలం మొండిగెడ్డ వద్ద శనివారం కురిసిన వర్షానికి కోడి పిల్లలు తడిచిపోతుంటే తన రెక్కలను ఛత్రంగా మార్చిన తల్లి కోడి మనసు అమ్మ ప్రేమకు అద్దం పడుతోంది.

– న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

9999..భలే ఖరీదు గురూ..!

రూ.3.54 లక్షలు పలికిన నంబరు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఆర్టీఏ అధికారులు ఫ్యాన్సీ నంబర్లకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వేలం శనివారంతో ముగిసింది. ఆఖరి రోజు 18 నంబర్లకు వేలం వేయగా.. అందులో 7 నంబర్లను ప్రభుత్వం ధర కంటే అధికంగా బిడ్ వేసి వాహనదారులు దక్కించుకున్నారు. ఇందులో 9999 నంబరుకు ప్రభుత్వం రూ.50 వేలు ధర నిర్ణయించగా..రూ.3.54 లక్షలకు సీతమ్మధారకు చెందిన వి.ఉషారాణి చేజిక్కించుకున్నారు.

భూగర్భ జలాలతో దందా ఏంటి?

- 3 నెలల్లో నివేదిక ఇవ్వండి
- పైసా చెల్లించరు.. లీటరు రూ.20కి అమ్ముతున్నారు
- ఆ జలాలు పెద్ద ఆస్తి.. అవసరమైనప్పుడే వాడాలి కదా
- ఆగ్రహం వ్యక్తం చేసిన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ హుకుంసింగ్



శనివారం విజయవాడలో అధికారులతో సమావేశమైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం

ఈనాడు – అమరావతి

ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా రాష్ట్రంలో భూగర్భ జలాలు విచ్చలవిడిగా తోడేస్తూ లీటరు రూ.20కి అమ్ముకుంటూ ఉంటే ఏంచేస్తున్నారని నీటివనరులపై పార్లమెంటరీ స్టాండింగు కమిటీ ఛైర్మన్ హుకుంసింగ్ అధికారులను నిలదీశారు. వాటి పునరుద్ధరణకు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. శుక్రవారం పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ ఎత్తిపోతలను చూసివచ్చిన ఈ కమిటీ.. విజయవాడలో శనివారం రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశమయింది. రాష్ట్రప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పాణిగ్రాహి, ఇతర విభాగాల ముఖ్య కార్యదర్శులు, జలవనరులశాఖ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ప్రధానంగా భూగర్భజలాల దుర్వినియోగం, అడ్డుకోవడానికి ఏం చేస్తున్నారు, రీఛార్జికి తీసుకుంటున్న చర్యలు, జలవనరుల కాలుష్య నివారణ తదితర అంశాలపై రాష్ట్రంలో ఏం చర్యలు తీసుకుంటున్నారో పేర్కొంటూ 3నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని హుకుంసింగ్ అధికారులను ఆదేశించారు. భూగర్భజలాలు రాష్ట్రానికి పెద్దనిధి లాంటివి. ఎంతో అవసరమైనప్పుడు వాడుకోవాల్సిన వాటిని ఇష్టమైన రీతిలో వినియోగిస్తున్నా చూస్తూ ఊరుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. 8గంటల విద్యుత్తు మాత్రమే ఇస్తూ నియంత్రిస్తున్నామని ఇంజినీర్ ఇన్ చీఫ్ చెప్పగా ఆయన సంతృప్తి చెందలేదు. పట్టిసీమ నీటి వల్ల హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగకు శ్రీశైలం ద్వారా ఇచ్చే నీటితో ఆ ప్రాంతాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయని ఈఎన్‌సీ చెప్పారు. పంటకుంటలతో రీఛార్జికి అవకాశం కల్పిస్తున్నామని జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ వివరించారు. 3750 గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేస్తూ నీటి సద్వినియోగానికి, భూగర్భజల వృద్ధికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ మాట్లాడుతూ అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో వినియోగించే భూగర్భజలాలకు, మళ్లీ రీఛార్జి అవుతున్నదానికి పొంతనే లేదన్నారు. నదుల్లో కలిపేస్తున్న కాలుష్యాలకు సంబంధించి గతేడాది వ్యవధిలో ఎన్ని క్రిమినల్ కేసులు నమోదు చేశారని హుకుంసింగ్ ప్రశ్నించారు. కాలుష్య నియంత్రణ అధికారి సమాధానం చెబుతూ రాజమహేంద్రవరం పేపరుమిల్లుపై కేసు నమోదు చేయడం, తర్వాత జరిగిన నియంత్రణ తదితర అంశాలను వివరించారు.

పోలవరం, పట్టిసీమ భేష్..

పోలవరం ప్రాజెక్టు పనులు బాగా జరుగుతున్నాయని, పట్టిసీమ నిర్మాణం, నీటి వినియోగం బాగుందని హుకుంసింగ్ ప్రభుత్వానికి కితాబునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణం, జలవనరుల నిర్వహణలోను మొత్తం మీద రాష్ట్రం ఆదర్శంగానే ఉన్న తాము ప్రస్తావించిన కోణాల్లోను ఆలోచించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతికతకు విలువ ఇచ్చే ముఖ్యమంత్రి ఉన్నారని, ఈరోజు ఏపీలో ఏం జరిగితే రేపు దేశమంతా అదే చట్టమవుతుందంటూనే భూగర్భ జలాలు, కాలుష్యం, నీటి విలువపైనా దృష్టి సారించాలన్నారు. తాను తెలంగాణకు చెందిన వాడినయినా పోలవరం నిర్మాణ తీరును ప్రశంసిస్తున్నానని ఎంపీ ఆనందభాస్కర్ సమావేశంలో చెప్పారు.

కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ పురస్కారం



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ భారతీయ ఆహార, వ్యవసాయ మండలి నాయకత్వ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఆయనను విధాన నాయకత్వ విభాగం కింద ఎంపిక చేసింది. వచ్చే నెల అయిదో తేదీన దిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగే ప్రపంచ వ్యవసాయ నాయకత్వ శిఖరాగ్ర సదస్సులో కేసీఆర్ ఆ పురస్కారాన్ని అందుకుంటారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధికి కృషి చేసిన వారికి 2008 నుంచి ఈ పురస్కారాన్ని ఆహార, వ్యవసాయ మండలి అందజేస్తోంది.

గుంటూరులో కారం మిల్లులపై దాడులు

ఈనాడు, అమరావతి: గుంటూరులోని కారం మిల్లులపై ఆహార భద్రత అధికారులు శనివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. కల్తీకారం తయారు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆహార భద్రత కమిషనర్ సుజాత శర్మ ఆదేశాల మేరకు సంయుక్త కమిషనర్ కె.ఎస్ స్వరూప్ ఆధ్వర్యంలో అధికారులు తొమ్మిది బృందాలుగా గుంటూరు మిర్చియార్డు చుట్టుపక్కల ప్రాంతాల్లోని కారం మిల్లులపై ఏకకాలంలో సోదాలు జరిపారు. 40 కారం మిల్లులు, 10 శీతలగిడ్డంగుల్లో తనిఖీలు నిర్వహించి, 40 నమూనాలు సేకరించారు. మిర్చియార్డు ఎదురుగా ఉన్న కారం మిల్లులో తాలు కాయలతో తయారైన 30 కారం బస్తాలున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఆయేషా మీరా హత్య కేసులో సిట్ పిటిషన్ తిరస్కరణ

విజయవాడ, న్యూస్‌టుడే: ఆయేషా మీరా హత్య కేసు పునఃదర్యాప్తునకు అనుమతి కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేసిన పిటిషన్‌ను శనివారం విజయవాడ నాలుగో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం తిరస్కరించింది. ఈ అంశం తమ పరిధిలోకి రాదని ఆదేశాల్లో పేర్కొంది. ఆయేషా మీరా హత్య కేసులో సత్యంబాబును నిర్దోషిగా ప్రకటిస్తూ ఏప్రిల్ నెలలో హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆయేషా మీరా తల్లిదండ్రులు సహా పలువురి అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం పునర్విచారణకు అనుమతిస్తూ ఈ కేసును సిట్‌కు అప్పగించింది. ఈ మేరకు పునఃదర్యాప్తునకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సిట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం పునఃదర్యాప్తు అంశం తమ పరిధిలో లేదని పేర్కొంటూ..పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

యువ కౌలు రైతు ఆత్మహత్య

గుంటూరువారితోట, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి యువ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు, పద్మావతి దంపతుల కుమారుడు శివకృష్ణ (21). తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తున్న ఆయన ఇటీవల నాలుగు ఎకరాల కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగుచేశాడు. పంట చేతికి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆయన..శుక్రవారం గుంటూరు నగరంలోని విఘ్నేశ్వర లాడ్జిలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం కొత్తపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పుల బాధల వల్లనే తమ కుమారుడు ఈ ఆఘాత్యానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు వాపోయారు.

అర్చకుల వేతనాలు పెంచాలనే కోరా: ఐవైఆర్

ఈనాడు అమరావతి: అర్చకుల వేతనాలు తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తాను ఎక్కడా అనలేదని రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న ముఖ్యమంత్రికి రాసిన లేఖలో అర్చకుల వేతనాలు తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అంశాన్ని ప్రస్తావించలేదని, కేవలం మీడియాలో వచ్చిన ఒక వార్తను మాత్రమే ఉటంకించానని తెలిపారు. అదే సందర్భంలో గ్రామీణ ప్రాంతాల్లోని అర్చకులకు కనీసం రూ.10 వేలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానని, ఇందుకోసం అర్చకుల వేతనాల నిధిని రూ.500 కోట్లకు పెంచాలని పేర్కొన్నానన్నారు. ప్రభుత్వం మాత్రం అర్చకుల వేతనాలు తగ్గించడం లేదని, గ్రామీణ అర్చకులకు ఇస్తున్న రూ.5 వేల వేతనాన్ని యథావిధిగా ఇస్తామని చెప్పే ప్రయత్నం చేసిందన్నారు.

వాదనలకు అనుగుణంగా వివరాల సమర్పణ

- బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట పత్రాలు దాఖలు చేసిన తెలుగురాష్ట్రాలు

ఈనాడు, హైదరాబాద్: నీటి కేటాయింపులో తమ రాష్ట్రానికే ఎక్కువ ప్రాధాన్యత ఎందుకు ఇవ్వాలో పేర్కొంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట పలు పత్రాలు(డాక్యుమెంట్లు) దాఖలు చేశాయి. తెలంగాణ 11, ఆంధ్రప్రదేశ్ 7 పత్రాలను సమర్పించాయి. వ్యవసాయ పరంగా, సాగునీటి పరంగా తమకు జరిగిన అన్యాయం, రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు, తాగునీటికి ఇబ్బందులు తదితర అంశాలపై తమ రాష్ట్రాల తరఫున సాక్ష్యులుగా ఎవరు ఉంటారో కూడా ట్రైబ్యునల్‌కు నివేదించాయి. తెలంగాణ తరఫున పళని స్వామి, జి.ప్రభాకర్ కాగా, ఆంధ్రప్రదేశ్ తరఫున వై.పద్మలత, పి.వి.సత్యనారాయణ, కె.వి.సుబ్బారావు, ప్రొఫెసర్ నగేశ్‌కుమార్ ఉన్నారు. భూమి వినియోగం, మట్టిస్వభావం, జిల్లాల వారీగా పంటల సాగు, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వెనుకబాటు తనం తదితర అంశాల గురించి ట్రైబ్యునల్‌కు ఆంధ్రప్రదేశ్ పత్రాలు సమర్పించింది. తెలంగాణ రాష్ట్రం గోదావరి నుంచి 211 టీఎంసీలను కృష్ణాబేసిన్‌కు తరలించే పనులను చేపట్టినట్లు గతంలో పేర్కొన్న ఆంధ్రప్రదేశ్.. తాజాగా రామప్ప సరస్సు నుంచి పాకాల సరస్సుకు మరో 3 టీఎంసీలను తరలించేలా ఉత్తర్వులిచ్చిందని, మొత్తం 214 టీఎంసీలను కృష్ణా బేసిన్‌కు తరలించేందకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. కృష్ణానదీ యాజమాన్యబోర్డు పలు సందర్భాల్లో ఇచ్చిన ఆదేశాలను కూడా జతచేసింది. పాలమూరు-రంగారెడ్డి, దిండి ఎత్తిపోతల పథకాల గురించి, సీఆర్‌డీఏ పరిధి గురించి వేర్వేరు నివేదికలు అందజేసింది. ఇలా మొత్తం 7 పత్రాలను ట్రైబ్యునల్‌కు సమర్పించింది. గత ఆరున్నర దశాబ్దాలుగా సాగునీటి కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ పేర్కొంది. పోతిరెడ్డిపాడు, ఎస్సార్బీసీ, బనకచర్ల రెగ్యులేటర్, గురురాఘవేంద్ర, హంద్రీనీవా, వెలుగొండ, గాలేరు-నగరి తదితర ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నివేదికలు సమర్పించింది. బేసిన్‌లో కేటాయింపులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం, పరివాహక ప్రాంతం పరిధిలో జనాభా, సాగు, తాగునీటి పరిస్థితి గురించి వివరించింది. నాగార్జునసాగర్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని పేర్కొంది. కృష్ణాబేసిన్‌లో తెలంగాణకు అన్యాయం ఎలా జరిగిందో పేర్కొంటూ వివరంగా నివేదించింది. మొత్తం 11 పత్రాలను ట్రైబ్యునల్‌కు అందజేసింది.

రొమ్ము క్యాన్సర్ నిర్ధరణపై కొత్త ప్రయోగాలు

- రక్త పరీక్షలతో తక్కువ ధరకు అందించే ఏర్పాట్లు: డాక్టర్ పి.రఘురాం

ఈనాడు, గుంటూరు: రొమ్ము క్యాన్సర్ వ్యాధి నిర్ధరణ కేవలం రక్త పరీక్షతో నిర్వహించేలా పరిశోధనలు సాగుతున్నాయని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వీటికి శ్రీకారం చుడతామని ఉషాలక్ష్మి రొమ్ము క్యాన్సర్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ పి.రఘురాం తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన వైద్యుడు డాక్టర్ కె.వరప్రసాద్ స్మారక ఉపన్యాసంలో రొమ్ము క్యాన్సర్ పరీక్షలు తదితర అంశాలపై డాక్టర్ పి.రఘురాం కీలకోపన్యాసం చేశారు. గుంటూరు వైద్య కళాశాలలో జరుగుతున్న భారతీయ శస్త్ర వైద్యుల సంఘం ఏపీ విభాగం వార్షిక సమావేశాల్లో భాగంగా రెండో రోజైన శనివారం ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. మహిళలు రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించేలా తెలుగు రాష్ట్రాల్లో 2వేల మంది ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి చైతన్యం తీసుకొచ్చామని వివరించారు. చాలా మంది సిగ్గు, బిడియంతో ఆసుపత్రులకు రావడం లేదని, ఇది సరికాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.రఘురాం

రొమ్ము క్యాన్సర్ పరీక్షలకు ప్రామాణికంగా తీసుకునే మ్యామోగ్రఫీ పరీక్షల స్థానంలో ప్రతి ఒక్కరికీ అతి తక్కువ ధరకే రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధరణ చేయడానికి ప్రస్తుతం ప్రయోగాలు చురుగ్గా జరుగుతున్నాయని వివరించారు. ఈ యంత్రాల ఖరీదు కూడా చాలా తక్కువగానే ఉంటుందని, దీంతో రూ.300కే పరీక్షలు సాధ్యపడతాయని వివరించారు. రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధరణ చేయడానికి దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో ప్రస్తుతం క్లినికల్ పరీక్షలు జరుగుతున్నాయని, ఈ ఏడాది చివరి నాటికి ఇవి అందుబాటులోకి రావొచ్చని రఘురాం వెల్లడించారు.





వధువు కావలెను

KAPU 26 6' MS 130K 20Cr ★ 26 5'7" B.E (BITS) MNC 14LPA ★ 26 5'8" MS MNC 12LPA 20Cr ★ 26 5'8" MD (Redio) ★ 28 6' B.E (Bits) MS 120K ★ 28 6' MD ★ 9989019945 (A)

Reddy/ Business/ B.Tec/ 29/ 5'8"/ 225 Cr ★ 27/ 5'8"/ 200 Cr ★ 30/ 5'10"/ 300 Cr ★ 32/ 6'/ 400 Cr ★ 28/ 6' 250 Cr ★ Cont: K.C.Reddy - Mar-Bureau- Hyd. Ph: 9849321309/ 9347807015 (A)

Reddy/ MBBS/ PG ★ Surg/ 28/ 5'11"/ 50 Cr ★ MD/ 28/ 6'/ 15 Cr ★ 30/ 5'7"/ 50 Cr ★ 27/ 6'/ 50 Cr ★ 28/ 5'9" ★ Cont: K.C.Reddy - Mar - Bureau - Hyd. Ph:9849321309/ 9347807015 (A)

Reddy/ B.Tec/ MS/ H1/ USA ★ 30/ 5'11"/ 30 Cr ★ 29/ 5'7"/ 70 Cr ★ 27/ 5'8"/ 100K/ 30 Cr ★ 28/ 5'11"/ 70 Cr ★ 29/ 5'10"/ 180 K/ 10 Cr ★ Cont: K.C.Reddy - Mar - Bureau - Hyd - Ph: 9849321309 (A)

Hindu Mala/ 30/ 5'9"/ Data Scientist in USA/ Seeks Well Educated Traditional Bride. Call: 8978530671 (A)

గౌడ 1992 SWE హైదరాబాద్, 1990 SWE కెనడా & B.Tech MS SWE USA. డాక్టర్స్ వరులకు వధువులు కావలెను. ✆ 9032310007 (A)

బ్రాహ్మణ/ 26, 5'8"/ M.Tech/ (IIT)/ 10L/ B'Lore/ ★ 26, 5'8"/ B.Arch/ (IIT), 22L ★ 29, 5'6", M.Tech (IIT)/ 15L B'Lore ★ 28/5'6"/ BE/ 9L ★ 9494096081 ★ (A)

Sri Vaishnava/ B.Com/ 35/ 6'/ Pvt Job/ 35K PM/ Own House/ Any Brahmin/ No Bureau/ 9959299344/ 9177422329 (A)

వైశ్య/ 24 / వైట్, / 6'1" / B.Sc.(Com)/ పైలెట్ / Govt సర్వీస్/ 1L PM/ వరుడికి వధువు కావలెను. Cont: 92464 39643 (J)

పద్మశాలి (కట్నప్రసక్తిలేదు) 27, 5'10", B.Tech, SWE, Infosys, 85,000/- pm, అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246151501 (A)

Mala: V.V.Urgent, B.Tech (ECE), 5'10", 28Y, 10 కోట్ల ఆస్తి, నెలకు 60 వేల జీతంతో Govt జాబ్ చేస్తున్న వరునికై సంప్రదించండి. Ph: 8885592890 (A)

SC హిందుమాల (కట్నప్రసక్తిలేదు) 27, 5'10", B.Tech, SWE, Accenture, 80,000/- pm, అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246171703 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునేముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గౌడ, B.Tech, MBA, C.Govt. AE (BHEL), 70,000/- pm, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A)

విశ్వబ్రాహ్మణ, B.Tech, MBA, C.Govt. Asst. మేనేజర్ (సిండికేట్ బ్యాంక్), 55,000/- pm, 5'10" ఎత్తు, 28 సం॥ల వరునికి వధువు కావలెను. ✆ 8886512010 (A)

SC మాల, M.Tech, C.Govt. JTO (BSNL), 70,000/- pm, 5'10" ఎత్తు, 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

పద్మశాలి, B.Tech, BITS, MBA, IIM, C.Govt. డిప్యూటీ మేనేజర్ (HAL), 13 Lakhs PA, 5'9" ఎత్తు, 28 సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 8886957298 (A)

ముదిరాజ్, M.Tech, IIT, ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఆఫీసర్, 14 Lakhs PA, 5'9" ఎత్తు, 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9703794175 (A)

రెడ్డి, M.Tech, IIT, C.Govt. Asst. Exq. ఆఫీసర్ (BHEL), 11 Lakhs PA, 5'10" ఎత్తు, 28 సం॥ల వరుడికి వధువు కావలెను. ✆ 9985606180 (A)

గౌడ, M.Tech, IIT, C.Govt. Sr. ఇంజనీర్ (BHEL), 12 Lakhs PA, 5'9" ఎత్తు, 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854 (A)

ముదిరాజ్, ఏకైక కుమారుడు, B.Tech, MBA, Govt బ్యాంక్ PO (కెనరా బ్యాంక్), 55,000/- pm, 5'9" ఎత్తు, 28 సం॥ల వరునికి వధువు కావలెను. ✆ 9642459724 (A)

విశ్వబ్రాహ్మణ/ 28/ 5'8"/B.Tech, SWE/ Hyd/ 60,000/-PM వెల్‌సెటిల్డ్ వరునికి తగిన B.Tech, MBA, MCA వధువు కావలెను. ✆ 9676812525 (A)

వడ్డెర: M.Tech/ C.Govt P.O/ కెనరాబ్యాంక్/ 45,000/- PM 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007823. (A)

కమ్మ: M.Tech/ C.Govt మేనేజర్/ ఆంధ్రాబ్యాంక్/ 60,000/- PM '6" ఎత్తు, 27సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007652. (A)

గంగపుత్రబెస్త: B.Tech/ Govt Asst. ఇంజనీర్/ ఇరిగేషన్ Dept/ 45,000/- PM 5'11", ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618007823. (A)

రజక: B.Tech/ C.Govt ఇంజనీర్/ HAL/ 54,000/- PM, 5'10", ఎత్తు, 29సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271. (A)

రెడ్డి/ 1989/ 5'7"/ MBBS/ MD (Gen) ★ 1987/ 5'6"/ MBBS/ MD (Pead) ★ 1990/ 6/ MBBS/ Rich ✆ 9848221166/ 8885559579 (A)

రెడ్డి/ 1989/ 6' B.Tech (NIT) BHEL (R&D) 12L PA ★ 1991/ 5'10"/ B.Tech/ ADP/ 8L PA ★ 1981/ 5'5"/ B.Sc 15Cr Hyd/ Business ✆ 8885559579 (A)

రెడ్డి/ 1990/ 5'7"/ B.Tech/ MS/ US 90K/ ★ 1985/ 5'11"/ M.Tech/ SWE/ 14L PA Hyd ✆ 9848221166/ 8885559579 (A)

గౌడ డైవర్స్ 33Y. 5'7" B.Tech/ MS/ SWE కెనడా సిటిజన్ 90K + స్వంత కంపెనీ వరునికి 1వ B.Tech/ MS/ PG వధువు కావలెను. ✆ 9848041335. (A)

SC మాదిగ హిందూ/ 27/ 5'8"/ B.Tech/ MBA/ SWE/ L&T/ 70,000/- PM/ హ్యాండ్‌సమ్, వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. Ph: 8712865419. (A)

క్షత్రియ/ 45సం॥ M.Tech., MBA, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, A.E, స్టేట్ గవర్నమెంట్, లీగల్లీ డైవర్స్‌డ్ పిల్లలులేరు, సొంత ఇల్లు, 21ఎకరాల పొలం గల వరుడుకి వధువు కావలెను. @ 70138 86194.(L)

Vysya 35/ 5'3" 2nd, 1L P.M Qly: CA, B.Com 1.5Cr స్థిరాస్తిగల వరునికి సాంప్రదాయమైన 1st వధువు కావలెను. ✆ 9490422671/ 9177715558 (A)

రెడ్డివరులకు వధువులు కావలెను. అవినాష్‌రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటిరెడ్డి) రోడ్డు-3, TV-9 ఎదురుకాలనీ బంజారాహిల్స్, హైద్రాబాద్. www.avinashreddy.com ✆ 9848011818 (A)

SC, క్రిస్టియన్/ 28/ 5'9"/ B.Tech/ SWE/ 1L PM/ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి కలిగిన వరుడికి వధువు కావలెను. ✆ 9676968974/ 9951049449 (A)

SC/ అందమైన అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను/ అన్ని కులాల వారికి సంబంధాలు కుదర్చబడును. ✆ 7093598888/ 7382871777 (A)

దంపతులకు ఆదర్శం శ్రీకృష్ణుడి ప్రేమతత్వం!



నల్లనివాడు.. పద్మనయనమ్ములవాడు.. నవ్వు రాజిల్లెడు మోమువాడు.. మౌళి పరిసర్పిత పింఛము వాడాయన. ఇంతకీ ఎవరాయన? ఇంకెవరు.. అష్టమహిషలకు భర్త శ్రీకృష్ణపరమాత్ముడు. నరకుడి చెరలో ఉన్న పదహారువేల మంది గోపికలకు విముక్తి కలిగించిన దయాహృదయుడు. దాంతో వారందరూ ఆయననే తమ భర్తగా భావించారు.

ప్రేమతత్వానికి మారుపేరైన కృష్ణపరమాత్మకు తన భార్యలందరూ ప్రీతిపాత్రులే. రుక్మిణీ కల్యాణాన్ని పెళ్లి కాని పిల్లలు, అల్పాయుష్కులు వింటే వారి దోషం తొలగిపోతుందని ఓ నమ్మకం. రుక్మిణి సోదరుడైన రుక్మి - సోదరి మనసును అర్థం చేసుకోకుండా ఆమెను శిశుపాలుడికిచ్చి పెళ్లి చేయాలని ప్రయత్నిస్తాడు. ఆ తరుణంలో రుక్మిణి ప్రేమసందేశాన్ని అందుకున్న కృష్ణుడు ఆమెను తీసుకునిపోతాడు. అడ్డువచ్చిన రుక్మిని ఓడించి, సంహరించబోయినవాడు తన నెచ్చెలి అభీష్టంమేరకు విడిచిపెడతాడు. మనసు పడ్డ అమ్మాయిని ఎన్ని కష్టాలకోర్చయినా చేపట్టాలనే అంతర్గత సందేశం ఇందులో ఉంది. అంతే కాదు మనం ప్రేమించినవారికన్నా మనను ప్రేమించినవారిని వివాహమాడాలన్న సూత్రమూ అవిస్మరణీయం.

సత్యాకృష్ణుల సరససల్లాపాలు అందరికీ విదితమే. పారిజాతపుష్పం సమస్య పరిష్కారమైన తీరును గమనిస్తే నేటి దంపతులకు పనికొచ్చే అనేక అంశాలు అందులో కనిపిస్తాయి. కోపతాపాలతో ఉద్రేకపడే భార్యను భర్త ఎలా ప్రసన్నం చేసుకోవాలో ఈ వృత్తాంతం సూచిస్తుంది. సత్యభామ పాదతాడనం చేసినా 'తంతే తన్నావు కానీ, నీ కోమలమైన పాదాలు కందిపోలేదు కదా?' అని అడుగుతాడు. అలకపాన్పు ఎక్కిన భార్య మనసును రంజింపచేయడమనేది క్లిష్టమైనదేకానీ అసాధ్యమైనది కాదు. అయితే సహనం, ఓపిక, సరసత్వం లేకపోతే రెండు నిండు జీవితాలు వృథా అవుతాయి. భార్యాభర్తలిరువురూ స్వాభిమానమనే కత్తులు దూసుకుంటే ఆ సంసారం రసహీనమవుతుంది. ఇద్దరిలోనూ ఆధిక్యం చూపాలన్న ఆరాటం ఉంటే ఆ దాంపత్యం కడగండ్ల పాలవుతుంది. సమస్యలు పెల్లుబికినప్పుడు దంపతులు పంతాలకు, పట్టింపులకు పోకుండా ఒకింత తగ్గి ప్రవర్తించాలి. లాలిత్యంగా, మధురంగా మాట్లాడాలి. భాగస్వామి మనసును మృదువైన మాటలు, ప్రవర్తనతో కరిగేలా చేయాలి. ఎనిమిది మంది భార్యలతో సంసార సాగరాన్ని ఈదడమంటే మాటలా? కానీ కృష్ణుడు అందరినీ సంబాళించాడు. దీనికోసం ఆయన అవలంబించింది ప్రేమ తత్వం మాత్రమే.

భాగస్వాముల నడుమ స్వారస్యం, సామరస్యం ఉంటేనే దాంపత్యం మధురంగా సాగిపోతుంది. నేడు తీరికలేని పనులు, ఉద్యోగాల ఒత్తిడుల వల్ల దంపతుల శృంగార జీవితం ఒడుదొడుకులకు గురవుతోంది. ఇద్దరూ తమకు కొంత ఏకాంతాన్ని కేటాయించుకోవాలి. కృష్ణుడిలా కొంటె పనులతో, చిలిపి చేష్టలతో భాగస్వామిని మురిపించాలి. మైమరపించాలి.. రాధాకృష్ణుల ప్రణయతత్వం అత్యంత మహిమాన్వితమైనది. రాధాకృష్ణులకు ఒకరిపై ఒకరికున్నంత అనురాగం దంపతుల్లో ఉంటే, ఆ బంధాన్ని ఏ శక్తులూ బలహీనపరచలేవు.

యదునందనుడి జీవితం నుంచి దంపతులు నేర్చుకోవాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి. చెదరని చిరునవ్వు, ప్రసన్నమైన రూపం, కలివిడిగా కలసిపోవటం, మధురంగా మాట్లాడడం, సమయస్ఫూర్తి వగైరాలన్నీ ఇందులో భాగాలే. పాండవులను ఆదుకున్నట్లే కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, వాక్‌చాతుర్యంతో ఇతరుల మనసుల్ని నొప్పించకుండానే లోపాలను ఎత్తిచూపడంలాంటివి ముఖ్యమైనవి. మనుషులందరిలోనూ కొద్దోగొప్పో అహం ఉంటుంది. కృష్ణుడు ఎక్కడా అహాన్ని ప్రదర్శించిన దాఖలాలు లేవు. పాండవుల తరపున రాయబారిగా కౌరవ సభకు వెళ్లిన కృష్ణుడు ఎక్కడా సంయమనం కోల్పోలేదు. ఆత్మనిగ్రహాన్ని ప్రదర్శిస్తూనే సుతిమెత్తని హెచ్చరికలతో దుర్యోధనాదులకు విషయం విశదం చేస్తాడు. దారిద్ర్యంతో కొట్టుమిట్టాడే తన సహాధ్యాయి కుచేలుడిని ఆదరించిన తీరు అందరికీ ఆదర్శనీయం. జీవిత భాగస్వాముల్లో ఒకరు ఆర్థికంగా ఉన్నతస్థాయి నుంచి వచ్చి, మరొకరు సాదాసీదా కుటుంబంనుంచి వచ్చినా పరస్పరం ప్రేమతో మెలగాలనే సందేశం ఇందులో ఉంది.

దంపతుల అన్యోన్యతకు ప్రేమానురాగాలే భూమిక. దంపతుల్లోని చిలిపితనం, హాస్యప్రియత్వం, సరసత, రసజ్ఞతలాంటివి భాగస్వామిని ఆకర్షించి కట్టిపడేస్తాయి. అందువల్ల ఎన్ని సమస్యలున్నప్పటికీ మొక్కవోని ధైర్యంతో వాటిని ఎదుర్కొంటూ, ఆనందంగా భవసాగరాన్ని ఈదాలనే సందేశాన్ని కృష్ణావతారం మనకందిస్తుంది. కృష్ణం వందే జగద్గురుమ్!

- కె. రఘు

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి

పద్మశాలి: (కుల/ కట్న) ప్రసక్తి లేదు 45/ 5'9"/ SWE/ 50 వేలు P.M వరుడుకి 10th/ ఇంటర్/ డిగ్రీ 30/ 40/ వయస్సు 5'3" మీద హిందూ వధువు కావలెను. తల్లిదండ్రులు గాని, సంరక్షకులు డైరెక్ట్‌గా సంప్రదించండి ✆ 9490470741/ E Mail: sreenislec_2005@yahoo.co.in (A)

రెడ్డి :- 29, 5'10" B.Tech IIT, S/W/E విప్రో Hyd నెలకు 1 లక్ష జీతం మంచి అలవాటు వున్న వరుడుకు తగిన వధువు కావలెను. (అర్జెంట్) ✆ 8978799956 (A)

Kamma 28/ 6'/ MBA/ 20L PA/ Hyd ★ 33/ 5' 11"/ M.Tech/ 35L PA ★ 30/ 5'8"/ MD/ 10L PA/ Doctor ✆ 9949233422/ Blue Trend Matrimonial (A)

క్షత్రియ/ రాజులు: 29Y/ 5'8"/ M.Tech (IIT)/ S/W Hyd/ 20 Lakhs P/A/ well settled వరునికి తగిన వధువు కావలెను. 93938 63645 (D)

బ్రాహ్మణ: 29Y/ 5'9"/ B.Tech (Bitsphilani)/ 18 Lakhs P/A/ S/W Hyd/ 2 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 97045 66499 (D)

బలిజ/ కాపు: 27Y/ 5'8"/ B.Tech (CSE), MBA/ S/W Chennai/ 11 Lakhs P/A/ 10 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 97041 88499 (D)

★ ★ ★

బ్రాహ్మణ 40 5'4" భరద్వాజ నియోగి MA MLISC SUBSECT Nobar 1.5Cr ఆస్థి చిన్న ఉద్యోగం గౌరవకుటుంబం 9248843819 (A)

డైరెక్ట్ CNB 34Y 6'H M.Tech, MBA 1.5L (P/M) సేఫ్టీ ఆఫీసర్ కువైట్ కన్వర్టెడ్ క్రిష్టియన్స్ అందమైన వరునికి తగిన వధువు కావలెను. MBBS, Bank, Govt జాబ్. ✆ 90598 10757, 78423 48975. (C)

★ ★ ★

రెడ్డి, విడో, 34, 6", చదువుకున్న వరునకు వధువు కావలెను. సంప్రదించండి (నో మీడియేటర్) ✆ 82973 04355 (J)

Reddy 42/ Ilurs ఒంటరి/ Diplama/ 1cr ప్రాపర్టీ/ 50pm/ 5.6 చామనచాయ VJDలో Wholesale Business చేయుచున్న వరునకు వధువు కావలెను. డైరెక్ట్. 7396623288. (S)

BC/ 46 Years/ 2nd మ్యారేజ్, Govt. Employee కి BC or FC వధువు కావలెను. డైరెక్ట్ సంప్రదించండి. ✆ 96188 17515. (B)

CNB, 45Y, 5'.2" బిజినెస్, వెల్ సెటిల్డ్, ఒంగోలు నివాసము లేటు మ్యారేజ్ వరునకు 35 to 45 సం॥ వయసు, మానవ విలువలకు ప్రాధాన్యతనిచ్చే (1వ, 2వ, లేదా విడో అయిన) వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర: 9492218920.(R)

కాపు/ 27/ 5'7" MBBS-Final Year in Abroad, 2 Cr ప్రాపర్టీ + రెంటల్ 90 వేలు వరుడికి కాపు వధువు కావలెను. డైరెక్ట్. Whatsapp No. 90322 41749. (B)



వరుడు కావలెను

KAPU 25 5'4" MS (GS) 10Cr ★ 26 5'4" MS 100K 5Cr ★ 25 5'3" B.E (BITS) MS 80K ★ 25 5'5" B.E MBA 10Cr ★ 23 5'4" B.E 10Cr ★ 24 5'7" B.E MBA TCS 5Cr ★ 8790017711 (A)

Reddy/ B.Tec/ MBA/ 28/ 5'4"/ 18L/ yr/ 15 Cr Property Share -Cont. K.C.Reddy - Mar-Bureau -Banjarahills - Hyd - Ph: 9849321309/ 9347807015 (A)

Reddy/ B.Tec (VIT) MS (London) Now Hyd- 27/ 5'3"/ 50 Cr (Share) Father Very Big Builder - Hyd. Cont: K.C.Reddy Hyd- 9849321309/ 9347807015 (A)

Reddy/ MBBS/ 100 Cr/ 27/ 5'7"/ ★ 22/ 5'5"/ 15 Cr ★ 28/ 5'7"/ 25 Cr ★ 25/ 5'7"/ 50Cr (USA) ★ 25/ 5'4"/ 120 Cr ★ Cont K.C.Reddy - Mar - Bureau- Hyd Ph: 9849321309/ 9347807015 (A)

Hindu, S.C, Madhiga, Chennai Girl 26/ B.E Seeks Groom Working in Central Govt./ MNC. Email: chandrasekaran1111 @gmail.com (A)

Yerukala Kavadi 28/ 5'9" Fair MTech Seeks Suitable Working Professional Groom Contact 7702008345 No Brokers (A)

Brahmin, Bharadwaja, 29, PG, Employed, Hyd, 4 Lacs, Legally Separated, Seeks Alliance from Employed, Boys, Issueless, Similar Status. ✆ 9573437415 No Brokers (A)

బ్రాహ్మణ 20, B.Sc ★ 23/ B.Tech/ SWE/ TCS/ 4.2L ★ 27, 5'5", B.Tech, MS (US) $ 62K/ ★ 28/BDS/ 20K/ గౌతమస ★ 26, 5'4", MBBS ★ 9494309202 ★ (A)

బ్రాహ్మణ 22, 5'4", MBA/ 24, 5'4", BE, 4L ★ 26, 5'4", B.Tech, MBA, SWE ★ 28, 5'2",M.Pharm/ 3L ★ 25, 5'4", B.Tech, MS(US)/ 24/ 5'2", MBBS/ 9030036501 ★ (A)

మాల, ఎస్సి, హిందూ/ 27/ 5'2"/ MBBS/ ఫెయిర్ అందమైన వధువుకు MBBS/ MD వరుడు కావలెను. Ph: 9959726850, 9701371923 (A)

కమ్మ, 27 5'6" Very Fair BE, MBA 60,000/- P.M. 20 కోట్లు డైవర్సీ వధువుకు Well Settled ఫ్యామిలీకి చెందిన O.C.వరుడు కావలెను. ✆ 99483 67900 (I).

కాపు, 26, 5'3", V.Fr, B.Tech, SWE, Infosys, 5 Lakhs PA, సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9866158793 (A)

వెలమ, 24, 5'5", B.Tech, SWE, TCS, 35,000/- PM, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246171703 (A)

విశ్వబ్రాహ్మణ, 25, 5'3", Fr, B.Tech, SWE, IBM, 30,000/- pm, అందమైన సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9290022700 (A)

రజక, 24, 5'5", B.Tech, SWE, Infosys, 35,000/- pm, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246333320 (A)

SC మాల, 23, 5'5", B.Tech, NIT, SWE, Infosys, 30,000/- pm, అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వరుడు కావలెను. ✆ 9948005247 అర్జెంటు (A)

ముదిరాజ్, 24, 5'5", B.Tech, SWE, Deloitte, 35,000/- pm, V.Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246555529 (A)

రెడ్డి, 23, 5'6", B.Tech, SWE, Wipro, 35,000/- pm, వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. సంప్రదించండి: 9666567123 (A)

నాయీబ్రాహ్మణ, 24, 5'5", B.Tech, SWE, Infosys, 35,000/- pm, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246964555 (A)

మాల, B.Tech, C.Govt. Jr. ఇంజనీర్ (రైల్వే), 60,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9703794175 (A)

మాదిగ, B.Tech, C.Govt. బ్యాంక్ PO (SBI), 55,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9642459724 (A)

కుమ్మరి, B.Tech, Govt బ్యాంక్ క్యాషియర్ (ఆంధ్రా బ్యాంక్), 22,000/- pm, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885299854 (A)

కాపు, B.Tech, C.Govt. JE (రైల్వే), 50,000/- pm, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8886957298 (A)

ముదిరాజ్/ B.Tech/ C.Govt బ్యాంక్ P.O (SBI)/ 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9052296834 (A)

కాపు/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్ (రైల్వే)/ 35000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 8886512010 (A)

కమ్మ (చౌదరి)/ B.Tech/ Govt బ్యాంక్ P.O (ఆంధ్రాబ్యాంక్)/ 35000/-PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ: MSc/ Agri/ Govt ఆఫీసర్/ అగ్రికల్చర్ Dept/ 45,000/- PM 5'4", ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652. (A)

పద్మశాలి: 20 లక్షల ఆస్తి B.Tech/ C.Govt P.O/ కెనరాబ్యాంక్/ 32,000/-PM, 5'5", ఎత్తు, 25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406. (A)

రెడ్డి/ 1993/ 5'6"/ B.Tech/ PG (AIM) V.Rich ★ 1990/ 5'6"/ M.Tech లెక్చరర్ Fair నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 8885559579 (A)

రెడ్డి/ 1991/ 5'3"/ MBBS/ PG/ Radiology 2nd Year/ V.Fair ★ 1986/ 5'5" M.Tech Asst. ప్రొఫెసర్/ Fair నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 9848221166/ 8885559579 (A)

రెడ్డి / 1990/ 5'5 1/2 B.Tech/ MS (Amazon) 130K Fair/ US ★ 1993/ 5'6"/ LLB/ Jindal/ 15 కోట్ల ఆస్తి/ Fair / నవీన్‌రెడ్డి మ్యారేజ్‌బ్యూరో ✆ 8885559579 (A)

వెలమ దొరలు 53సం॥. ఫ్యామిలి పెన్షనర్ 25,000 PM, భర్త ఆర్మీలో చనిపోయాడు. పిల్లలులేరు, సొంతఇల్లు, 5ఎకరాల పొలం గల వధువుకి వరుడు కావలెను. @ 70138 86194.(L)

క్షత్రియ/ చంద్రవంశము/ భీమవరం 45సం॥ ఎత్తు 5.4, లీగల్లీ డైవర్స్‌డ్ మండల విద్యాధికారి, సొంతఇల్లు, 40 ఎకరాలు రొయ్యల చెరువులు గల వధువుకి వరుడు కావలెను. @ 70138 86194.(L)

బ్రాహ్మణ/ 22/ 5'2"/ 10th ★ 25/ 5'4"/ ఇంటర్ ★ 27/ 5'4"/ ఇంటర్ వారంకే విడాకులు, కట్నం ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పూజారి OK. ✆ 9848819651/ 9848816536. (A)

వైశ్య/ 20/ 5'3"/ 10th ★ 23/ 5'4"/ ఇంటర్ ★ 25/ 5'4"/ B.Com వధువులకు వరులు కావలెను. బిజినెస్ అయినా O.K. ✆ 7702254878/ 9848816536. (A)

Kamma 5'2" Fair 27yrs 1yr Residency Doctor, US Green Card Needs USA Residency Doctor ✆ 8328501709 or srirao2762@gmail.com (A)

రెడ్డి వధువులకు వరులు కావలెను. అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (DV కోటిరెడ్డి) రోడ్డు-3, TV-9 ఎదురుకాలనీ బంజారాహిల్స్ హైద్రాబాద్. www.avinashreddy.com ✆ 9848011818 (A)

రెడ్డి/ డైవర్సీ/ 30Y/ 5'4"/ ఇంటీరియర్ డిజైనర్/ 11 కోట్ల ప్రాపర్టిగల అందమైన వధువుకి కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9347244255 (A)

కాపు/ కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ 24/ 5'4"/ ఫెయిర్/ డిగ్రీ సిటిలో ఒపెన్ ప్లాట్లు (6 కోట్లు)/ 16 కోట్ల ప్రాపర్టి ఏకైక అందమైన వధువుకు మంచి ఫ్యామిలి నుండి వరుడు కావలెను. ✆ (వాట్సాప్) 9121736511 (A)

రెడ్డి/ లేట్ మ్యారేజ్/ 20 కోట్లకు పైగా ఆస్తి/ ఫైనాన్స్ బిజినెస్ కలిగిన 34 సం॥రాల అందమైన ఒంటరి వధువుకు కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (వాట్సాప్) 7337269487 (A)

కుల పట్టింపులేదు కాపు నాయుడు 47, 5'3", MBA, B.Ed Govt + టీచర్ 75K PM & బిజినెస్ విడో, ఫెయిర్ అందమైన వధువుకి 70 సం॥లోపు వరుడు కావలెను. ✆ 7893744393 (A)

కాపు, డైవర్సీ, 38, 5'5", సొంత బిజినెస్ 75K, రెంట్స్ 40K, వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్థి, పట్టింపు లేదు. ✆ 8519914020/ 8519914060 (A)

కాపు, డైవర్సీ, 30, 5'4", MBA, మేనేజర్, 60K, 2Cr ప్రోపర్టీ కలిగిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. (కుల పట్టింపు లేదు.) ✆ 9705345003/ 7702274416 (A)

కాపు, విడో, 35, 5'5" ప్రైవేట్ జాబ్, 30K, ఓన్‌హౌస్, రెంట్స్ 25K, 2Cr ప్రోపర్టీ గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి, పట్టింపులేదు. 9505437430/ 9966871719 (A)

వైశ్య/ 24/ 5'4"/ B.Tech/ SWE/ 50K/ 5Cr ప్రోపర్టీ కలిగిన వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 7673939882/ 9951049449 (A)

కమ్మప్రత్యేకం/ 10Cr, MS, USA/ 20 Cr. M.Tech, Ind/ 10Cr, B.Tech, SWE, Ind/ 5Cr, MS, USA అందమైన, ఆస్తిగల వధువులకు వరుడు కావలెను./ శారద: 9849413031 (A)

SC, మాల (హిందు) Age: 33, 32, 30 అందమైన వధువుకు 2nd, Mach, డాక్టర్స్ (or) M.Tech (or) MSగాని అందమైన వరుడు కావలెను. అర్జెంట్ Cont: 9701655685. (A)

రెడ్డి, విడో కుల, ఆస్తి ప్రసక్తి లేదు 25, 5'5" ఫెయిర్/ డిగ్రీ 24 కోట్ల ఆస్తి యాక్సిడెంట్‌లో తండ్రిని, భర్తను కోల్పోయిన వధువుకు 1వ, 2వ వరుడు కావాలి. వాట్సప్ 7097355609. (A)

కమ్మ, విడో, 36, 5'5" ఇంటర్ 18 కోట్ల ఆస్తి 2 సం॥ పాప ఉన్న Hydలో 4 హౌస్‌లు. ప్రమాదంలో ఫ్యామిలీ కోల్పోయిన వంటరి వధువుకు కుల/ ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావాలి. వాట్సప్ 9121736501. (A)

Kammanaidu B.Tech/ 32, 5'.5" SWE/ USA fair need Qualified Groom. Caste Nobar. ✆ 80089 13979. Mail: madhukar.raob@gmail.com (C)

కాపు: 24, 5'4" B.Tech S/W/E విప్రో Hyd నెలకు 50,000/- జీతం గల సాంప్రదాయమైన ఫేర్ వధువుకు తగిన వరుడు కావలెను. (అర్జెంట్) ✆ 9059098156 (A)

Fair 5'.7" PG Pathology, 30 Yrs, Seeks, Groom from City Settled Doctors & Engineers. Caste Nobar. ✆ 98667 94497. (C)

Kamma 25/ 5'6"/ 5L PA/ B.Tech/ IT ★ 28/ 5'6"/ 4L PA/ Govt ★ 26/ 5'5"/ MBBS/ 4L PA ✆ 9000487865/ Blue Trend Matrimonial. (A)

Kamma Dr, 26, 5'2", US Residency, Beautiful India Born & Educated jehvja@gmail.com (B)

2nd Match, CNB, 26Y/ 5'4"/ White/ B.Tech/ SWE, Tech Mahendra/ 35,000 PM/ 5 Crore propertry/ Only Daughter/ No Eshus/ Cell: 73961 57727, 79010 12671(D)

బ్రాహ్మణ 24Y/ 5'5"/ White/ B.Tech/ Design Engineer/ 6.5 L PA/ 2 Crore pro. / Well Settled/ Only Daughter వధువుకి వరుడు కావలెను. 0877- 2230289, 76610 24441 (D)

కమ్మ: 25Y/ 5'5"/ B.Tech (IT)/ S/W Bangalore, 5 Lakhs P/A/ 5 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93461 24845 (D)

కమ్మ/ 24/ 5'3"/ B.Tech 18 Crs. ప్రాపర్టీ తల్లిదండ్రులు లేని ఏకైక వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపు లేదు. Whatsapp Only. ✆ 91214 51851. (B)

క్రిస్టియన్, మాదిగ 29 సం॥ 5'4" డెంటిస్ట్ (BDS) అందమైన తెల్లని యువతికి క్రిస్టియన్ డాక్టర్/ ఇంజినీరు కావలెను. కుల పట్టింపు లేదు. ✆ 92464 72883. (B)

★ ★ ★

హిందూ మాల, Gnt, Near Tenali, DB: 19/6/93, B.Tech, SWA Infosys (Hyd) జాబ్ గల వధువుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లేక డాక్టర్ జాబ్ చేస్తున్న వరుడు కావలెను. 90004 09980 డైరెక్ట్ (I).

Hindu, Mala/ 27/5'5"/ Software Engineer Girl/ Seeks Well Settled Boy, Govt Job Preferred. Phone: 8978530671 (A)

కుమ్మరి కన్వర్టెడ్ క్రిస్టియన్స్ 26 సం॥, 5.2, ఇంటర్ Qly. 1 కోటి ప్రాపర్టీ కలిగిన వధువుకు కులప్రసక్తి లేదు. కన్వర్టెడ్ క్రిస్టియన్ వరుడు కావలెను. ✆ 84659 51484. (B)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

సుజిత మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీ॥కు ఫ్రీ. పు॥ సర్వీస్ ఛార్జ్. ✆ 7893688248. (A)

కులపట్టింపులేని, అన్నికులాల, 1వ, 2వ, లేటు, డైవర్సీ, విడో, విడోయర్స్, ఒంటరి, ఇల్లరికం, రిటైర్డ్, పెన్షనర్స్ & వెరీరిచ్ మ్యాచెస్. ✆ 8500671845 (వాట్సప్ నెం- 9676453353) స్త్రీలకు ఫ్రీ (A)

ఓన్లీ Govt ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1వ, 2వ, లేట్ విడో/ డైవర్స్‌లకై వివాహాలు Govt ఎంప్లాయిస్ సంబంధాలు కొరకు వెరీ ఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N.శర్మ Hyd. ✆ 9248600342, 8019207503. brahmininformationmatri@gmail.com (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్‌కాస్ట్స్) MBBS/ MS/ MD/ MCH/ DM/ BDS/ MDS & బిజినెస్ మ్యాచ్స్‌కి 1వ/ 2వ/ విడో, దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును ✆ 9966808059 (A)

20సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహవేదిక శ్రీసత్యసాయి వివాహవేదిక. ✆ 9849414098/ 040 - 66317515, satyasai-vivahavedika.com (A)

Whats App your Photo & Biodata to 9347262769. We will send the suitable Matches. www.pellisandadi.com Estd. 1999 (A)

కేవలం యాదవ, కుర్మ, వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజా యాదవ్ www.gokulmarriage.com Hyd. 9440831748, Gunt. ✆ 9440759945, VSP. 9441735157. (A)

బ్రాహ్మణ లేటు మ్యారేజ్/ విడో/ డైవర్సీ వధూ-వరుల పరిచయ వేదిక 03-09-17న జ్యోతిగార్డెన్స్, ECIL, Hydలో జరుగును. Time: 1PM - 6PM. 9704656103/ 9533608887. (A)

SPL Doct (3000 ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM BDS, MDS & All Pharm కు 1వ, 2వ/ లేటు దేశ విదేశ సంబంధాలు అన్ని కులాలకు కుదర్చబడును. Ph: 9866411588 (A)

P.Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches. All Emp/ Govt./ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all Regions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040 - 23544820, 23545762. Email: palletisupriyareddy@gmail.com (A)

విశ్వబ్రాహ్మణ వివాహవేదిక మావద్ద దేశ, విదేశ 1వ, 2వ ఉన్నత ఉద్యోగ సాంప్రదాయ సంబంధాలకై. సంప్ర: 040 - 32531235/ 9063720789. (A)

క్షత్రియ, సూర్యవంశం, చంద్రవంశం, బట్రాజులు, MBBS, MD, B.Tech, MS, Govt, హైరేంజ్ జాబ్స్, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీస్, 1st, 2nd అబ్బాయిలు, అమ్మాయిలు, సంప్ర: M.ధనలక్ష్మి/ 8374514056. (A)

కాపు/ బలిజ fairlinksmatrimony.comలో ఉచితంగా login అవ్వండి వేలాది సంబంధాల నుండి తగినది ఎంపిక చేసుకొని మా ద్వారా వివాహం కుదుర్చుకోండి. HYD 93955 66115, VJA 93955 66114, VSP 93911 66116, TPT 92999 92601 (D)

రెడ్డి fairlinksmatrimony.comలో ఉచితంగా login అవ్వండి వేలాది సంబంధాల నుండి మీకు నచ్చిన సంబంధాలు ఎంపికచేసి వివాహం కుదుర్చుకోండి. TPT 93966 55166, NLR 93944 66117, HYD 92999 92603, VJA 92999 92602 (D)

★ ★ ★

అన్ని కులాల వారికి పెండ్లి సంబంధాలు చూడబడును. 2వ/లేటు వారికి కుదుర్చుట మా ప్రత్యేకత. లత మ్యారేజ్ లింక్స్ ✆ 98495 61502, 94412 11749 (M)

చౌదరి బ్యూరో VJWD కమ్మ, ముదిరాజ్, రెడ్డికాపు, పద్మశాలి, యాదవ, వెలమ, గౌడ, బ్రాహ్మణ, లంబాడి, SC, ST, 1వ, 2వ, లేట్, వీడోవర్స్. USA సంబంధా. 8801906060



వివాహ వేదిక

పీస్‌క్రిస్టియన్ మ్యారేజ్‌బ్యూరో అన్ని కులాల నుండి కన్వర్ట్ అయిన క్రిస్టియన్స్‌కు OC (కమ్మ, కాపు, రెడ్డీస్) BC, SC, ST 1&2 సంబంధాలు కలవు. ✆ 9246880866 (A)

కేవలం మాలమాదిగ /ST/ క్రిస్టియన్ మాప్రత్యేకత. 1వ, 2వ లేటు, డైవర్సీ/ విడోస్, Govt, సాఫ్ట్‌వేర్ జాబ్స్ దేశవిదేశ సంబంధాలకై, AP, తెలంగాణల్లో (3బ్రాంచీలు) ✆ 7095940444 (A)

శ్రీలక్ష్మీ మ్యారేజ్‌బ్యూరో వైశ్య, బ్రాహ్మణ కులాలవారికి వివాహ పరిచయవేదిక జరుపబడుచున్నది. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు సం: ✆ 73860 95552, 83330 46857. (B)

వాసవి-విజయవాడ వారిచే 10వ ఆర్యవైశ్య వధూవరుల పునర్వివాహ పరిచయ వేదిక 24-9-17 తేదీ మ. గం. 2.00 లకు విజయవాడలో జరుగును. వివరాలకు: ✆ 99895 00130, 81064 54284. (B)

రైలు బండి.. నీరుండదండి..!

- ప్రయాణం మధ్యలోనే అయిపోతున్న నీళ్లు
- మల మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు
- అరకొర నీటితో బోగీల్లో పారిశుద్ధ్య సమస్య
- ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం శూన్యం

ఈనాడు - హైదరాబాద్

రైళ్లలో నీటి నిర్వహణ లోపాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్ని దూరప్రాంత రైళ్లలో ప్రయాణం మొదలైన కొద్ది గంటలకే బోగీల్లో నీళ్లు అయిపోతున్నాయి. మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లలో నీరు రాకపోవడంతో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. మల, మూత్ర విసర్జనకు వెళ్లలేక అనేక తంటాలు పడుతున్నారు. గంటల తరబడి ఎదురుచూపుల తర్వాత వచ్చే పెద్దస్టేషన్‌లో నీళ్లు నింపిన తర్వాత గానీ కష్టాలు తీరడం లేదు.

దేశవ్యాప్తంగా నిత్యం 13,500 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సగటున రోజుకు 2.30 కోట్ల మంది ప్రయాణిస్తుంటారు. రైల్లో ప్రయాణికులకు అత్యంత అవసరమైనవి మరుగుదొడ్లు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి బోగీకి నీటి ట్యాంకులు ఉంటాయి. రైలు బయల్దేరేటప్పుడే నీరు నింపుతారు. అయిపోయిన తర్వాత మళ్లీ నింపేందుకు గాను కొన్ని స్టేషన్లలో రైళ్లను 15, 20 నిమిషాల వరకు ఆపుతుంటారు. కానీ, నీటిని నింపే స్టేషన్ల మధ్య కొన్ని మార్గాల్లో ఎక్కువ దూరం ఉండడం, కొన్నిచోట్ల అరకొరగా ఎక్కించడం, మరికొన్ని చోట్ల జోన్ల మధ్య సమన్వయలేమి వంటి కారణాలతో ప్రయాణం మధ్యలోనే బోగీల్లో నీళ్లు అయిపోతున్నాయి. ఆ ప్రభావం ప్రయాణికులపై పడుతోంది.

కొన్నిచోట్ల నీటి కొరతతో..

బెంగళూరు నుంచి హైదరాబాద్, విజయవాడ వైపు వెళ్లే రైళ్లలో నీటి సమస్య తరచుగా వస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. గుంతకల్లు స్టేషన్‌లో ప్రయాణికులు పలుమార్లు ఈ విషయంపై ఆందోళన వ్యక్తంచేశారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఒకట్రెండు ఇతర రైళ్లలో ఈ సమస్య తరచూ వస్తోందని.. రైలు సౌత్‌వెస్ట్రర్న్ జోన్‌ది కావడంతో నిర్వహణ అంశాల్లో వారిదే బాధ్యతని గుంతకల్లు డివిజన్ అధికారులు చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

- ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరులో బయల్దేరి రాత్రి 8.15కి గుంతకల్లు చేరుతుంది. ఇక్కడ 15 నిమిషాలు ఆపినా.. నీటి సమస్య వల్ల నింపడం లేదు. నంద్యాల దాటాక వచ్చే దిగువమెట్లలో నీళ్లు నింపుతున్నారు. అర్ధరాత్రి 12.20కి రైలు అక్కడికి వెళుతుంది. అంటే బెంగళూరులో నింపిన నీళ్లతోనే 10 గంటల పాటు ప్రయాణికులు సర్దుకుపోవాల్సిన పరిస్థితి.
- ప్రయాణికుల ఫిర్యాదుల నేపథ్యంలో గుంతకల్లులో రూ.9 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అక్కడ పట్టించుకునేవారే లేరు..

దిల్లీ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చే రైళ్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లోని స్టేషన్లలో నీళ్లు నింపాలి. ఝాన్సీ, నాగ్‌పూర్ స్టేషన్లలో కొన్ని రైళ్లలోనే నింపుతుండగా.. మరికొన్ని స్టేషన్లలో నింపడమే లేదు. దీంతో మార్గమధ్యంలో ప్రయాణికుల కష్టాలు మొదలవుతున్నాయి. తెలంగాణలోని కాజీపేట స్టేషన్‌లోనూ ఆయా రైళ్లకు నీళ్లు నింపడం లేదు. దీంతో అటు సికింద్రాబాద్‌కు, ఇటు విజయవాడ స్టేషన్‌కు వెళ్లేవరకు ప్రయాణికులు ఉగ్గపట్టుకోవాల్సిందే. ధన్‌బాద్, నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. తమిళనాడు, కేరళ నుంచి తిరుపతి, రేణిగుంటల మీదుగా ఏపీ, తెలంగాణలకు వచ్చే రైళ్లలోనూ నీటి సమస్యలు తప్పడం లేదు.



జనరల్ బోగీల్లోనూ..

పగటి ప్రయాణం ఉండే రైళ్లలోనూ నీటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. 24, 30 గంటలు ఆపైన ప్రయాణించే రైళ్లలో రాత్రి, పగలు అన్న తేడా లేకుండా నీటి సమస్య వస్తోంది. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి కష్టాలైతే అన్నీఇన్నీ కావు. ఆ బోగీలో 92 మంది ప్రయాణికులు ఉండాలి. కానీ, దాదాపు ప్రతి రైల్లో రెట్టింపు ఉంటారు. ఫలితంగా ఈ బోగీల్లో త్వరగా నీళ్లు అయిపోతున్నాయి. అయినప్పటికీ కొంతమంది ప్రయాణికులు తప్పనిసరై మూత్రవిసర్జనకు వెళుతుండడం వల్ల దుర్వాసనతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అమ్మకాలు డీలా.. ఆదాయం ఎలా?

- మెరుగుపడని డిస్కమ్స్ పని తీరు!
- ఈపీడీసీఎల్‌లో పెరిగిన నష్టాలు


ఈనాడు, అమరావతి: విద్యుత్ అమ్మకాలను పెంచులేకపోవడం వల్ల విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్స్) ఆదాయానికి గండిపడుతోంది. విద్యుత్ నష్టాలనూ తగ్గించలేకపోతున్నాయి. దేశంలోని అతి తక్కువ విద్యుత్ నష్టాలు కలిగిన తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో గతం కంటే విద్యుత్ నష్టాలు పెరిగాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఉంటాయి. వారు ఎంత విద్యుత్ వాడుకున్నారనే విషయం మీటర్ల ద్వారా తెలుస్తుంది. దీన్నే మీటర్డ్ అమ్మకాలుగా డిస్కమ్స్ పరిగణిస్తాయి. ఇదే ఆదాయానికి సూచిక. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల వివరాలను గత ఏడాది ఏప్రిల్, మే నెలతో పోల్చినపుడు ఈపీడీసీఎల్‌తోపాటు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్)లో మీటర్డ్ అమ్మకాలు తగ్గాయి. ఆ మేరకు ఆదాయానికి గండి పడినట్లే అయింది. వ్యవసాయానికి విద్యుత్ ఇస్తున్నప్పటికీ ఉచిత విద్యుత్ నేపథ్యంలో పంపుసెట్లకు మీటర్లు లేవు. కాబట్టి ఆ రంగానికి ఇచ్చే విద్యుత్ లెక్కలు కాకిలెక్కలే అనే అభిప్రాయం ఉంది.

- ఈపీడీసీఎల్‌లో వ్యవసాయ పంపుసెట్లు తక్కువ. దీనివల్ల మీటర్డు అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. కానీ గతం కంటే తగ్గడం ఆందోళన కలిగించే పరిణామమైంది.
- ఈపీడీసీఎల్‌కు విశాఖపట్నం గుండెకాయ. గృహ వినియోగదారులతోపాటు పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు ఎక్కువ. విశాఖ డివిజన్ పరిధిలో నష్టాలు 2శాతంలోపే. కానీ ఈ ఏడాది ఏప్రిల్ మే, నెలల్లో 3.11శాతానికి నష్టాలు పెరిగినట్లు ఓ విశ్లేషణలో వెల్లడైంది. నష్టాలు పెరగడానికి కారణం ఏమిటన్నది విశ్లేషించుకొని ముందుకు వెళ్లకపోతే భవిష్యత్‌లో ఇబ్బందే.
- ఈపీడీసీఈఎల్‌లో రాజమండ్రి డివిజన్ ఎప్పుడూ నష్టాలతో సమస్యాత్మకంగా ఉంటుంది.. ఇక్కడ విద్యుత్ నష్టాలు 9 శాతంపైనే.
- ఎస్పీడీసీఎల్‌లో విజయవాడ విద్యుత్ సర్కిల్, ఒంగోలు, కడప, కర్నూలు సర్కిల్‌లో కూడా నష్టాలు పెరిగినట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి. నష్టాలు పెరగడమంటే ఆదాయం తగ్గడమే.
- రాష్ట్రంలో ఒక శాతం విద్యుత్ నష్టాన్ని తగ్గించగలిగితే రూ.300 కోట్ల మేర ఆదా అవుతుందని అంచనా. విద్యుత్, పంపిణీ నష్టాలను ఏక అంకె స్థాయికి తీసుకురావాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన. కానీ, ఏప్రిల్ మే నెల విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలు 10.97 శాతం ఉన్నట్లు అధికారిక విశ్లేషణలోనే తేలింది.
- ఎస్పీడీసీఎల్‌లో ఏప్రిల్‌లో యూనిట్‌కు రూ.4.54 పైసలు ఆదాయం వస్తుందని అంచనా వేసినారూ.3.65 పైసలకే పరిమితం అయింది. ఆ నెలలో యూనిట్‌కు 89 పైసలు తగ్గింది. అయితే మే నెలలో పరిస్థితి మెరుగుపడింది.

వసుంధర

ఖర్చు వివరాలు చెప్పేస్తుంది!





ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ సంపాదించడం సాధారణం, అవసరమూ అయ్యింది. అయితే ఖర్చుల విషయానికొచ్చేసరికి ఎవరెంత పెడుతున్నారన్న అవగాహన లేకపోతే డబ్బుకు సంబంధించిన ప్రణాళికలు సరిగ్గా వేసుకోలేం. అలాంటి వారికోసమే ఈ హోమ్ బడ్జెట్ సింక్‌లైట్ యాప్. ఇందులో మీ కుటుంబ సభ్యులందరి ఖాతాలు ఒక్క దగ్గర పెట్టుకోవచ్చు. ఎవరెంత ఖర్చుపెట్టారన్న విషయం అందరికీ తెలుస్తుంది. అలాగే తేదీల ప్రకారం ఏయే బిల్లులు కట్టాల్సి ఉందో ఇందులో నమోదు చేసుకోవచ్చు. ఇది ఎప్పటికప్పుడు చేతిలో ఉన్న డబ్బుకు సంబంధించిన చార్ట్‌ను చూపిస్తుంది. దీని ద్వారా ఇప్పటివరకూ ఖర్చులు పెరిగాయో లేదా తగ్గాయో ప్రతి వారం పోల్చుకోవచ్చు.

పదార్థం కిందపడకుండా...

చిన్న పిల్లలకు గిన్నెలోనో, ప్లేట్‌లోనో తినడానికి ఏదైనా పెడితే కింద పడేస్తూనే తింటారు. లేదంటే ఆ గిన్నె పట్టుకుని ఇల్లంతా తిరుగుతారు. ఒంటిమీదా పారేసుకుంటారు. ఇలాంటి సమస్యకు పరిష్కారం స్పిల్ ప్రూఫ్ బౌల్. రెండు ప్లాస్టిక్ గిన్నెలు ఒకదాంట్లో ఒకటి పెట్టి ఉంటాయి. బయటిది 360 డిగ్రీలు తిరుగుతుంది. దీంతో లోపలున్న గిన్నెలో ఏదయినా పదార్థం వేసినప్పుడు అది ఎంత తిప్పినా, చివరికి తిరగేసినా కూడా కూడా కింద పడదు.




ముదిరిందేమో!


సంధ్యా, శ్రావణ్ తీవ్రంగా వాదించుకుంటున్నారు. చివరికి..

శ్రావణ్ : నేను పిచ్చివాణ్ని కాబట్టి నిన్ను పెళ్లాడాను!

సంధ్య : అవునా.. నేను ప్రేమలో పడి అప్పుడు గుర్తించలా. ఇప్పుడా పిచ్చి ముదిరినట్టుంది.. పదండి ఆసుపత్రికి!!



కేరళ మటన్ కర్రీ



కావల్సినవి: మటన్ - అరకేజీ, కారం - రెండు చెంచాలు, ధనియాలపొడి - రెండున్నర చెంచాలు, పసుపు - అరచెంచా, ఉల్లిపాయలు - రెండు, అల్లంవెల్లుల్లి ముద్ద - రెండు చెంచాలు, మిరియాలపొడి - చెంచా, నూనె - అరకప్పు, ఉప్పు - తగినంత, కరివేపాకు రెబ్బలు - రెండు.

మసాలా కోసం: కొబ్బరి ముక్కలు - ముప్పావు కప్పు, మిరియాలు - అరచెంచా, సోంపు - అరచెంచా, యాలకులు - నాలుగు, లవంగాలు - ఐదు, దాల్చినచెక్క - చిన్న ముక్క, ఉల్లిపాయల ముక్కలు - అరకప్పు.

తయారీ: పొయ్యిమీద బాణలి పెట్టి... చెంచా నూనె వేయాలి. అది వేడయ్యాక మసాలా కోసం పెట్టుకున్న పదార్థాలన్నింటినీ ఒక్కొక్కటిగా వేసుకుని వేయించుకుని తీసుకోవాలి. వేడి చల్లారాక మిక్సీలో ముద్దలా చేసుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు మటన్ ముక్కలూ, కారం, ధనియాలపొడీ, పసుపూ, ఉల్లిపాయ ముక్కలూ, అల్లంవెల్లుల్లి ముద్దా, కరివేపాకూ, తగినంత ఉప్పు ఓ గిన్నెలో వేసుకుని అన్నింటినీ బాగా కలపాలి. అరగంటయ్యాక పావుకప్పు నీళ్లు పోసి.. కుక్కర్‌లో మెత్తగా ఉడికించుకుని తీసుకోవాలి. బాణలిని పొయ్యిమీద పెట్టి మిగిలిన నూనె వేసి.. ముందుగా చేసిపెట్టుకున్న మసాలా వేయాలి. ఐదు నిమిషాలయ్యాక మటన్ ముక్కలు వేసి.. వాటికి మసాలా పట్టేలా బాగా కలపాలి. ఇది బాగా వేగాక మిరియాలపొడి చల్లి దింపేయాలి. ఇది అన్నంలోకే కాదు.. చపాతీల్లోకీ బాగుంటుంది.

చీరలో లావుగా కనిపించాలంటే?



? నా ఎత్తు ఐదు అడుగులు. 23 సంవత్సరాలు. బాగా సన్నగా ఉంటాను. చీర కట్టుకుంటే ఇంకా సన్నగా కనిపిస్తా. లావుగా కనబడాలంటే ఎలాంటి చీరలు, బ్లవుజులు ఎంచుకోవాలి?

\- లక్ష్మి, ఆదిలాబాద్

✔ మీరు కాస్త లావుగా, ఎత్తుగా కనిపించాలని కోరుకుంటున్నారు. అయితే ముందు మీరు ఏ చీర ఎంచుకున్నా కట్టుకునే విధానంలో కాస్త తేడా చూపించాలి. చీర నడుము కింది భాగం నుంచి కట్టుకుంటే మేలు. అదీ చెప్పులు వేసుకున్నాక చీర కుచ్చిళ్లు పెట్టుకోండి. దీనివల్ల మీరు కాస్త పొడవుగా కనిపించేలా చేయొచ్చు. ఆర్గాంజా, షిఫాన్, వంటి చీరలు మీ లాంటివారికి చక్కగా నప్పుతాయి. కాటన్‌కి బదులుగా లినెన్‌ని ఎంచుకుని చూడండి. అయితే బ్లవుజులు వేరే రంగులో ఎంచుకుంటే మంచిది. నిండుగా కనిపిస్తారు. పార్టీవేర్ కోసం ఉప్పాడ, గద్వాల్, లేదంటే కంచి పట్టు చీరల్లో పెద్ద అంచు ఉన్నవి ఎంచుకుంటే బాగుంటాయి. అదే బ్లవుజు విషయానికి వస్తే మోచేతి పైవరకూ ఉండేలా చూసుకోవాలి. గుండ్రటి మెడా, వెనక కీహోల్ తరహావి మీలాంటివారికి నప్పుతాయి.

నజరానా

అరికాళ్ల పగుళ్లా..
ఆముదంలో కాస్త పసుపు
వేసి వేడిచేసి అరికాళ్లకు
రాసుకుని చూడండి.

బంగారం-వెండి



19న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	------	------	30,200	30,150
ఆర్నమెంట్	------	------	28,100	28,000
వెండి (కిలో)	------	------	40,500	40,500

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,900	29,950	29,510	29,420
ఆర్నమెంట్	27,730	27,730	27,590	27,950
వెండి (కిలో)	40,000	40,000	39,200	38,800

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,990	30,150	-------	-------
ఆర్నమెంట్	27,590	27,740	2,759	2,795గ్రా
వెండి (కిలో)	40,500	40,500	41.90	42.60గ్రా

ఫొటో తీశాడని చొక్కా పట్టుకున్నా!



చిన్నప్పుడు... గోల్ఫ్ బాగా ఆడిన ఈ అమ్మాయి అదే తన భవిష్యత్తు అనుకుంది..

తరవాత... లెక్కల్లో ఆనర్స్ పూర్తిచేసినప్పుడు ఇంకా ఉన్నత చదువులు చదవాలనుకుంది..

కొన్నాళ్లయ్యాక... అందాల పోటీల్లో టైటిళ్లు గెలుచుకున్నప్పుడు తనకు సూటయ్యే రంగం గురించి ఇక ఆలోచించలేదు..

కట్‌చేస్తే... సినిమా హీరోయిన్ అయ్యింది. వరుస సినిమాలతో దూసుకుపోతోంది.

'బ్రూస్‌లీ', 'నాన్నకు ప్రేమతో', 'సరైనోడు', 'ధృవ', 'రారండోయ్ వేడుక చూద్దాం', 'జయ జానకి నాయక' అంటూ వరుస హిట్‌లను తన ఖాతాలో వేసుకుంటోన్న ఆమే.. రకుల్ ప్రీత్ సింగ్.

అప్పుడు విసుగు.. ఇప్పుడు లేదు!

చిన్నతనం నుంచీ.. నాకు ఆటలపై ఇష్టం ఏర్పడటానికి కారణం మా నాన్నే. మాది పంజాబీ కుటుంబం. నాన్న ఆర్మీ అధికారి. అమ్మ గృహిణి. తమ్ముడు అమన్. నేను పుట్టింది దిల్లీలో అయినా నాన్న ఉద్యోగంతో కశ్మీరు నుంచీ బెంగళూరు వరకూ చాలాచోట్లే తిరిగాం. ఎక్కడున్నా... ఆ ప్రాంతంలోని రకరకాల కళలూ, ఆటలూ నేర్చుకునేదాన్ని. అంటే ఐజ్వాల్‌లో బాస్కెట్‌బాల్, జలంధర్‌లో సంగీతం నేర్చుకున్నా. అవే కాదు... బాస్కెట్‌బాల్, గోల్ఫ్, డ్యాన్స్, కరాటే... ఇలా ఎన్నో నేర్చుకోగలిగా. ఏడో తరగతిలో ఉన్నప్పుడు స్కూలు నుంచి రాగానే రోజూ గోల్ఫ్‌క్లాసుకి వెళ్లడం పెద్ద హింసలా ఉండేది. ఇంకేదయినా ఆట నేర్చుకుంటా అని ఏడ్చేదాన్ని. కానీ నాన్న ఒప్పుకోలేదు. 'నేర్చుకోక ముందే నచ్చలేదని చెప్పొద్దు. ఆ తరవాత కూడా నీ అభిప్రాయం ఇదే అయితే నీ ఇష్టం' అన్నారు. కానీ ఆ తరవాత దాన్నెప్పుడూ వదిలిపెట్టలేదు. ఎందుకంటారా? హైస్కూల్లో ఉన్నప్పుడే నేషనల్స్ వరకూ వెళ్లగలిగా. ఇప్పటికీ హైదరాబాద్‌లో నెలకోసారైనా గోల్ఫ్‌క్లబ్‌కెళ్లి ఆడుతుంటా. అంతేకాదు మోడలింగ్, మిస్ ఇండియా పోటీలకు వెళ్లనంతవరకూ అదే నా జీవితం అనుకున్నా.

ఎదురుతిరిగా...

ఎప్పుడూ స్నేహితులూ, ఆటపాటలేనా అనుకుంటున్నారా? చదువులోనూ ఫస్టే. దానికీ నాన్న మాటలే కారణం. 'జీవితంలో నిలబడాలంటే కనీసం సరైన డిగ్రీ అయినా ఉండాలి' అనేవారు. అందుకే ఎన్ని నేర్చుకుంటున్నా... దిల్లీలోని జీసస్ అండ్ మేరీ కాలేజీ నుంచి మ్యాథ్స్ ఆనర్స్‌లో డిగ్రీ చేశా. మా కాలేజీ చాలా స్ట్రిక్ట్. హాజరు ఏ మాత్రం తగ్గినా ఊరుకునేవారు కాదు. నాకూ అదే క్రమశిక్షణా అలవాటైంది. ఎవరైనా తప్పు చేసినా ఊరుకునేదాన్ని కాదు. కాలేజీలోని మా సౌత్ క్యాంపస్ చాలా శుభ్రంగా ఉండేది. ఓ రోజు మేం నడిచివెళ్తుంటే కారులో వెళ్తున్న కొందరబ్బాయిలు బీర్‌బాటిల్‌ని రోడ్డుపైకి విసిరేశారు. నాకు కోపం వచ్చేసింది. వెంటనే దాన్ని తీసుకుని వెళ్తోన్న ఆ కారుమీదకే విసిరేశా. దాంతో వాళ్లు గొడవకొచ్చారు. నేనూ తగ్గలేదు. చివరకు వెళ్లిపోయారు. మరోసారీ అంతే. నైనిటాల్‌కి స్నేహితులంతా కలిసి విహారయాత్రకు వెళ్లాం. ఒకబ్బాయి మమ్మల్నే అనుసరించడం గమనించలేదు. అక్కడ ఓ కోటు కొనుక్కుందామని బేరాలాడుతుంటే ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. ఫ్రెండ్ అది చూసి నాకు చెప్పింది. నేరుగా అతని దగ్గరికే వెళ్లి ఫోన్ ఇవ్వమని అడిగా. ఇవ్వకపోవడంతో లాక్కున్నా. మా ఫొటోలు కనీసం ఇరవైవరకూ ఉన్నాయి. డిలీట్ చేయమంటే చేయలేదు. చొక్కా పట్టుకుని కొట్టా.

మోడలింగ్ నుంచి... సినిమాలకు



అమ్మ అందాలపోటీల్లో నన్ను పోటీ చేయమనేవరకూ గోల్ఫ్ క్రీడాకారిణి కావాలనుకున్నా. అమ్మ మాత్రం నన్ను మిస్‌ఇండియా చేయాలనుకుంది. అప్పుడు చాలా సన్నగా ఉండేదాన్ని. దాంతో నాకు బికినీలు నప్పవమ్మా అని జోక్ చేసేదాన్ని. క్రమంగా నాకూ ఆసక్తి పెరిగింది. చివరకు నాన్న కూడా సరేననడంతో మోడలింగ్, అందాలపోటీల్లో పాల్గొన్నా. అలా ఫెమీనా మిస్ ఇండియా పోటీలవరకూ వెళ్లా. విజేతను కాలేకపోయినా ఐదోస్థానంలో నిలబడి ఐదు టైటిళ్లు గెలుచుకున్నా. మిగిలినవారు గెలవలేకపోయామని బాధపడుతుంటే నేను మాత్రం ఆ సాయంత్రమే హ్యాపీగా డిన్నర్‌కి వెళ్లిపోయా. ప్రతి సందర్భం ఏదో ఒకటి నేర్పిస్తుందని ముందునుంచీ అనుకోవడమే అందుకు కారణం. నిజానికి అంతకు ముందే అంటే ఇంటర్వ్వగానే కన్నడ సినిమా చేసే అవకాశం వచ్చింది. మొదట చేయనన్నా..కానీ ఐదులక్షల రూపాయలు ఇస్తామనేసరికి కారుకొనుక్కోవచ్చని సరేనన్నా. అదే తెలుగులో వచ్చిన 7/జీ బృందావన్‌కాలనీ. అది ఏడు నెలల తరవాత రిలీజ్ అయ్యింది. పదిహేను రోజులు షూటింగ్‌కి వెళ్లడంతో కాలేజీలో హాజరు తగ్గిపోయింది. కాలేజీ వాళ్లు ఇకపై అలా మానేయడానికి వీల్లేదనడంతో ఎవరు ఎంత పెద్ద అవకాశం ఇచ్చినా వద్దనేదాన్ని. చిన్నపాత్ర రెండుమూడు రోజుల్లో పూర్తయ్యేవి ఉంటే చెప్పమనేదాన్ని. అలా రెండు సినిమాలు చేశా కూడా. 'రఫ్' చేస్తున్నప్పుడు జెమినీ కిరణ్‌గారు నన్ను చూసి స్క్రీన్‌టెస్ట్ చేయించారు. అలా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో నటించా. అది నా జీవితంలో పెద్ద మలుపు. తరవాత 'కిక్ 2,' 'బ్రూస్‌లీ', 'సరైనోడు', 'ధృవ', 'జయ జానకి నాయక'... ఇలా ఎన్నో ఉన్నాయి. త్వరలో స్పైడర్ విడదల కాబోతోంది.

వెబ్‌సైట్ పెట్టారు...

వ్యాయామానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చినా.. గ్యాడ్జెట్లూ.. టెక్నాలజీ విషయంలో ఎంతవరకూ అవసరమో అంతే వాడుతుంటా. నా ఫోనులో సోషల్ మీడియాకు సంబంధించిన యాప్‌లన్నీ ఉంటాయి. కానీ వాటిని అవసరం మేరకే వాడతా. ఎప్పటికప్పుడు బజార్లో వచ్చే గ్యాడ్జెట్లు ఊరిస్తున్నా... అవసరం అయితేనే కొంటా. సామాజిక మాధ్యమాలను కేవలం అభిమానులకోసమే ఉపయోగిస్తుంటా. కొన్నిసార్లు సమాధానాలూ ఇస్తుంటా. అన్నట్లు చెప్పనేలేదు కదూ... రకుల్‌ఫ్యాన్స్.కామ్ పేరుతో నా అభిమానులు ఓ వెబ్‌సైట్‌నే నిర్వహిస్తున్నారు.

తెలుగువారంటే ఇష్టం..



రకుల్ అంటే ఓ గుర్తింపు తెచ్చిపెట్టిన తెలుగు ప్రేక్షకులంటే నాకు ప్రత్యేక అభిమానం. అందుకే తెలుగు భాషను ఇష్టంగా నేర్చుకున్నా. మొదట్లో సెట్లో తెలుగు మాట్లాడుతుంటే నాకసలు అర్థమయ్యేది కాదు. అడిగి తెలుసుకునేదాన్ని. నా మేకప్ మ్యాన్, డ్రైవర్ అనే కాదు.. ప్రతి ఒక్కరినీ తెలుగులోనే మాట్లాడమనేదాన్ని. అలా చాలా తక్కువ సమయంలోనే నాకు తెలుగు మాట్లాడటం వచ్చేసింది. హైదరాబాద్‌తో అనుబంధం కూడా పెరిగింది. ఇక్కడే సొంత ఇల్లూ కొనుక్కున్నా. పెళ్లి చేసుకున్నాక ఆ అబ్బాయి నాతో హైదరాబాద్ రావాల్సి ఉంటుందని అమ్మతో అప్పుడప్పుడూ అంటూంటా.

వ్యాయామం అంటే పిచ్చి...

నాకు ఫిట్‌నెస్ అంటే ప్రాణం. ఎంతలా అంటే...ఒక్కరోజు కూడా జిమ్‌కి వెళ్లకుండా ఉండలేను. దానిపై ఉన్న ఇష్టంతోనే హైదరాబాద్‌లో, వైజాగ్‌లో ఎఫ్45 పేరుతో జిమ్‌లు ఏర్పాటుచేశా. ఇంతకీ ఎఫ్45 అంటే ఏంటీ అంటారా? ఫంక్షనల్ ట్రెయినింగ్. 45 అంటే నలభైఅయిదు నిమిషాలు అని. అంటే కేవలం నలభైఅయిదు నిమిషాల్లో చక్కటి ఫలితం ఇచ్చే వ్యాయామం అని. నేనొక్కదాన్నే కాదు.. నా స్నేహితుల్నీ వదిలిపెట్టలేను. వారిచేతా చేయించేస్తుంటా. అప్పుడే శరీరంలోని వ్యర్థాలు బయటకుపోతాయి. కావల్సినంత శక్తి అందుతుందని నమ్ముతా. వాళ్లకీ చెబుతా. పైగా ఆరోగ్యంగా, అందంగానూ కనిపించొచ్చని నా నమ్మకం. వ్యాయామంతోపాటూ అందానికీ ప్రాధాన్యం ఇస్తా. మేం ఎక్కువగా అలంకరణ చేసుకుంటాం కాబట్టి ముఖంపై త్వరగా ముడతలు వస్తాయి. దానికితోడు రకరకాల హెయిర్‌స్టయిళ్లనూ ప్రయత్నిస్తుంటాం. తరచూ హీట్ చేయాల్సి రావడం వల్ల జుట్టు కూడా ఎక్కువ రాలిపోతుంది. ఆ సమస్యలేవీ లేకుండా తరచూ డీటానింగ్ ఫేస్‌ప్యాక్స్, హెయిర్ ట్రీట్‌మెంట్స్ తీసుకుంటా. 'రారండోయ్ వేడుక చేద్దాం'' సినిమాకోసం కొన్నిరోజులు రేపల్లెలో షూటింగ్ జరిగింది. ఆ సమయంలో ఎండ వేడికి కుడి భుజం దగ్గర నల్లగా, కమిలిపోయినట్లు అయిపోయింది. ఆ తరవాత ముంబయికి వెళ్లి డీట్యాన్ ప్యాక్ చేయించుకుని రావాల్సి వచ్చింది. అలాంటి చికిత్సలు అప్పుడప్పుడూ మాత్రమే. తీరిక ఉంటే గనుక పెరుగూ, పండ్లతో ప్యాక్‌లు వేసుకుంటా. ఎంత తీరికలేకున్నా పడుకునే ముందు మాత్రం తప్పనిసరిగా మేకప్ తీసేస్తా.

\- స్వాతి కొరపాటి

ఒత్తిడా.... ముద్ర వేద్దాం!

ఒక్కోసారి పెద్దగా కారణం కూడా ఉండదు. కానీ ఆందోళనగా, గుండె దడగా ఉంటుంది. దీన్నే ఆంగ్లంలో ఫ్లయింగ్ బటర్‌ఫ్లైస్ ఇన్ స్టమక్ అంటారు. 'టెన్షన్‌గా ఉంది' అంటామే అలాంటి పరిస్థితి. పనిలో ఒత్తిడి పెరగడం, భయం వంటివి దీనికి కారణం. ఆ కంగారూ, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే ఈ ముద్రలూ, ఆసనాలు ఉపయోగపడతాయి.



ముష్టిముద్ర: వజ్రాసనం లేదా సుఖాసనంలో కూర్చోవాలి. తరవాత బొటనవేలిని ఉంగరం వేలుమీదుగా రానిచ్చి పిడికిలిని బిగించాలి. అలా చేయడం



వల్ల కోపం, ఆవేశం, ఆందోళన, చిరాకు వంటి సమస్యలు ఉంటే తగ్గుతాయి. రోజూ రెండు నుంచి మూడు నిమిషాల వరకూ ఈ ముద్రలో కూర్చోవచ్చు.



గోముఖాసనం: ముందుగా వజ్రాసనంలో కూర్చుని... ఎడమకాలిని వెనక్కి మడిచి ఉంచాలి. దానిపై కుడికాలిని ఉంచాలి. కాళ్లు రెండు ఒకదానిపై ఒకటి ఉండి... ముందుకు వస్తాయి. ఇప్పుడు ఒక చేతిని భుజం పైనుంచి రానిచ్చి రెండో చేతిని వీపు వెనుకగా తెచ్చి రెండింటినీ పట్టుకోవాలి. దీనివల్ల ఛాతీ విశాలంగా అయి.. శ్వాస అందుతుంది. ఒత్తిడీ, కంగారు తగ్గడమే కాదు.. వ్యతిరేక ఆలోచనలు ఉన్నా పోతాయి.



క్షేపన ముద్ర: సుఖాసనం లేదా వజ్రాసనంలో కూర్చుని.. రెండు అరచేతులూ దగ్గరగా ఉంచి... చూపుడువేళ్లు మాత్రం పైకి ఉంచి తక్కిన వేళ్లను చిత్రంలో చూపించినట్టుగా ఒకదానితోఒకటి మడవాలి. బొటనవేళ్లని ఒకదానిపై ఒకటి క్రాస్‌గా ఉంచాలి. ఇలాగే ఉండి... ఏడు నుంచి పదిహేను సార్లు శ్వాస తీసుకుని వదలాలి.

కాళేశ్వర ముద్ర: ఒక్కసారిగా రకరకాల ఆలోచనలు మనల్ని చుట్టుముట్టకుండా మనసుని ప్రశాంతంగా ఉంచే ముద్ర ఇది. వజ్రాసనం లేదా సుఖాసనంలో కూర్చుని చిత్రంలో చూపించినట్టుగా రెండు చేతుల వేళ్లూ కిందకు ఉంచాలి. బొటన వేళ్లూ, మధ్యవేళ్లూ ఒకదానితో ఒకటి తాకించి తక్కిన వేళ్లు పైకి మడిచి ఉంచాలి. చేతులని ఛాతీకి దగ్గరగా కాకుండా కాస్త దూరంగా ఉంచాలి. ఇప్పుడు ఇలా చేస్తే శరీరంలోని ఒత్తిడి తొలగిపోతుంది.





డాక్టర్ మణిపవిత్ర
యోగా నిపుణురాలు, ✆ 7702491110

ఆ దేశాల్లో క్రమశిక్షణ ఇలా...

పిల్లలను పెంచడంలో ఎవరి ప్రత్యేకత వారిదే. వివిధ దేశాల్లోని తల్లిదండ్రులు పిల్లల క్రమశిక్షణ కోసం ఆచరిస్తున్న విధానాలేంటో ఒకసారి చూద్దాం.



అమెరికాలో తల్లిదండ్రులు పిల్లల కోసం రోజుమొత్తం ఏదో ఒకటి తినడానికి ఇస్తూ ఉంటారట. కానీ కొరియాలో మాత్రం చిన్నపిల్లలైనా సరే పెద్దవాళ్లు ఎప్పుడు తింటే అప్పుడే వాళ్లతో పాటు భోజనం చేయాలి. అది వాళ్లలో క్రమశిక్షణను పెంచుతుందని వారి నమ్మకం.

- అమెరికాలో పిల్లలు పెరిగేకొద్దీ వారిని వేరే గదిలో పడుకోబెట్టడం అలవాటు చేస్తారు తల్లిదండ్రులు. దానివల్ల వారిపై వారికి ధైర్యం పెరుగుతుందనీ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందనీ భావిస్తారు.
- స్వీడన్‌లో కుటుంబానికి సంబంధించిన అన్ని నిర్ణయాల్లో పిల్లల అభిప్రాయం తల్లిదండ్రులు తీసుకుంటారు. దీనివల్ల సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం చిన్నప్పటి నుంచే పిల్లలకు అలవాటు అవుతుందని వారి అభిప్రాయం. మెక్సికోలో పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత బాగా అలవాటు చేస్తారు. అక్కడ పాఠశాలలకు పిల్లలు పరిశుభ్రంగా వెళ్లకపోతే... వెంటనే ఇంటికి ఉత్తరం రాస్తారట. అక్కడ విద్యావ్యవస్థలో వ్యక్తిగత శుభ్రత కూడా ఒక సబ్జెక్టుగా బోధిస్తారు.

ఈనాడు **బిజినెస్** వారాంతం



లక్షల కోట్ల రూపాయలతో వ్యాపారాలు సాగించే కార్పొరేట్ సామ్రాజ్యాల్లో కలతలు మొదలైతే.. లుకలుకలు చేయిదాటితే.. ఎంత కష్టం.. ఎంత నష్టం..!! ఆ కంపెనీలనే నమ్ముకుని ఉపాధిపొందే వాళ్లు కొందరైతే.. అందులో పెట్టుబడులు పెట్టి లాభాల పొందాలనుకునేవారు మరికొందరు. పట్టువిడుపులు లేని విమర్శనాస్త్రాలు, దుందుడుకు మాటలు ఎంతటి దిగ్గజాలనైనా బేజారెత్తిస్తాయి. గతంలో టాటా-మిస్త్రీల ఉదంతమైనా, తాజాగా సిక్కా-మూర్తిల వివాదమైనా నష్టపోయేది ఆ కంపెనీని నమ్ముకున్నవారే. పోయేది ఆ కంపెనీ ప్రతిష్ఠే. మసకబారేది భారత కార్పొరేట్ రంగమే. నలుగురులోనూ పలుచనయ్యేది కార్పొరేట్ ఇండియాయే. ఈ అంశాలను విశ్లేషిస్తూ 'ఈనాడు బిజినెస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..

ఎందుకీ లుకలుకలు!

ఈనాడు వాణిజ్య విభాగం

ఎకరం పొలం ఉంటేనే నానాయాగీ చేస్తూ కొట్టుకుచస్తున్న రోజులివి.

మరి లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ.. వేల కోట్ల ఆస్తులతో అలరారుతూ.. లక్షల కోట్ల వ్యాపారాల్ని నిర్వహిస్తూ..

కార్పొరేట్ చరిత్రలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని లిఖించుకున్న కంపెనీల్లో లుకలుకలు మొదలైతే..

చూసేవాళ్లకు తమాషాగానే ఉంటుంది.. దిగజారేది మాత్రం ఆ కంపెనీ పరువే. ఇది అవసరమా..!

ఉభయుల వాదనా సబబే కావొచ్చు. రెండిట్లోనూ వాస్తవాలు ఉండి ఉండొచ్చు. మరి ఈ గొడవలు ఎందుకు వస్తున్నాయి... అన్న ప్రశ్న తలెత్తక మానదు. అయితే ఈ పరిస్థితి మాత్రం ఎవరికీ శ్రేష్టం కాదు. అది వ్యక్తికైనా.. సంస్థకైనా.. ఇన్ఫోసిస్ వివాదం సైతం ఇందుకు మినహాయింపు కాదు..

అంతరాలు కారణమా..

కొంచెం లోతుగా పరిశీలించి చూస్తే..తరాల అంతరాలు ఒక కారణమేమో అనిపించక మానదు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పును వంటబట్టించుకోవడం అత్యావశ్యకం.. తదనుగుణంగా పుట్టుకొచ్చే కొత్త మార్పులను ఆహ్వానించాల్సిందే. లేదంటే పోటీపడలేక చతికిలపడిపోవడం తథ్యం. మొన్నటిదాకా ఆహా, ఓహో అన్న జనమే మర్నాటికి మనమెవరో మర్చిపోతారు.

బహుశా ఇన్ఫోసిస్‌లో జరుగుతున్నది ఇదేనేమో..

కిందటేడాది ఇలాంటిదే మనకో ఉదాహరణ ఎదురైంది.. ఏరికోరి తెచ్చుకున్న వ్యక్తే పనికిరాడు పొమ్మన్నారు. ఇది టాటా గ్రూపు-సైరస్ మిస్త్రీల వివాదం. సరిగ్గా ఇలాంటిదే ఇన్ఫోసిస్‌లోనూ ఎదురైంది. తగిన వ్యక్తి అంటూ పగ్గాలు అప్పగించి.. ఇప్పుడదే వ్యక్తిని దునుమాడుతున్నారు...!!

ఏడాది క్రితం గ్రూపు విలువలు తుంగలో తొక్కేస్తున్నాడు అంటూ సైరస్ మిస్త్రీపై టాటా గ్రూప్ దిగ్గజం రతన్ టాటా విరుచుకుపడ్డ విషయం గుర్తుండే ఉంటుంది.

విచిత్రమేమిటంటే.. అదే రతన్ టాటా.. ఎంతో మదింపుచేసి.. ఎంతోమందిని ఆచితూచి పరిశీలించి చివరకు ఇంతకు మించిన వజ్రం లేదంటూ తనకు వారసునిగా సైరస్ మిస్త్రీ చేతిలో టాటా గ్రూప్ పగ్గాలు పెట్టారు. ఆ తర్వాత కూడా మిస్త్రీ చేసే ప్రతిపనికీ మద్దతు పలుకుతూనే వచ్చారు. అంతలోనే ఏం జరిగిందో తెలీదు..

మిస్త్రీ మీద విరుచుకుపడటం మొదలుపెట్టారు.. చివరకు పరిస్థితి శ్రుతిమించి మిస్త్రీని గ్రూపులోంచి బయటకు పంపేసే స్థాయికి చేరుకుంది.

ఇది ఒక్క మిస్త్రీకే కాదు.. టాటా గ్రూప్‌కూ ఒక మచ్చగానే మిగిలిపోయింది. అంతేనా.. యావత్ కార్పొరేట్ ఇండియాలోనూ ఒక చర్చనీయాంశంగాను, టాటా గ్రూప్‌ను పలుచన చేసే విషయంగానూ నిలిచిపోయింది.

వాస్తవానికి సైరస్ మిస్త్రీ అనామకుడేమీ కాదు... వేల కోట్ల రూపాయల షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్‌కు వారసుడు. మరి అలాంటి వ్యక్తి గ్రూపును భ్రష్టుపట్టిస్తాడని భావించగలమా...!!! ఏమో.. లోగుట్టు పెరుమాళ్లకెరుక..

అయితే మిస్త్రీ విషయంలో రతన్ టాటా ముందుచూపుతో వ్యవహరించలేకపోయారనే విమర్శలు అప్పట్లోనే వినిపించాయి. విలువలకు మిస్త్రీ ఎక్కడా తిలోదకాలు ఇచ్చాడని చెప్పలేం. అతను చేసిందల్లా.. కంపెనీల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని నష్టదాయక, లాభాలు తెచ్చిపెట్టని సంస్థలపై కొరడా ఝుళిపించడం మొదలుపెట్టారు.

'మా తాతలు నేతులు తాగారు.. మా మూతులు వాసన చూడండి' అనే ధోరణికి చరమగీతం పాడాలనే సత్సంకల్పం మిస్త్రీ చర్యల్లో స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. మారుతున్న కాలానికి అనుగుణంగా... కొత్త పోటీకి సంసిద్ధమయ్యే యత్నంలో మిస్త్రీ కొన్ని దూకుడు చర్యలకు దిగి ఉండొచ్చు గాక..! వాటిని జీర్ణించుకోవడంలో రతన్ ఇబ్బంది పడ్డారని నిపుణులు అంటూ ఉంటారు. మా గ్రూపు ఇంత గొప్పది కాబట్టి.. మాకంటూ కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి కాబట్టి వాటి ప్రమాణాల్లోనే నడుచుకోవాలంటూ గిరిగీయడం నేటి కాలమాన పరిస్థితుల్లో సాధ్యమయ్యే పనికాదన్నది విశ్లేషకుల మాట. మారాలి.. కాలానుగుణంగా మారాలి.. కష్టమైనప్పటికీ..ఇష్టంలేనప్పటికీ.. కొన్నిటిని ఔపోసన పట్టాల్సిందేనన్నది వారు అంటూ ఉంటారు.

టాటా గ్రూపు విలువల విషయం సైరస్ మిస్త్రీకి తెలియదని అనుకోలేం. ఆయన ఆ విలువల్ని తుంగలో తొక్కేస్తున్నాడనీ భావించలేం. బూజుపట్టిన కొన్ని భాగాల్ని దులపడానికి ఆయన ప్రయత్నించడం ఉద్వాసనకు దారి తీసి ఉండొచ్చుగాక.. ఈ ఒక్క విషయంలోనూ రతన్‌టాటా కొంచెం ఓపికపట్టి ఉంటే టాటా గ్రూప్ అంతలా వీధికెక్కేది కాదేమో.. అనే స్వరాలు వినరావడం గమనార్హం. పైగా మిస్త్రీ సైతం రతన్ జాడల్లోనే అడుగేస్తూ ఒక్కోదాన్ని క్రమక్రమంగా సంస్కరించుకుంటూ పోయి ఉంటే.. బావుండేదేమో...

విలువలు రతన్ దృష్టిలో ఎంత ప్రధానమైనవో... లక్షల కోట్లు వెచ్చించి చేసే వ్యాపారంలో పుణ్యం-పురుషార్థం అంటూ పోతే చివరికి మిగిలేది ఏదీ ఉండదన్న మిస్త్రీ ఆంతర్యమూ అంతే వాస్తవం కావొచ్చు. అయితే రచ్చకెక్కడమే భారత కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకటైన టాటా గ్రూప్‌కు పెద్ద మచ్చ తెచ్చిపెట్టిందనడంలో సందేహంలేదు.

ఇన్ఫీ గాడి తప్పిందా..

దాదాపు ఇదే తరహా కోణం సిక్కా-మూర్తి విషయంలోనూ కనిపిస్తుంది. భారత్ వంటి ఎదుగుతున్న దేశానికి ఎనిమిదో దశకంలో సాంకేతికత వంటబట్టించిన ఘనత ఇన్ఫోసిస్‌ది.

ఒక చిన్న షెడ్డులో రూ.10000 లోపు పెట్టుబడితో ప్రారంభమై శాఖోపశాఖలుగా విస్తరిస్తూ దశదిశలా వ్యాపించిన ప్రత్యేకత ఇన్ఫోసిస్ సొంతం

ఎన్.ఆర్.నారాయణమూర్తి గారాలపట్టి ఇన్ఫోసిస్.

నీలేకని, శిబులాల్ వంటి ఇతరత్రా సహచరులు, సహవ్యవస్థాపకులు అహర్నిశలూ శ్రమించి... ఇటుక ఇటుకా పేర్చి ఈ ఆకాశ సౌధాన్ని నిర్మించారు. మరి అలాంటి సంస్థ గాడి తప్పుతోందంటే వారికి కచ్చితంగా ఇబ్బందే. ఇది నిజమే అంటారు మూర్తి. కాదు.. అన్నీ అవాస్తవాలే అంటుంది ప్రస్తుత ఇన్ఫోసిస్ బోర్డు.

విచిత్రమేమిటంటే రతన్‌టాటా ఏరికోరి మిస్త్రీని ఎలాగైతే టాటా గ్రూపు పీఠంపై కూర్చోబెట్టారో.. నారాయణమూర్తి కూడా ఇన్ఫోసిస్ పగ్గాలను అప్పగించడంలో విశాల్ సిక్కాకు అంతే ప్రాధాన్యమిచ్చారు. మూర్తి అనంతరం ఒక్కొక్కళ్లుగా సహవ్యవస్థాపకులు ఇన్ఫీ పీఠాన్ని అధిష్ఠిస్తూ వచ్చారు.

ఆతర్వాతే ఇన్ఫీ బయటి వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది.

కంపెనీ సీఈఓ, ఎండీగా ఎక్కడో అమెరికాలో ఉంటున్న విశాల్ సిక్కాను వెదికిపట్టుకుని మరీ బాధ్యతలు అప్పగించారు. సమర్థుడని, ఇన్ఫీని భవిష్యత్ వైపు అడుగులు వేయించగల నాయకుడని కొనియాడిన మూర్తే... ఇప్పుడు సిక్కాను దునుమాడుతున్నారు..!!

కంపెనీ నిర్ణయాలు సహేతుకంగా ఉండట్లేదని.. బోర్డు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు.

వాటాదారుగా తన వాదన వినిపించడంలో తప్పులేదు.

అలాగని బోర్డు తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ భూతద్దంలోంచి చూస్తూ.. ఆ బోర్డునే నమ్మలేని విధంగా ప్రకటనలు ఇస్తూ ఉంటే కంపెనీ పరిస్థితి ఏమవుతుంది...మదుపర్లు, క్లయింట్లకు నమ్మకం ఎలా కలుగుతుంది...?? తద్వారా కంపెనీ పరిస్థితి ఏం కావాలని ప్రశ్నిస్తున్నారు కొందరు విశ్లేషకులు.

అలాగని ఎంతో అనుభవశాలి, నిపుణుడు, సంస్థ వ్యవస్థాపకుడు అయిన మూర్తి మాటలని విస్మరించలేం కదా...?? అన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

ఈ సందర్భంగా ఒక విశ్లేషకుని మాటలోని ఆంతర్యాన్ని పరిశీలిద్దాం..

నారాయణమూర్తి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడే. ఇది ఎవరూ కాదనలేరు. ఆయన అనుంగు పుత్రిక ఇన్ఫోసిస్. దాన్ని ఎంతో అల్లారుముద్దుగా తీర్చిదిద్దారు. ఎంతో అపురూపంగా చూసుకున్నారు. పెంచి పెద్ద చేశారు. ఓ అయ్య చేతిలో పెట్టారు. అక్కడితో ఆయన పని అయిపోయినట్లు కాకపోయినా.. కొంత బాధ్యతైతే తీరింది కదా... ఇక అత్తారింటికెళ్లిన పిల్ల అక్కడి పరిస్థితులకు అలవాటు పడటానికి కొంత వ్యవధి పడుతుంది. ఈలోపు ఎన్నో చిన్నాచితకా ఇబ్బందులు ఎదురవుతూ ఉంటాయి. ఆమాత్రం దానికే గగ్గోలు పెట్టేయలేం కదా...!! అత్తారింట్లో కూతురుకు జలుబుచేస్తే అత్తగారు ముక్కు చీదడం వల్లే అని విరుచుకుపడితే ఎలా...?? అమ్మాయికి పంటినొప్పి వస్తే మావగారు స్వీటు తినడం వల్లే అనడం సబబేనా...?? అది అత్తారిల్లు.. పుట్టింట్లో జరిగినట్లే జరగాలంటే అన్నివేళలా సాధ్యం కాదు. అక్కడి వాతావరణ పరిస్థితులను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.. ఇక్కడ సాగినట్లే అక్కడ సాగదు కదా..!

మూర్తి ఈ విషయాన్ని మర్చిపోయినట్లున్నారు అన్నది ఆ విశ్లేషకుని వాదన.

నిజమే.. ఇన్ఫోసిస్‌ను సృష్టించి.. దాన్ని పెంచి పెద్దచేసిన మూర్తి.. ఆ సంస్థను వదిలిపెట్టినంత మాత్రాన దానిపై మమకారం పోతుందని చెప్పలేం కదా.. కానీ ఇక్కడో విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. సిక్కాను తీసుకొచ్చింది మూర్తే. దాన్ని పురోగమన పథంలో నడిపిస్తాడన్న నమ్మకంతోనే కిరీటాన్ని కట్టబెట్టారాయన. మరి అదే వ్యక్తి మూడేళ్లలోనే నచ్చట్లేదా... ఆయన తీసుకునే నిర్ణయాలకు అనుక్షణం అడ్డుపడుతూ ఉండటం సబబేనా అన్న వాదనలకు ఏం సమాధానం చెప్పగలం.

ప్రవీణ్‌రావుకు వేతన ప్యాకేజీ ఎక్కువ ఇస్తున్నారన్నా... పనయా కొనుగోలు ఇన్ఫోసిస్‌కు లాభసాటిగా లేదన్నా... కొనుగోలు వ్యవహారంలో గోల్‌మాల్ జరిగిందని ఆరోపిస్తున్నా.. అవన్నీ అంతర్గత వ్యవహారాలు.. వీటివల్ల కంపెనీ స్థితిగతుల్లో అనూహ్య మార్పులేవీ వచ్చేయవు అన్నది విశ్లేషకుల మాట. ఒక వ్యక్తిని.. ఒక బోర్డును నమ్మి.. మనం బాధ్యత అప్పగించినప్పుడు వాళ్లను నిర్ణయాలు తీసుకోనివ్వాలి.. అంతేగాని, ప్రతి విషయంలోనూ తలదూర్చకూడదు అన్నది వారు చెబుతున్న విశ్లేషణ.

టాటా-మిస్త్రీ సూత్రం సరిగ్గా ఇక్కడే వర్తిస్తుందనుకోవచ్చు.

కాలానుగుణంగా..

కాలం మారింది. పరిస్థితులు మారాయి. విదేశాలనుంచి తెచ్చుకున్న వ్యక్తి సిక్కా. అప్పటిదాకా ఇన్ఫోసిస్ పగ్గాలు వ్యవస్థాపకుల చేతుల్లోనే ఉండేవి. వాళ్ల వేతనాలు కూడా పరిశ్రమ నిర్ధారించిన ప్రమాణాలకు లోపే ఉండేవి. ఈ పరిస్థితిని మార్చాలనుకున్న వ్యక్తి సిక్కా. కొత్త నైపుణ్యాలను సంస్థలో ప్రవేశపెట్టాలనుకున్నారు. ఇందుకు తగ్గ వేతనాలు చెల్లించాలని భావించారు. తద్వారా పోటీ ప్రపంచంలో ముందుకు దూసుకెళ్లాలన్నది ఆయన అభిమతం కావొచ్చు. అలాగే కంపెనీల కొనుగోలులోనూ దూకుడుగా వ్యవహరించాలనుకున్నారు. ఇన్ఫోసిస్ ఖజానా నిండుకుండలా తొణికిసలాడుతున్నా.. వ్యవస్థాపకులు మాత్రం కంపెనీల కొనుగోళ్లపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కానీ, సిక్కా అటువైపు అడుగులు వేశారు. అంటే పూర్తిగా వ్యవస్థాపకుల దృక్కోణానికి భిన్నంగా బయట ప్రపంచాన్ని చూడటం మొదలుపెట్టారు సిక్కా. బహుశా ఇవేవీ ప్రమోటర్లకు రుచించి ఉండకపోవచ్చు. ఈ లుకలుకలు అందుకేనేమో అంటున్నారు నిపుణులు.

మరో కోణంలో ఆలోచించినప్పుడు మూర్తి మాటలను కూడా తేలిగ్గా తీసిపారేయలేం. ఎంతో అనుభవశాలి అయిన మూర్తి ఊరికే ఆరోపణలు, విమర్శలకు దిగరన్న విషయాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలి.

ఉభయుల వాదనా వాస్తవమే కావొచ్చు. దృష్టిలో పెట్టుకోవాల్సింది కంపెనీ భవిష్యత్తు గురించే. మదుపర్లలో నమ్మకం పెంచడం గురించే. ప్రపంచ దేశాల్లో భారత్ పలుచనైపోకుండా చూడటం గురించే.

త్వరలోనే సమస్యల వలయం నుంచి ఇన్ఫోసిస్ గట్టెక్కి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని ఆశించడం అత్యాశ కాదు కదా...!!

నాలుగు అమెరికా కంపెనీల దర్యాప్తు

ఇన్ఫోసిస్, కంపెనీలోని కొంత మంది అధికారులు, డైరెక్టర్లు అమెరికా స్టాక్ మార్కెట్ చట్టాలను ఉల్లంఘించారా లేదా అన్నదానిపై ఇన్ఫోసిస్ మదుపర్ల తరపున నాలుగు అమెరికా న్యాయ కంపెనీలు దర్యాప్తు చేపట్టాయి. అమెరికాలోనూ ఇన్ఫోసిస్ నమోదైన సంగతి తెలిసిందే. బ్రాన్‌స్టీన్, గెవిట్జ్ అండ్ గ్రాస్‌మాన్; రోసెన్ లా ఫిమ్, పోమెరాంజ్ లా ఫిమ్, గోల్డ్‌బర్గ్ లా పీసీలు ఆ మేరకు దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించాయి. తప్పుదారి పట్టించే వ్యాపార సమాచారాన్ని కంపెనీ ఇచ్చిందన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు రోసెన్ లా ఫిమ్ పేర్కొంది. ఇన్ఫోసిస్ మదుపర్లకు కలిగిన నష్టాలను రాబట్టుకునేందు కోసం ఒక దావా(క్లాస్ ఆక్షన్ లాసూట్)ను సిద్ధం చేస్తున్నట్లు కూడా తెలిపింది.

నా సమస్యంతా బోర్డుతోనే..

సిక్కాతో కాదు: మూర్తి

ముంబయి: విశాల్ సిక్కా రాజీనామా అనంతరం మూర్తి ఓ లేఖ రాశారు. తన సమస్యంతా ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ పాలన గురించి.. దాన్ని నిర్వహిస్తున్న బోర్డు గురించేనని స్పష్టం చేశారు. విశాల్‌తో ఎటువంటి సమస్యా లేదని తెలిపారు. వ్యక్తిగత దూషణలను తట్టుకోలేక రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం సిక్కా పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాలకు మూర్తే కారణమని బోర్డు విమర్శించగా.. అందుకు స్పందనగా మూర్తి లేఖ రాశారు. జులైలో రాసిన లేఖను సైతం దీనికి జత చేశారు. 'సిక్కా సామర్థ్యంపై నేను వ్యాఖ్యానించలేదు. వ్యవస్థాపకులు, తొలి నాళ్లలోని నాయకత్వం నెలకొల్పిన పాలన ప్రమాణాలను పాటించడంలో బోర్డు వైఫల్యంపైనే ప్రశ్నించిన'ట్లు మూర్తి తెలిపారు. 'మీడియాలో వచ్చినట్లు నేను సిక్కాపై అనుమానాలు వ్యక్తం చేయలేదు. అతని వ్యూహాలపై ఎటువంటి వ్యాఖ్యలూ చేయలేదు. మొత్తం తప్పంతా ప్రస్తుత బోర్డుదేనని నేను భావిస్తున్నా'నని ఆయన అన్నారు. '2014లో నేను నిష్క్రమించేంత వరకూ ఇన్ఫోసిస్‌లో పారదర్శకత ఉంది. అందుకు చాలా ఉదాహరణలూ ఉన్నాయి. కొంత మంది ఇన్ఫీ ఉద్యోగుల స్వార్థ ప్రయోజనాల కోసం చెల్లించిన పరిహారాలపై, వేతనాలపై ఆరోపణలు వచ్చినపుడు.. వాటిపై దర్యాప్తు నిర్వహించి ఆ వివరాలను బాహాటంగా చెప్పడానికి కంపెనీ ఎందుకు వెనకడుగు వేసింద'ని మూర్తి ఆ లేఖలో ప్రశ్నించారు. వ్యాపారంలో ఎగుడుదిగుడులు కనిపించినా ఫర్వాలేదు కానీ. . కార్పొరేట్ విలువల విషయంలో అలా జరగకూడదని ఆయన నొక్కి చెప్పారు.

షేర్ల తిరిగి కొనుగోలుకు ఇన్ఫీ బోర్డు ఆమోదం

ఆఫర్ ధర రూ.1150

దిల్లీ: విశాల్ సిక్కా రాజీనామా చేసిన మరుసటి రోజు ఇన్ఫోసిస్ బోర్డు సమావేశం అంతకు మునుపు అనుకున్నట్లుగానే జరిగింది. రూ.13,000 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలు(బైబ్యాక్)కు బోర్డు ఆమోదం తెలిపింది. 11.3 కోట్ల షేర్లను రూ.1150 ధర వద్ద వాటాదార్ల నుంచి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ముగింపు ధర రూ.923.10తో పోలిస్తే కంపెనీ ఆఫర్ చేసిన ధర 25 శాతం ఎక్కువ కావడం గమనార్హం. కంపెనీ చరిత్రలో ఇదే తొలి బైబ్యాక్ కాగా.. ఈ ఏడాదిలో ఇది రెండోది. ఏప్రిల్‌లో టీసీఎస్ రూ.16,000 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలును ప్రకటించింది. ప్రస్తుతం ఇన్ఫోసిస్ ప్రకటించిన బైబ్యాక్ పరిమాణం కంపెనీ చెల్లించిన మూలధనంలో 4.9 శాతానికి సమానం.



ఆ స్థానం ఇక ప్రవీణ్ రావుదేనా!

ఈనాడు - హైదరాబాద్

విశాల్ సిక్కా అనూహ్య రాజీనామా దేశీయ సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ఈ బాధ్యతలను తాత్కాలికంగా యు.బి.ప్రవీణ్ రావుకు ఇన్ఫోసిస్ బోర్డు అప్పగించినప్పటికీ.. కంపెనీలో కీలక నిర్ణయాలు తీసుకోవడానికి, మార్గనిర్దేశనం, వ్యూహ రచన చేయడానికి శాశ్వత ఎండీ, సీఈఓ కీలకం. ఈ నేపథ్యంలో శ్వాశత ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా ఎవర్ని నియమించగలన్న అంశం పరిశ్రమలో ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకూ కంపెనీ పగ్గాలు చేపట్టిన సీఈఓల్లో సిక్కా మాత్రమే వ్యవస్థాపకేతర సీఈఓ. భావజాల పరమైన విభేదాలతో ఆయన రాజీనామా చేయాల్సిన పరిస్థితులు వచ్చాయని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇటువంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా.. కొత్త డిజిటల్ టెక్నాలజీలకు అనుగుణంగా కంపెనీని నడిపిస్తూ.. కంపెనీ సంస్కృతి, విలువలకు అనుగుణంగా కంపెనీకి సారథ్యం వహించే వ్యక్తి కోసం ఇన్ఫోసిస్‌కు చెందిన నామినేషన్లు, రెమ్యునరేషన్ల కమిటీ అన్వేషించే వీలుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

అన్ని విధాలా తగిన వ్యక్తి: సిక్కా పూర్తిగా భిన్నమైన వాతావరణం నుంచి వచ్చారు. ఆయన అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల అభివృద్ధి కంపెనీ ఎస్ఏపీలో పని చేశారు. ఒక వ్యవస్థాపకేతర వ్యక్తిని సీఈఓగా నియమించి అప్పట్లో ఇన్ఫోసిస్ ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బయట వ్యక్తులకు బదులు, కంపెనీలో అంతర్గతంగా ఉన్న వ్యక్తులనే పరిశీలించవచ్చని, తాత్కాలికంగా ఈ బాధ్యతలను చేపట్టిన ప్రవీణ్ రావుతోపాటు, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ప్రెసిడెంట్ల స్థాయిలోని 4-5 మందిని పరిశీలించవచ్చని తెలుస్తోంది. అందరి కంటే అన్ని విధాలా అనువైన వ్యక్తి ప్రవీణ్ రావే అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇప్పటి వరకూ ఆయన ఇన్ఫోసిస్ బీపీఓకు ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. గ్లోబల్ అమ్మకాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నందున కంపెనీ ఖాతాదారులతో ఎలా వ్యవహరించాలన్న దానిపైన కూడా ఆయనకు మంచి అవగాహన ఉంది. శాశ్వత ఎండీ, సీఈఓ నియామకానికి కంపెనీలోని వారితోపాటు బయట వారిని కూడా కమిటీ పరిశీలించవచ్చని, అయితే.. కంపెనీలోని వారికే ప్రాధాన్యం ఇవ్వవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శాశ్వత సీఈఓ నియామక ప్రక్రియ 3-4 నెలల్లో పూర్తి కావచ్చని చెబుతున్నారు. ఇన్ఫోసిస్ పగ్గాలు చేపట్టడానికి నందన్ నిలేకనికి అవకాశాలు రాకపోవచ్చంటున్నారు. నిర్వహణ సామర్థ్యాలతోపాటు అందరితో కలిసిపోయే, అందుబాటులో ఉండే స్వభావం, అపార అనుభవం ప్రవీణ్‌రావుకు ఉన్నాయని, అతనికే ప్రాధాన్యం ఇచ్చేవీలుందంటున్నారు. శాశ్వత సీఈఓ వచ్చేంత వరకూ కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా పెద్ద కంపెనీలో అన్ని కార్యకలాపాలను ఇతర నాయకత్వ బృందం చూసుకోగలదని, వ్యాపార కార్యకలాపాలను ఎటువంటి ఆటకం కలగదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఇతర నాయకత్వ బృందంతోపాటు కంపెనీ బోర్డు క్రియాశీలకంగా పని చేస్తుందంటున్నారు.

సింగరేణి లాభం రూ.395 కోట్లు

ఈనాడు, హైదరాబాద్ : గత ఆర్థిక సంవత్సరం(2016-17)లో సింగరేణి సంస్థకు రూ.395.38 కోట్ల లాభాలొచ్చాయి. సంస్థ పాలకమండలి సమావేశం శనివారం ప్రధాన కార్యాలయంలో జరిగింది. గతేడాది మొత్తం రూ.17,853 కోట్ల టర్నోవర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.6,056 కోట్లను పన్నులుగా చెల్లించింది. ఇందులో కేంద్రానికి రూ.2,888 కోట్లు, రాష్ట్రానికి రూ.3,168 కోట్లు చెల్లించింది. పన్నుల చెల్లింపు అనంతరం నికరలాభం రూ.395.38 కోట్లు వచ్చినట్లు పాలకమండలి తెలిపింది. కొత్త గనుల తవ్వకాలకు సంబంధించిన ఆర్థిక అంచనాలను ఆమోదించింది. ఈ సమావేశంలో సీఎండీ శ్రీధర్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ కల్లం, కేంద్ర బొగ్గుశాఖ డైరక్టర్ బింద్రా తదితరులు పాల్గొన్నారు.

ఐవీఆర్‌సీఎల్ ప్రాజెక్టుల విక్రయ ఒప్పందం రద్దు

ఈనాడు, హైదరాబాద్: రహదారుల ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 3 కంపెనీల (స్పెషల్ పర్పస్ వేహికల్) విక్రయం కోసం ఐవీఆర్‌సీఎల్ కుదుర్చుకున్న వాటా కొనుగోలు ఒప్పందాలు రద్దయ్యాయి. తమిళనాడులోని కుమరపాళ్యం టోల్‌వే, సేలం టోల్‌వేస్, ఐవీఆర్‌సీఎల్ చెంగపల్లి టోల్‌వేస్‌లను విక్రయించడానికి చాలా కాలం క్రితం టీఆర్ఐఎల్ రోడ్స్‌తో ఐవీఆర్‌సీఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. వాటా కొనుగోలు ఒప్పందాల ప్రకారం కొన్ని నిబంధనలను పాటించడంలో జాప్యం జరిగినందున ఒప్పందాలు రద్దయినట్లు ఐవీఆర్‌సీఎల్ వెల్లడించింది. ఈ టోల్‌వే ప్రాజెక్టుల్లో వాటాను విక్రయించడానికి ఇతర ఐచ్ఛికాలను కంపెనీ పరిశీలిస్తోంది. రుణ భారాన్ని తగ్గించుకునే కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్టుల్లో వాటాను విక్రయించాలని గతంలో ఐవీఆర్‌సీఎల్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుల విక్రయానికి ఇతర మదుపర్లతో కంపెనీలు చర్చలు చేపట్టే వీలుంది.

దివాలా చట్టంతో కంపెనీలకు మేలే

- కొత్త రుణాల సంస్కృతి వస్తుంది
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ముంబయి: రుణాల ఊబిలో కూరుకుపోయిన కంపెనీలకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హామీ ఇచ్చారు. కొత్తగా ప్రవేశపెట్టిన దివాలా చట్టం ఉద్దేశం కంపెనీల మూసివేత కాదని.. ఇచ్చిన రుణాలను తిరిగి రాబట్టుకోవడంతో పాటు వాటిని కాపాడేందుకేనని తెలిపారు. 'దివాలా'పై పరిశ్రమ సంఘం సీఐఐ నిర్వహించిన సదస్సుకు ఆయన నేతృత్వం వహించారు. 'పాత విధానం ప్రకారం అప్పులు ఇచ్చిన వాళ్లు .. తీసుకున్న వారి వెంట పడేవారు. చివరకు ఏమీ వసూలయ్యేది కాదు. రుణాలు తీసుకున్న వారు నిలిచి ఉండాలంటే.. వారు రుణం చెల్లించకతప్పదు. లేదా వారు మరొకరికి మార్గం ఇవ్వాల్సి ఉంటుంది' అని జైట్లీ అన్నారు. రుణాల తీసుకున్న వారికి బుద్ధి చెప్పడం ద్వారా కొత్త రుణాల సంస్కృతి అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'దివాలా చట్టం అసలు లక్ష్యం బకాయిదార్ల ఆస్తుల విక్రయం కాదు. వారి వ్యాపారాలను రక్షించడమే. ప్రస్తుత ప్రమోటర్లు స్థానంలో కొత్త వ్యాపారవేత్తలు లేదా భాగస్వాములు రావడం ద్వారా వారి ఆస్తులు సురక్షితంగా ఉంటాయి' అని జైట్లీ అన్నారు. కొత్త చట్టం రుణదాతల పక్షాన నిలుస్తుందని, ప్రస్తుత చట్టాల్లో కొన్ని మార్పుల ద్వారా ఎన్‌పీఏల పరిష్కారం వేగవంతం కానుందని జైట్లీ వివరించారు. తాము కేవలం ఒక్క దివాలా చట్టాన్నే మార్చలేదని, రుణ రికవరీ ట్రైబ్యునళ్ల (డీఆర్‌టీల) విధానాలు, ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీల కోసం సర్ఫేసీ చట్టంలో మార్పులు చేశామని జైట్లీ అన్నారు.

బ్యాంకులకు కొత్త మూలధనం!.. ఉర్జిత్ పటేల్: ప్రభుత్వ రంగ బ్యాంకులకు త్వరలోనే కొత్త మూలధన ప్యాకేజీ ప్రకటించనున్నట్లు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ తెలిపారు. మొండి బకాయిల కారణంగా అధిక కేటాయింపులతో ఇబ్బందులు పడుతున్న బ్యాంకులకు ఇది ఉపశమనం కలిగించే అంశమని అన్నారు. ఆర్థిక వ్యవస్థలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) ప్రమాదకర స్థాయి మించి ఉన్నాయని, మార్చి ముగిసేనాటికి స్థూల ఎన్‌పీఏలు 9.6 శాతంగా, ఒత్తిడి ఉన్న ఆస్తుల నిష్పత్తి 12 శాతంగా నమోదు కావడంతో హామీపై ఇచ్చే రుణం విలువ భారీగా తగ్గించాల్సి ఉంటుందని బ్యాంకులకు ఉర్జిత్ సూచించారు. స్థూల ఎన్‌పీఏల్లో 86.5 శాతం భారీ రుణాలు తీసుకున్నవారికి చెందినవేనని వెల్లడించారు.

జీఎస్‌టీ రిటర్న్‌ల గడువు 25 దాకా

దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) కింద రిటర్న్‌ల దాఖలు, పన్నుల చెల్లింపునకు గడువును ఈ నెల 25 దాకా ప్రభుత్వం పొడిగించింది. వ్యాపారుల నుంచి వచ్చిన రద్దీ కారణంగా జీఎస్‌టీఎన్ పోర్టల్ సాంకేతిక సమస్యలు ఎదుర్కోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి రిటర్న్‌ల దాఖలు గడువు నేటితో ముగియనున్న విషయం తెలిసిందే.

గమనిక: జీఎస్‌టీపై చార్టర్డ్ అకౌంటెంట్ సతీష్ సరాఫ్ వ్యాసం మంగళవారం నాటి సంచికలో..

కోడి గుడ్లు

19వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
20న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

'వాకపల్లి' విచారణపై నిర్ణయానికి ఇంకెన్నేళ్లో!

ఫిర్యాదుకు నేటితో దశాబ్దం పూర్తి

ఈనాడు, అమరావతి: వాకపల్లి గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం చేశారన్న ఫిర్యాదుపై కేసు నమోదై దశాబ్దం గడుస్తున్నా... ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ కొనసాగించాలా? వద్దా? అనే అంశం మాత్రం ఇప్పటికీ కొలిక్కిరావడం లేదు. 2012 ఏప్రిల్‌లో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 13 మంది సుప్రీం కోర్టుకు అప్పీలుకు వెళ్లి తీర్పుపై తాత్కాలిక స్టే ఆదేశాలు తెచ్చుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ వారిపై విచారణ కొనసాగించాలా? వద్దా? అనే అంశానికి సంబంధించి విచారణ అత్యున్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంది. ఈ ఘటన జరిగి ఆదివారంతో పదేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో ఆ గిరిజన మహిళలు చేస్తున్న న్యాయపోరాటానికి మద్దతు కూడగట్టేందుకు మానహక్కుల వేదిక విశాఖపట్నంలో ఆదివారం సదస్సు నిర్వహిస్తోంది.

యువరాజులకు గోరఖ్‌పూర్ విహారస్థలమా!

రాహుల్, అఖిలేశ్‌లపై యోగి విసుర్లు

గోరఖ్‌పూర్: ఒకరు దిల్లీలో.. మరొకరు లఖ్‌నవూలో కూర్చునే యువరాజులు గోరఖ్‌పూర్‌ను విహారస్థలం(పిక్‌నిక్ స్పాట్)గా మార్చాలని చూస్తే అనుమతించబోమని - రాహుల్, అఖిలేశ్‌లను ఉద్దేశించి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ధ్వజమెత్తారు. గోరఖ్‌పూర్‌లోని ఒక ఆసుపత్రిలో ఇటీవల 71మంది పిల్లలు మృతి చెందిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన పర్యటనకు కొద్ది గంటల ముందు ఒక కార్యక్రమంలో పాల్గొన్న యోగి పలు విమర్శలు చేశారు. ఆ యువరాజులు (రాహుల్, అఖిలేశ్) స్వచ్ఛత ఉద్యమ ప్రాధాన్యాన్ని తెలుసుకోలేరని.. విహారస్థలంగా మార్చేందుకే ఇక్కడకు వస్తున్నారని విమర్శించారు.

ప్రభుత్వం నింపిన విషాదమిది: రాహుల్

గోరఖ్‌పూర్‌లో పిల్లలు ప్రాణాలు కోల్పోవడాన్ని 'ప్రభుత్వం నింపిన విషాదం'గా రాహుల్ గాంధీ విమర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యోగి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

వందే 'ఈ'తరం!

● ఈ-లావాదేవీల్లో తెలుగురాష్ట్రాల ముందంజ ● 'ఈ-తాల్' పరిశీలనలో వెల్లడి

ఈ-పరుగులో తెలుగు రాష్ట్రాలు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. కేంద్రం నిర్వహిస్తున్న 'ఎలక్ట్రానిక్ లావాదేవీల గణాంక, విశ్లేషణ సంస్థ' (ఈ-తాల్) పరిశీలనలో ఇది స్పష్టమైంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 'ఈ-లావాదేవీల' సంఖ్య 1073.40 కోట్లు. 'ఈ-పాలన' సంస్కరణలను అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి.



ఈనాడు - అమరావతి

ఈ-పాలన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సేవలను ప్రజలు ఎలా ఉపయోగించుకుంటున్నారు? ఎలక్ట్రానిక్ లావాదేవీల సరళి ఎలా ఉందనే అంశాలను 'ఈ-తాల్' సంస్థ నిత్యం మదింపు చేస్తుంది. కేంద్రం అమలుచేస్తున్న 31 మిషన్ మోడ్ పథకాలు(ఎంఎంపీ), 21 మంత్రిత్వ శాఖలు అందించే 2267 ఈ-సేవలు, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అందిస్తున్న ఈ-సేవలను ఈ సంస్థ పరిశీలిస్తోంది. వీటన్నింటినీ తన కోర్ డ్యాష్‌బోర్డుకు అనుసంధానిస్తూ పర్యవేక్షిస్తుంది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. రోజుకు ప్రస్తుతం సగటున దేశవ్యాప్తంగా 4.65 కోట్ల ఈ-లావాదేవీలను నిర్వహిస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లోనే 200 సేవలు

ఈ-పాలన ద్వారా 200 రకాలకు పైగా సేవలను అందిస్తున్నవి దేశంలో కేవలం తెలుగు రాష్ట్రాలే కావడం విశేషం. తెలంగాణ తన పౌరులకు 224 రకాల సేవలను అందిస్తుంటే, ఆంధ్రప్రదేశ్ 204 రకాల సేవలను కల్పిస్తోంది. జనన మరణ ధ్రువీకరణ, పన్నుల చెల్లింపు, డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, ఇలా పలు రకాల ఈ-సేవలను 'మీసేవ', 'మీ కోసం' కేంద్రాల ద్వారా అందిస్తున్నాయి. వీటితోపాటు వివిధ శాఖలు వివిధ రకాల ఈగవర్నెన్స్ సేవలను అందిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లోనూ ప్రజలు 61 కోట్లకుపైగా ఈ-లావాదేవీలను నిర్వహించారు. ఏపీలో 32.55 కోట్లు, తెలంగాణలో 29.02 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ప్రజలకు వందకు పైగా ఈ-గవర్నెన్స్ సేవలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువగానే ఉన్నాయి. ఈ జాబితాలో పశ్చిమబెంగాల్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, కేరళ, గుజరాత్ ఉన్నాయి. గుజరాత్ ప్రభుత్వం 146 రకాల సేవలే కల్పిస్తున్నప్పటికీ అక్కడ ఈ లావాదేవీలు నిర్వహిస్తున్న వారు ఎక్కువగానే ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో 38.87 కోట్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలను నిర్వహించారు. వేయి మంది జనాభాకు ఏపీలో ఈ ఏడాదికి సగటున 6,564 లావాదేవీలు, తెలంగాణలో ఇదే జనాభాకు 8,220 లావాదేవీలు జరిగాయి.

బ్యాంకింగ్ సేవలు తక్కువే

పౌరులు తమ వ్యక్తిగతంగా ఎక్కువగా ఈ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకుంటున్నప్పటికీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పోర్టళ్ల ద్వారా ఈ సేవలను వినియోగించుకుంటున్న వారి సంఖ్య ఆశాజనకంగా లేదు. దేశంలో ఈ ఏడాది ఇలా ప్రభుత్వ ఈ-గవర్నెన్స్ సేవల సైట్ల ద్వారా 4.02 కోట్ల బ్యాంకింగ్ లావాదేవీలు మాత్రమే జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇలా 8.49 లక్షల లావాదేవీలు, తెలంగాణలో 2.03లక్షల లావాదేవీలు జరిగాయి. ఈ విషయంలో మాత్రం మధ్యప్రదేశ్ ముందంజలో ఉంది. అక్కడ ప్రజలు ప్రభుత్వ ఈ-సేవల పోర్టళ్ల ద్వారా 2.80 కోట్ల లావాదేవీలను నిర్వహించారు. కొన్ని ఈశాన్యరాష్ట్రాలు, మరికొన్ని రాష్ట్రాల్లో అయితే ఈ తరహా లావాదేవీలు అసలు నమోదు కాలేదు.

దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు కల్పిస్తున్న సేవలకు సంబంధించి ప్రజలు రోజువారీ నిర్వహిస్తున్న ఎలక్ట్రానిక్ లావాదేవీలు

సంవత్సరం	మొత్తం ఈ-లావాదేవీలు (కోట్లు)	రోజుకు సగటు లావాదేవీలు
2013	241.76	64.68 లక్షలు
2014	357.70	96.42 లక్షలు
2015	760.75	2.06 కోట్లు
2016	1089.80	2.96 కోట్లు
2017 (ఇప్పటివరకు)	1073.42	4.65 కోట్లు

తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది ఇప్పటివరకు ప్రజలు ప్రభుత్వాల ఈ-గవర్నెన్స్ సేవల ద్వారా నిర్వహించిన ఈ లావాదేవీలు

ఆంధ్రప్రదేశ్	32,55,03,807
తెలంగాణ	29,02,25,209

మదింపు ఇలా..

'ఈ-గవర్నెన్స్' సేవలు, వాటి ద్వారా ప్రజల ఈ-లావాదేవీలను ఆరు వర్గాలుగా విభజించి మదింపు చేస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆయా విభాగాల్లో తెలుగు రాష్ట్రాలు పెద్దఎత్తున ఈ-లావాదేవీలు నిర్వహించాయి.

ఏ కేటగిరి: కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలు, పన్నుల చెల్లింపులు తదితర లావాదేవీలు
ఆంధ్రప్రదేశ్ : 22.07 కోట్లు
తెలంగాణ : 16.53 కోట్లు

బీ కేటగిరి: బిల్లుల చెల్లింపులు. టెలిఫోన్, విద్యుత్తు, నీటి బిల్లులు. పురపాలక సంఘాలకు చెల్లించాల్సిన వివిధ పన్నులు
ఆంధ్రప్రదేశ్ : 1.79 కోట్లు
తెలంగాణ :-1.17 కోట్లు

సి కేటగిరి: బ్యాంకింగ్ కార్యకలాపాలు, మొబైల్/డీటీహెచ్ రీఛార్జీల చెల్లింపులు
ఆంధ్రప్రదేశ్ : 8.49 లక్షలు
తెలంగాణ : 2.03 లక్షలు

డి కేటగిరి: ప్రభుత్వాల వెబ్‌సైట్ల సమాచారం, టెండరు, ఫారాల డౌన్‌లోడ్, పాస్‌పోర్టు, రైల్వే పీఎన్ఆర్ తదితరాల విచారణ సేవలు నిర్వహించినవారు
ఆంధ్రప్రదేశ్ : 16.95 లక్షలు
తెలంగాణ : 48.49 లక్షలు

ఇ కేటగిరి: సామాజిక పింఛన్లు, నరేగా చెల్లింపులు
ఆంధ్రప్రదేశ్ : 4.63 కోట్లు
తెలంగాణ : 7.40 కోట్లు

ఎఫ్ కేటగిరి: మొబైల్ గవర్నెన్స్ సేవలు ఆంధ్రప్రదేశ్ : 3.16 కోట్లు, తెలంగాణ : 3.40 కోట్లు



గ్రహణం చూసే పద్ధతిపై అవగాహన పొందుతున్న కన్సాస్ సిటీలోని విద్యార్థులు

ఉద్యోగులకు సెలవు.. విమాన టిక్కెట్లు కరవు

● ఒరెగాన్ చేరే రహదారుల్లో కిమీ మేర నిలిచిన వాహనాలు

వాషింగ్టన్: ఆగస్టు 21న ఏర్పడబోతున్న సూర్యగ్రహణాన్ని వీక్షించడానికి అమెరికావాసులంతా ఉద్విగ్నంగా ఎదురు చూస్తున్నారు. దాదాపు 99 ఏళ్ల తరువాత ఒక తీరంలో ప్రారంభమై మరో తీరంలో పూర్తి అవుతున్న సంపూర్ణ సూర్యగ్రహణాన్ని వీక్షించడానికి అగ్రరాజ్యంలో విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమెరికాలోని 14 రాష్ట్రాల మీదుగా 70 కిమీ వెడల్పు ప్రాంతాన్ని పూర్తిగా చీకటిమయం చేయనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో పాక్షిక ప్రభావం కనిపిస్తుంది. ఒరెగాన్ తీరం నుంచి ప్రారంభమయ్యే సూర్యగ్రహణం దక్షిణ కరోలినా తీరం వద్ద రెండున్నర గంటల తరువాత ముగుస్తుంది. ఇంతకుముందు జూన్ 8, 1918లో ఈ స్థాయిలో సూర్యగ్రహణం ఏర్పడింది. మళ్లీ ఏప్రిల్ 2024లో 12 రాష్ట్రాల మీదుగా, ఆగస్టు 2045లో పది రాష్ట్రాలమీదుగా ఏర్పడనుంది.

15 మైళ్ల పొడవునా ట్రాఫిక్ జామ్: గ్రహణాన్ని వీలైనంత దగ్గరగా వీక్షించడానికి 14 రాష్ట్రాల్లోని పర్యాటక ప్రాంతాలకు ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. ముఖ్యంగా ఒరెగాన్‌కు జనాలు పోటెత్తుతున్నారు. ఆగస్టు 17న ఒరెగాన్‌లోని ప్రైన్‌విలేకు సమీపాన రహదారిపై 15 మైళ్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించింది.

విమానం టిక్కెట్టు రూ.6,41,000

ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా ప్రాంతం వరకు ఉన్న విమానాశ్రయాల్లో విమానాన్ని నిలపడానికి కూడా ప్రస్తుతం ఖాళీ లేదు. టిక్కెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మిలియన్ ఎయిర్ అనే ప్రైవేటు కంపెనీ ఒక్కో టిక్కెట్‌కు రూ.6,41,000 వసూలు చేస్తోంది.



దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వస్తున్న జస్టిస్ ఎస్వీ భట్ దంపతులు

శ్రీవారి సేవలో జస్టిస్ ఎస్వీ భట్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ఉభయ తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ భట్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. న్యాయమూర్తికి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.దుర్గారావు స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు.

న్యాయస్థానాలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయి: జైట్లీ

ముంబయి: పార్లమెంటు రూపొందించిన చట్టాల్లోని నిర్దేశిత కాలపరిమితులను అనుసరించడంలో దేశంలోని న్యాయస్థానాలు ' 'ద్వంద్వ ప్రమాణాలు" అనుసరిస్తున్నాయంటూ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించారు. పరిశ్రమల దివాలాపై కార్పొరేట్ వ్యవహారాల శాఖ శనివారమిక్కడ ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "కాలపరిమితులను శాసన వ్యవస్థకు నిర్దేశిస్తే వారు (కోర్టులు) తప్పకుండా పాటించేలా చూస్తారు. అదే పరిమితులు న్యాయ సంస్థలకు విధిస్తే.. ఇవి కేవలం సూచన ప్రాయమేనని చెబుతారు'అని ఆయన వ్యాఖ్యానించారు. తను న్యాయ శాఖ మంత్రిగా పనిచేసినప్పటి పరిస్థితులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. "సివిల్ ప్రొసీజర్ కోడ్ (సీపీసీ)కి ఆనాడు మేం సవరణ తీసుకొచ్చాం. కఠినమైన కాలపరిమితులు విధించాం. వెంటనే సుప్రీం కోర్టు స్పందించింది. తమ కాలపరిమితులు తామే నిర్దేశించుకుంటామని చెప్పింది. పార్లమెంటు నిర్దేశించిన కాలపరిమితులు కేవలం సూచన ప్రాయమేనని.. తాము (కోర్టులు) తప్పనిసరిగా వాటిని అనుసరించాల్సిన పనిలేదని వ్యాఖ్యానించింది'అని జైట్లీ చెప్పారు. బ్యాంకుల నిరర్థక ఆస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపడమే లక్ష్యంగా తీసుకొచ్చిన దివాలా చట్టానికీ ఈ గతి పట్టకూడదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దివాలా చట్టం కింద దాఖలైన కేసులను జాతీయ కంపెనీ చట్టాల ట్రైబ్యునళ్లు (ఎన్‌సీఎల్‌టీ) 180 రోజుల్లోగా పరిష్కరించాలని కాలపరిమితి నిర్దేశించిన సంగతి తెలిసిందే.

ఏటా ప్రమాదం.. అంతులేని విషాదం..

దిల్లీ: ఆధునికీకరణ వైపు ఎంతగా అడుగులు వేస్తున్నా రైలు ప్రమాదాలు ఆగడం లేదు. కారణాలు ఏవైనా రైళ్లు పట్టాలు తప్పుతునే ఉన్నాయి. దాదాపుగా ప్రతి ఏటా ఓ భారీ ప్రమాదం సంభవిస్తూ విషాదాన్ని మిగులుస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఖతౌలీ వద్ద పూరీ-హరిద్వార్ కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం ప్రమాదానికి గురై 23 మంది మరణించిన నేపథ్యంలో గతంలో జరిగిన ప్రమాదాలను ఒక్కసారి గుర్తు చేసుకుంటే...

2017 జనవరి 21: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కూనేరు వద్ద జగదల్‌పూర్- భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఇంజను, తొమ్మిది బోగీలు పట్టాలు తప్పడంతో 39 మంది మృతి.

2016 డిసెంబరు 28: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ సమీపంలో సేల్దా- అజ్మీర్ ఎక్స్‌ప్రెస్ 15 బోగీలు పట్టాలు తప్పడంతో 62 మందికి గాయాలు.

2016 నవంబరు 20: కాన్పూర్ సమీపంలో ఇండోర్- పట్నా ఎక్స్‌ప్రెస్ 14 బోగీలు పట్టాలు తప్పడంతో 100 మంది ప్రయాణికుల మృతి.

2011 జులై 10: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మాల్వా వద్ద దిల్లీ వెళ్తున్న కాల్కా మెయిల్ 15 బోగీలు పట్టాలు తప్పడంతో 70 మంది మృతి.

2010 మే 28: పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో నక్సలైట్ల విద్రోహం కారణంగా జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 148 మంది దుర్మరణం.

2002 సెప్టెంబరు 9: హవడా నుంచి దిల్లీ వెళ్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో ధావే నదిలో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయిన 100 మంది ప్రయాణికులు.

1999 ఆగస్టు 2: అసోంలోని గైసాల్‌లో రెండు రైళ్లు ఢీకొనడంతో 290 మంది మృతి.

1998 నవంబరు 26: పంజాబ్‌లోని ఖన్నాలో అప్పటికే పట్టాలు తప్పిన ఫ్రాంటియర్ మెయిల్ బోగీలను జమ్ముతావి-సేల్దా ఎక్స్‌ప్రెస్ ఢీ కొనడంతో 212 మంది దుర్మరణం

1997 సెప్టెంబరు 14: బిలాస్‌పూర్ వద్ద అహ్మదాబాద్- హవ్‌డా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన అయిదు బోగీలు నదిలో పడిపోవడంతో 81 మంది ప్రయాణికుల మృత్యువాత.

1995 ఆగస్టు 20: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ స్టేషన్ వద్ద పురుషోత్తం, కాళింది ఎక్స్‌ప్రెస్‌లు ఢీకొనడంతో 400 మంది కన్నుమూత.

1993 సెప్టెంబరు 21: రాజస్థాన్‌లోని ఛబ్రాలో కోటా-బినా ప్యాసింజర్ రైలు, గూడ్సు రైలు ఢీకొనడంతో 71 మంది మృతి.

1990 జూన్ 25: బిహార్‌లోని దౌల్తాగంజ్‌లో ప్యాసింజర్ రైలును గూడ్సు రైలు ఢీకొనడంతో 60 మంది మరణం.

1990 ఏప్రిల్ 16: పట్నాలో రైలుకు నిప్పంటుకోవడంతో 70 మంది సజీవ దహనం.

1988 జులై 8: కేరళలోని అష్టముడి సరస్సులో ఇలాండ్ ఎక్స్‌ప్రెస్ దూసుకుపోవడంతో 75 మంది దుర్మరణం.

1988 ఏప్రిల్ 18: ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలిత్‌పూర్ వద్ద కర్ణాటక ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో 75 మంది మృతి.

ఇంజినీరింగ్ విద్యార్థుల మధ్య ఘర్షణ

ఒకరికి కత్తిపోట్లు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వేర్వేరు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు మధ్య తలెత్తిన ఘర్షణలో ఓ విద్యార్థి కత్తిపోట్లకు గురయ్యాడు. తెనాలి-విజయవాడ రోడ్డులో సోమసుందరపాలెం-తేలప్రోలు దారిలో శనివారం రాత్రి 10 గంటల సమయంలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరారు. ఒక కళాశాల నుంచి సుమారు 25 మంది, మరో కళాశాల నుంచి దాదాపు 10 మంది అక్కడకు వచ్చారు. ఇరు వర్గాల మధ్య తొలుత వాదులాట మొదలై క్రమేణా ఘర్షణకు దారి తీసింది. ఘటనలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న తెనాలికి చెందిన రవిశంకర్ అనే విద్యార్థి కత్తిపోట్లకు గురయ్యాడు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. దానితో ఒక కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు పారిపోయారు. బాధితుడి కళాశాలకు చెందిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన విద్యార్థిని తొలుత తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు తెనాలి రూరల్ సీఐ చిన మల్లయ్య తెలిపారు. అసలు ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఆ ప్రాంతానికి ఎందుకు చేరుకున్నారు, ఈ గొడవల వెనుక కారణాలు ఏమిటన్న విషయాలు విచారణలో తేలనున్నాయన్నారు.

అమ్మాయీ.. అందుకో

ఈనాడు - హైదరాబాద్

ఇప్పటివరకు మహిళలకు ప్రవేశాలు లేని కోర్సులు, విద్యాసంస్థల్లో వారికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. తాజాగా సైనిక పాఠశాలల్లో బాలికల ప్రవేశాలకు ఆమోదం లభించింది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లోనూ వారి సంఖ్యను పెంచేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఏ రంగంలోనైనా పురుషులకు మహిళలు తీసిపోరని నిరూపిస్తున్న నేపథ్యంలో కొన్ని ప్రత్యేకమైన కోర్సుల్లో, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతున్నాయి. ఇప్పటివరకూ మైనింగ్ ఇంజినీరింగ్, మైనింగ్ మెషినరీ ఇంజినీరింగ్ కోర్సుల్లో అమ్మాయిలకు ప్రవేశం లేదు. ఐఐటీల్లో సీట్ల భర్తీ సమయంలో 2015-16 విద్యాసంవత్సరం వరకు ఉన్న నిబంధన ఇది. గత ఏడాదే దీన్ని తొలగించారు. దీంతో ధన్‌బాద్, ఖరగ్‌పూర్, బీహెచ్‌యూ ఐఐటీల్లో 347 మైనింగ్ సీట్లలో చేరేందుకు అమ్మాయిలకు అవకాశం లభించింది. కొన్ని సంస్థల్లో ప్రవేశాలు మొదలయ్యాయి. జేఎన్‌టీయూహెచ్‌కు చెందిన మంథని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మార్కండేయ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనింగ్ కోర్సుల్లో అమ్మాయిలకు 2013 నుంచే ప్రవేశాలు కల్పిస్తున్నామని చెప్పారు. అయితే ఈ కోర్సులపై అవగాహన లోపించడంతో తక్కువ మంది బాలికలు చేరుతున్నారని తెలిపారు. తమ కళాశాలలో అమ్మాయిలకు 10 సీట్లుండగా నలుగురు లేదా అయిదుగురు మాత్రమే చేరుతున్నారని చెప్పారు.

ఇప్పటివరకు బాలురకే..

దేశంలోని 22 రాష్ట్రాల్లో 26 సైనిక పాఠశాలలున్నాయి. సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికతో నాణ్యమైన విద్య అందుతుండటంతో వాటిల్లో సీట్ల కోసం భారీ పోటీ ఉంటోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోరుకొండ, చిత్తూరు జిల్లాలోని కలికిరిలలో సైనిక పాఠశాలలున్నాయి. తెలంగాణలో కూడా సైనిక పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర రక్షణశాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ సమీపంలో దాన్ని నెలకొల్పాలని నిర్ణయించింది. ఇప్పటివరకు ఈ పాఠశాలల్లో కేవలం బాలురకే ప్రవేశం ఉండేది. తాజాగా బాలికలకు కూడా ప్రవేశం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది అమలయ్యే అవకాశం ఉంది. తమ రాష్ట్రాల్లో కూడా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. మరో 25 పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయి. ఈ పాఠశాలల్లో చదివిన వారు తర్వాత యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నావల్ అకాడమీ (ఎన్ఏ) పరీక్షలు రాసి రక్షణ దళ విభాగాల్లోకి ప్రవేశించవచ్చు.

ఐఐటీల్లో..

ప్రస్తుతం ఐఐటీల్లో బాలికల శాతం కేవలం 8 నుంచి 14 మాత్రమే. ఇంజినీరింగ్‌లోకి అమ్మాయిలు ఎక్కువ సంఖ్యలో ప్రవేశిస్తే అది దేశ పురోభివృద్ధికి ఊతమిస్తుందని నిపుణులు అభిప్రాయం. అందుకే ఐఐటీల్లో 20 శాతం మహిళలు ఉండేలా సూపర్ న్యూమరీ సీట్లను కేటాయించాలని ఇప్పటికే కేంద్ర మానవ వనరుల శాఖ ఐఐటీలను ఆదేశించింది. వచ్చే సంవత్సరం నుంచి అది అమలు కానుంది.



ఐఐఎంలలో పెరుగుతున్న మహిళల శాతం

వివిధ కోర్సుల్లో బాలికలకు 33.33 శాతం సీట్లు ప్రత్యేకంగా రిజర్వు చేస్తుంటారు. అది ఐఐటీలు, ఐఐఎంలకు వర్తించదు. అమ్మాయిలైనా ప్రతిభ ఆధారంగానే సీట్లు దక్కించుకోవాలి. ఇప్పటివరకు ఐఐఎంల్లో 25 శాతం అమ్మాయిలు మాత్రమే సీట్లు పొందుతున్నారు. ఐఐఎం అహ్మదాబాద్‌లో గత ఏడాది అది 27 శాతం ఉండగా 2017-18 విద్యా సంవత్సరంలో 38 శాతానికి చేరుకుంది. పలు ఐఐఎంల్లో ఈసారి బాలికల సంఖ్య భారీగా పెరిగింది.

ఓటికుండలుగా జలాశయాలు

● సున్నాకు పడిన సాగర్... 6%కి తగ్గిన శ్రీశైలం
● దేశంలో అతితక్కువ నీటి నిల్వలున్నవిగా నమోదు

ఈనాడు, దిల్లీ: వర్షాకాలం మొదలై మూణ్నెల్లయినా తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులు ఓటికుండలుగానే ఉన్నాయి. తమిళనాడు తర్వాత అత్యధిక తక్కువ నీటినిల్వలున్న రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు ఈసారి రికార్డులకెక్కాయి. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నిల్వలు సాధారణంతో పోలిస్తే -93%కి పడిపోయాయి. ఎగువనున్న ఆలమట్టి మాత్రం 100% నీటితో కళకళలాడుతోంది. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే దక్షిణాదిలో పరిస్థితి దారుణంగా తయారైంది. మొత్తం 31 ప్రాజెక్టుల్లో ఒక్కదాంట్లో మాత్రమే 100% నీటినిల్వలు నమోదయ్యాయి. 28 ప్రాజెక్టుల్లో మట్టాలు 50%కంటే తక్కువకు పడిపోయాయి. 20 ప్రాజెక్టుల్లో దారుణంగా 40% లోపే నమోదవుతున్నాయి.

దేశవ్యాప్తంగా అయిదు ప్రాంతాల్లోని 91 రిజర్వాయర్లలోని మట్టాలను కేంద్ర జలసంఘం నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది. తాజా లెక్కల ప్రకారం హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, త్రిపుర, ఉత్తర్‌ప్రదేశ్ మిగిలిన అన్ని రాష్ట్రాల్లోని జలాశయాల్లోనూ నిల్వలు సాధారణం కంటే దిగువకు పడిపోయాయి. 12 రాష్ట్రాల్లో నీటిమట్టాలు ఇప్పుడు మైనస్‌లో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 5ప్రాజెక్టుల్లో 100% నీటి నిల్వలుంటే, 33 ప్రాజెక్టుల్లో 40%కంటే తక్కువకు పడిపోయాయి. దక్షిణాదిలోని 31 జలాశయాల్లో గతేడాది ఇదే సమయానికి 44% నీటి నిల్వలుంటే ఈసారి అది 29%కి పడిపోయింది.

ఎఫ్ఆర్ఎల్‌తో పోలిస్తే ప్రస్తుత నీటి నిల్వల పరిస్థితి (శాతాల్లో)

నాగార్జునసాగర్	0
శ్రీశైలం	6
సోమశిల	9
శ్రీరాంసాగర్	11
లోయర్ మానేరు	33
తుంగభద్ర	45

సాధారణ స్థాయితో పోలిస్తే ప్రస్తుత నీటి నిల్వలు (శాతాల్లో)

ఆంధ్రా, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టులు	93
ఏపీ	61
తెలంగాణ	53
కర్ణాటక	30
కేరళ	44
తమిళనాడు	71

జలాశయం పేరు	నీటినిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటిమట్టం (టీఎంసీల్లో)	ఎగువ ప్రవాహం (క్యూసెక్కుల్లో)
ఆలమట్టి	129.72	128.19	3003
నారాయణపూర్	37.64	8.18	2011
జూరాల	9.66	6.20	2232
తుంగభద్ర	100.86	52.65	4394
శ్రీశైలం	215.81	20.56	2242
నాగార్జునసాగర్	312.05	115.78	865
పులిచింతల	45.77	3.62	804

కృష్ణానదిలో తగ్గిన ప్రవాహం

ఈనాడు, హైదరాబాద్: ఎగువ నుంచి కృష్ణానదిలో ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ఆలమట్టికి 3003 క్యూసెక్కులు వస్తుండగా.. 2వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయానికి 2011 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దిగువకు వదలడం లేదు. జూరాల జలాశయానికి 2232 క్యూసెక్కులు వస్తుండగా.. 2514 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి 2242 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

మేం ఆశించిన అమెరికా అధ్యక్ష పదవి ముగిసినట్టే!

శ్వేతసౌధం మాజీ ప్రధాన వ్యూహకర్త వ్యాఖ్య

వాషింగ్టన్: సంప్రదాయవాదులు కోరుకున్న అమెరికా అధ్యక్ష పదవి ముగిసినట్టేనని శ్వేత సౌధం ప్రధాన వ్యూహకర్తగా తొలగింపునకు గురయిన స్టీఫెన్ బన్నాన్ వ్యాఖ్యానించారు. ఇకపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను రిపబ్లికన్ పార్టీ సభ్యులు 'మధ్యేమార్గంలో' నడిపిస్తారని చెప్పారు. శ్వేత జాతీయుల అనుకూల వైఖరి అనుసరిస్తున్నారన్న కారణంతో బన్నాన్‌ను తొలగించారు. శనివారం ఆయన సంప్రదాయవాదుల పత్రిక వీక్లీ స్టాండర్డ్‌తో మాట్లాడుతూ 'ట్రంప్ అధ్యక్షుడు కావాలని పోరాడాం. గెలిచాం. అక్కడితో అది ముగిసింది. ఇంకా చాలా పెద్ద ఉద్యమమే చేయాల్సి ఉంది. ట్రంప్ అధ్యక్ష పదవి ద్వారా దాన్ని చేయాలనుకున్నాం. అయితే ఆ అధ్యక్ష పదవి ముగిసినట్టే. ఇది వేరేది. అన్ని రకాల యుద్ధాలు ఉంటాయి. మంచి రోజులు, చెడ్డ రోజులు ఉంటాయి. కానీ మేము ఆశించిన అధ్యక్ష పదవి ముగిసినట్టే' అని అన్నారు. ట్రంప్ 'జాతీయవాద' సిద్ధాంతాల వెనుక బన్నాన్ ఉన్నారని అందరూ భావిస్తారు. తనను ఎవరూ తొలగించలేదని, తానే స్వచ్ఛందంగా తప్పుకొన్నానని చెప్పారు. పదవి చేపట్టి ఈ నెల 14వ తేదీకి సంవత్సరం పూర్తయిందని, ఆ సందర్భంగా వైదొలుగుతానని ఈ నెల ఏడో తేదీనే శ్వేత సౌధం చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీకి చెప్పానని వివరించారు. పదవికి రాజీనామా చేసిన తరువాత ఆయన తన 'బ్రెయిట్‌బార్ట్ న్యూస్' వెబ్‌సైట్‌లో తిరిగి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

కన్నీళ్లు తాగుతూ... ఒకటి...రెండూ..మూడు!

● ఓ చిన్నారి అసహాయ అభ్యాసం
● వైరల్ అవుతున్న వీడియో



దిల్లీ: ముందు అంకెలున్న పుస్తకం...చేతిలో పెన్సిలు... పెద్దపెద్ద కళ్లనిండా చెప్పలేనంత భయంతో బిక్కుబిక్కుమంటూ ఒకటి నుంచి అయిదు వరకూ అంకెలు చెప్పడానికి ఆ చిన్నారి తడబడుతున్న తీరు చూపరుల గుండెలు ద్రవించేలా ఉంది. సరిగ్గా చెబుతున్నప్పటికీ...మళ్లీ.. మళ్లీ అంకెలను చెప్పమంటూ ఓ మహిళ కరకు కంఠంతో గద్దించడంతో ఉలిక్కి పడుతోందా చిన్నారి. కళ్లల్లో నిండిన నీరు లేతబుగ్గల మీదనుంచి పెదవుల మీదకు జారుతుంటే కనీసం చిట్టి చేతులతో తుడుచుకోవాలని కూడా తోచని భయంతో ...కన్నీళ్లను మింగేస్తూ. ..ఒకటి... రెండు...మూడు అంటూ చెబుతున్న వైనం కంటతడి పెట్టించేలా ఉంది. టీం ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఇటీవల షేర్ చేసిన ఈ వీడియో శనివారం వైరల్ అయింది. ఏడుపుతో వెక్కిళ్లు పెడుతూ. ..అంకెలు వరసగా చెబుతున్నప్పటికీ...మధ్యమధ్యలో ఉరుము ఉరిమిన చందంగా ఆ మహిళ అరవడం.. పాప భయంతో చెవులు మూసుకుంటూ...ఏడుస్తూ...వేడుకుంటున్నట్లు చేతులు జోడించడం మనసు కలచివేసేలా ఉంది. అసలే దిక్కుతోచకుండా ఏడుస్తున్న స్థితిలో ఉన్న చిన్నారి లేత చెంపలను ఓ చేయి ఛెళ్లు ..ఛెళ్లు మనిపించడం...మొత్తం మీద ఈ హృదయవిదారక దృశ్యం ఇప్పుడు తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

పిల్లల్ని ఇలాగేనా పెంచేది?: సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్న ఓ వీడియోపై భారత క్రికెటర్లు శిఖర్ ధావన్, రాబిన్ ఉతప్ప, యువరాజ్‌సింగ్‌లు స్పందించారు. "పిల్లల విషయంలో సహనంతో వ్యవహరించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నా" అని శిఖర్ ధావన్ ట్విటర్లో పేర్కొన్నారు.

ఈనాడు సినిమా


'పైసా వసూల్'లో శ్రియ, బాలకృష్ణ

బాగుందే... భలేగుందే!

కొత్తపాట గురూ!

చిత్రం: పైసా వసూల్
గానం: అనూప్ రూబెన్స్, జితిన్, శ్రీకావ్యచందన
రచన: భాస్కరభట్ల రవికుమార్
సంగీతం: అనూప్ రూబెన్స్

పల్లవి:
అతను: కన్నూ కన్నూ కలిశాయి.. ఎన్నో ఎన్నో తెలిశాయి
నిన్నా మొన్నా చూస్తే ఇద్దరం.. ఇప్పుడయ్యాం కదా ఒక్కరం
ఆమె: మనసు మనసు కలిశాయి.. మబ్బుల్లో ఎగిరాయి
గుర్తుండిపోదా ఈ క్షణం.. గుండెలోతుల్లో కోలాహలం
అతను: నువ్వు నాలో సగం.. నేను నీలో సగం
తెచ్చి కలిపేసుకుందాం ఇలా.. బాగుందే భలేగుందే భలేగుందే
ఇదేం సంతో తెలీనంత.. తమాషాగుందే బాగుందే

చరణం: 1
ఆమె: ఏమో ఏమైందో అమాంతం ఏమైపోయిందో
ప్రపంచం మనతో ఉండేది.. ఎలాగ మాయం అయ్యిందో
అతను: నిన్నూ నన్నొక ప్రపంచం అనుకోనుంటాది
మనల్నే చూస్తూ తనకే దారిలేక వెళిపోయుంటుంది
ఆమె: కాలమంటే ఆగదేచోటా
కానీ మనజంట కౌగిట్లో బందీలాగా ఉండిపోయిందే.. భలేగుందే

చరణం: 2
అతను: నువ్వే ముందుంటే కనుల్లో మేఘం మెరిసిందే
అదేంటో వెళ్ళొస్తానంటే నిజంగా గుండె తడిసిందే
ఆమె: నువ్వే ఉండగా తేలిగ్గా మనసే ఉంటుందే
మరేమో దూరంగుంటే మోయలేని భారంగుంటుందే
అతను: దీనిపేరే ఏమిటంటారో
ఏది ఏమైనా ఈ హాయి చాలా చాలా చాలా బాగుందే భలేగుందే


భాస్కరభట్ల రవికుమార్


భాస్కరభట్ల రవికుమార్ అనగానే మాస్ పాటలే గుర్తుకొస్తాయి. ప్రేమ మొదలుకొని, వేదాంతం వరకు... హుషారైన బాణీల్లోనే ఆయన తన భావాల్ని పలికించారు చాలాసార్లు. అయితే స్వతహాగా ఆయనకి మెలోడీ గీతాలంటే ఎంతో మక్కువ. ఆ అవకాశం వచ్చిన ప్రతిసారీ వాటిపై తనదైన ముద్రవేస్తుంటారు. బాలకృష్ణ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పైసా వసూల్' కోసం మరో మెలోడీ గీతం రాశారు. 'కన్నూ కన్నూ కలిశాయి...' అంటూ తీయనైన ప్రేమనీ, బాధనీ, ఆర్ద్రతనీ ఆవిష్కరించిన ఆ పాట ప్రయాణం గురించి భాస్కరభట్ల చెబుతున్న విషయాలివీ...

"మెలోడీ గీతాలు రాసే అవకాశం నాకు అరుదుగా వస్తుంటుంది. అవకాశం వచ్చినప్పుడు మాత్రం ఆ పాటలపై నాకున్న ప్రత్యేకమైన ఇష్టాన్ని, ప్రేమని ప్రదర్శిస్తూ రాస్తుంటా. 'పైసా వసూల్' కోసం మెలోడీ గీతం రాయాలని దర్శకుడు పూరి జగన్నాథ్ చెప్పగానే చాలా సంతోషించా. బాలకృష్ణలాంటి ఓ మాస్ కథానాయకుడి సినిమాకి మెలోడీ రాయడంలో ఓ కిక్ ఉంటుంది. ఆయన ప్రతి సినిమాలోనూ ఆ తరహా ఓ గీతం ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది. అందుకే ఒక అరుదైన అవకాశంగా భావించి ఈ పాట రాశా. అనుకోకుండానే కలిసి అనుబంధాల్ని పెనవేసుకొన్న ఓ జంట... అర్ధంతరంగా దూరం కావాల్సి వస్తుంది. ఆ ఎడబాటులో వచ్చే పాటే ఇది. దూరమైపోతున్న రెండు మనసుల తరపున వకాల్తా పుచ్చుకొని ఓ కవిగా నేను అక్షరీకరించిన భావాలే ఈ గీతం. ప్రేమ ప్రయాణం మొదలైన తీరుని గుర్తు చేసుకొంటూనే, ఆ హృదయాలు ఆర్ద్రతకి గురవుతాయి. అందుకే ఒక చరణంలో సంతోషం, మరొక చరణంలో గుండె తడిని పెంచే ఆర్ద్రతతో కూడిన భావాలు వినిపిస్తాయి. ప్రేమకి నిర్వచనం చెప్పకుండానే, ప్రేమని ఆవిష్కరిస్తుందీ పాట. గమనిస్తే అంతర్లీనంగా ఓ కథ కూడా ఉంటుంది. ఇందులో భాష, భావం... రెండూ కూడా సరళంగా ఉంటాయి. ఒక శిల్పంలా కుదిరిన పాట ఇది. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ బాణీ కడుతున్న సమయంలోనే పల్లవి రాశా. రెండు రోజుల్లో చరణాల్ని పూర్తి చేశా. బాలకృష్ణగారిని కలిసినప్పుడు ఆయన ఈ పాట బాగుందని ప్రత్యేకంగా గుర్తు చేశారు. పూరి జగన్నాథ్ గారితో నాకిది 25వ సినిమా. ఓ మైలురాయిలాంటి సినిమాలో గుర్తుండిపోయే ఓ మంచి గీతాన్ని రాసినందుకు చాలా ఆనందంగా ఉంది. అందరికీ నచ్చుతుందీ పాట".

సుమధుర కవులకు రమణీయ రాగాంజలి

స్వరాభిషేకం - సరికొత్త సంగీత సంచికలు... నేటి నుంచి ఈటీవీలో!


సముద్రాల రాఘవాచార్య


కొసరాజు రాఘవయ్య చౌదరి

తెలుగు సినిమాకు పాటే ప్రాణం. ఆ పాటకు ప్రాణం పోసి, అక్షరాలతో అభిషేకం చేసిన గేయరచయితలకు నీరాజనం అర్పిస్తూ ఈ రోజు నుంచి 'స్వరాభిషేకం' ప్రత్యేక సంచికలను సమర్పిస్తోంది ఈటీవీ. నాటి నుండి నేటి వరకు వెండితెరపై తమదైన ముద్రవేసుకున్న మేటి కవుల పాటలను, ప్రఖ్యాత గాయనీగాయకులు ఆలపించి అలరించబోతున్నారు. ఆ పాతమధురమైన పాటలెన్నో సంగీతాభిమానుల్ని పలకరించి పులకరింపచేయబోతున్నాయి. మచ్చుకి కొన్ని మెచ్చుతునకల్ని చూస్తే...





సదాశివ బ్రహ్మం

- 'గుండమ్మకథ'లో పింగళివారు రాసిన 'అలిగిన వేళనే చూడాలి..' పాట ఎప్పటికీ తెలుగు ప్రేక్షకుల మనసుల్ని ఊయలలూపుతూనే ఉంటుంది. ఆ కమనీయగీతాన్ని సునీత అందించబోతున్నారు.
- 'సంసారం సంసారం..' అంటూ 'సంసారం' చిత్రంలో సురాగాలు పండించిన సదాశివబ్రహ్మం రచన, గానగంధర్వుడు డా. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గళంలో అమృతధారలు కురిపించబోతోంది.
- 'జయభేరి' చిత్రంలో శ్రోతల్ని ఉర్రూతలూగించిన మల్లాది రామకృష్ణ శాస్త్రి రచన 'రాగమయీ రావే..' కారుణ్య స్వరంలో వీనుల విందు చేయబోతోంది.


మల్లాది రామకృష్ణ శాస్త్రి

'స్వరాభిషేకం - సుమధుర కవులకు రమణీయ రాగాంజలి' నేటి నుంచి ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు ఈటీవీలో...

ఇలా ఒకటా... రెండా... సముద్రాల, కొసరాజు, వీటూరి, రాజశ్రీ, విజయరత్నం, మోదుకూరి జాన్సన్, చెరువు ఆంజనేయశాస్త్రి, అప్పలాచార్య, అనిసెట్టి, రావూరి, భువనచంద్ర, వెన్నెలకంటి, సాహితి, జొన్నవిత్తుల, రసరాజు, గోపి, దాసరి నారాయణరావు, జాలాది, వడ్డాది, ఎమ్.ఎస్. రెడ్డి, సింగీతం శ్రీనివాసరావు, కులశేఖర్, అనంత్‌శ్రీరామ్ మొదలైన మధురకవుల గీతాలు 'స్వరాభిషేకం'లో తెలుగు ప్రేక్షకుల్ని తన్మయుల్ని చెయ్యబోతున్నాయి. ప్రేమ, విరహం, వలపు, వేదన, భక్తి, రక్తి... అన్నీ కలగలసిన ఈ పాటల పండుగను బాలు, చిత్ర, హేమచంద్ర, సునీత, కారుణ్య, గీతామాధురి, శ్రావణభార్గవి, ప్రణవి, రమ్యబెహ్రా, శ్రీకృష్ణ, విల్సన్, రామాచారి, రోహిత్, దినకర్, సాందీప్, ధనుంజయ్, హరిణి మొదలైన గాయనీగాయకులు తమ స్వరతోరణాలతో స్వాగతించబోతున్నారు.


పింగళి


శ్రుతిహాసన్

స్వేచ్ఛ కోసం పోరాటం


అజయ్ ఆండ్రూస్, మంచు మనోజ్, మంచు లక్ష్మీప్రసన్న, ఎస్.ఎన్.రెడ్డి

మనోజ్ మంచు కథానాయకుడుగా నటించిన చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. అనీషా అంబ్రోస్ నాయిక. అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకుడు. ఎస్.ఎన్. రెడ్డి, లక్ష్మీకాంత్.ఎన్ నిర్మాతలు. సెప్టెంబరు 8న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు. శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. నటి మంచు లక్ష్మీప్రసన్న ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ "మనోజ్ ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా ఉండే కథల్నే ఎంచుకొంటుంటాడు. ఇది కూడా ఆ తరహా చిత్రమే. ఇందులో తను పోషించిన రెండు పాత్రలకీ న్యాయం చేసేందుకు ఎంతో శ్రమించాడు. తన కష్టానికి తగిన ప్రతిఫలం ఈ చిత్రంతో లభిస్తుందనే నమ్మకం నాకుంది. ప్రచార చిత్రం చాలా బాగుంద"న్నారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ "నాయకత్వ వైఫల్యాలు సామాన్యుడిపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయనే విషయాన్ని ఆలోచన రేకెత్తించేలా చెప్పబోతున్నాం. స్వేచ్ఛ కోసం ఓ యువకుడు చేసిన పోరాటం ఇది. మనోజ్ విద్యార్థి నాయకుడు, ఉద్యమనేత పాత్రల్లో కనిపిస్తాడు. తను 20 కిలోల బరువు తగ్గి మరీ నటించడం విశేషం. నాయిక అనీషా రిపోర్టర్‌గా కనిపిస్తుంది. సముద్రం నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు చిత్రానికి ప్రధాన ఆకర్షణ. రామరాజు ఛాయాగ్రహణం, శివ నందిగమ్ సంగీతం సినిమాకి ప్రధాన బలం" అన్నారు. మనోజ్ మాట్లాడుతూ "నాపై నమ్మకంతో దర్శకుడు రెండు రకాల పాత్రల్ని చేయించారు. ఆయన 1980 నాటి వాతావరణాన్ని, ఇప్పటి పరిస్థితుల్ని ప్రతిబింబించేలా సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం చాలా బాగుంది" అన్నారు. "సరికొత్త జోనర్‌లో నడిచే ఓ విభిన్నమైన చిత్రం" అన్నారు నిర్మాత. సౌండ్ ఇంజినీర్ విక్రమ్ బిస్వాస్, సంగీతదర్శకుడు శివ నందిగమ్ పాల్గొన్నారు.

మా నమ్మకం నిజమైంది


మహి వి.రాఘవ్, తాప్సి, దిల్‌రాజు, విజయ్

"నేను కూడా హారర్ కామెడీ చిత్రాలు నిర్మించాలనేంతగా 'ఆనందో బ్రహ్మ' స్ఫూర్తి నింపింది" అన్నారు దిల్‌రాజు. తాప్సి ప్రధాన పాత్రధారిగా మహి వి. రాఘవ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆనందో బ్రహ్మ' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ "దెయ్యాలే మనుషులకి భయపడితే ఎలా ఉంటుందనే ఓ కొత్త ఆలోచనతో తీసిన సినిమా ఇది. శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్‌లపై నలభై నిమిషాల పాటు నడిచిన సన్నివేశాలు చాలా బాగున్నాయి. రివర్స్ హారర్ కామెడీ చిత్రమిది. కథానాయిక ప్రాధాన్యంతో కూడిన ఇలాంటి చిత్రాలు ఆడినప్పుడే మరిన్ని విభిన్నమైన సినిమాలు వచ్చే అవకాశం ఉంటుంది" అన్నారు. "ప్రేక్షకులు సినిమాని ఆదరిస్తున్న విధానం సంతృప్తినిస్తోంది" అన్నారు దర్శకుడు మహి వి. రాఘవ్. "ఓవర్సీస్‌లోనూ చక్కటి ఆదరణ లభిస్తోంద"న్నారు చిత్ర నిర్మాత విజయ్. "మంచి సినిమా అవుతుందనే నమ్మకంతోనే మేం కష్టపడ్డాం. ఆ నమ్మకం నిజమైంది" అన్నారు తాప్సి. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, తాగుబోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హలో గురూ...


అఖిల్

అఖిల్ అక్కినేని చిత్రం పేరు విషయంలో ఆసక్తి నెలకొంది. విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ చిత్రానికి ఇప్పటికే 'జున్ను', 'ఎక్కడ ఎక్కడ ఉందో తారక...', 'హలో గురు ప్రేమకోసమే...' తదితర పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. దాంతో అసలు పేరు ఏదై ఉంటుందా అని ఆరా తీస్తున్నారు అక్కినేని అభిమానులు. నాగార్జున పుట్టినరోజైన ఆగస్టు 29న పేరు, ఫస్ట్ లుక్ విడుదలవుతుందని ఊహించారంతా. అయితే నిన్ననే చిత్ర బృందం ప్రమేయం లేకుండానే ఫస్ట్ లుక్ ఆన్‌లైన్‌లో లీక్ అయింది. అందుకే పేరును కూడా త్వరలోనే ప్రకటించాలని నిర్ణయించింది చిత్రబృందం. సోమవారం పేరును ప్రకటించబోతున్నారు. ఆలోపుగానే పేరు విషయంలో ఓ చిన్న హింట్ ఇచ్చారు నాగార్జున. తాను కథానాయకుడిగా నటించిన 'నిర్ణయం'లోని 'హలో గురు ప్రేమకోసమేరోయ్ జీవితం..' పాటని ట్విట్టర్‌లో పోస్ట్ చేసి 'ఇందులోనే అఖిల్ సినిమా పేరు ఉందా?' అని ట్వీటారు. నాగచైతన్య, సమంత రేపు మరో హింట్ ఇస్తారని కూడా ప్రకటించారు. దాంతో అభిమానులు 'హలో గురు ప్రేమ కోసమేరోయ్ జీవితం... మగాడితో ఆడదానికేలా పౌరుషం..' అంటూ సాగే మొత్తం పాటని ముందేసుకొని అఖిల్ చిత్రం పేరేదై ఉంటుందా అని చర్చించుకొంటున్నారు. రేపు నాగచైతన్య, సమంత ఇచ్చే హింట్‌తో పేరు స్పష్టమయ్యే అవకాశాలున్నాయి.

అంతకు మించి అవసరం లేదు

సినిమా తారలనగానే ఖరీదైన జీవితాలే కళ్లముందు మెదులుతాయి. దుస్తుల నుంచి చెప్పుల వరకు అంతా బ్రాండెడ్ వ్యవహారమే అనుకొంటాం. కానీ శ్రుతిహాసన్ మాత్రం అందుకు భిన్నం. మధ్య తరగతి మనుషుల్లాగే డిస్కౌంట్ సేల్ అని కనిపించగానే వెంటనే అక్కడ ప్రత్యక్షమవుతుందట. దాని గురించి ఆమె మాట్లాడుతూ "ట్రెండ్ అంటూ మార్కెట్లోకి వచ్చిన కొత్త వస్తువులన్నింటినీ కొనడం నాకు నచ్చదు. చాలామంది అలాంటి దుస్తులు వేసుకో, ఇవి వాడు అంటుంటారు. అన్నీ వింటాను కానీ నాకు ఏవైతే సరిపడతాయో వాటిని కొనడానికే ప్రాధాన్యమిస్తా. అంతకు మించి ఖర్చు చేయాల్సిన అవసరం లేదనేది నా సిద్ధాంతం. నా అభిమానులు నా ఫ్యాషన్, ట్రెండ్‌ని అనుసరించి కాకుండా, నా మనసుని తెలుసుకొని నన్ను ఇష్టపడుతుంటారు. అది నాకెంతో సంతోషాన్నిచ్చే విషయం" అని చెప్పింది.

పంచ్ డైలాగ్

పక్కవాడి పాపం చూపించడానికి, మనం పాపం చెయ్యడం మహా పాపం!
చిత్రం: మానవుడు దానవుడు
- పంపినవారు: శ్రీకాంత్.జి, డల్లాస్

సంగీతానికి విలువ ఇస్తున్నారు!


అనూప్ రూబెన్స్

"నేపథ్య సంగీతానికి ప్రాధాన్యమున్న సినిమాలకి పనిచేయడమంటే చాలా ఇష్టం" అంటున్నారు అనూప్ రూబెన్స్. ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి'తో పాటు, త్వరలోనే విడుదల కానున్న 'పైసా వసూల్'కి ఆయన సంగీతం అందించారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు అనూప్. "రాజకీయ నేపథ్యంతో సాగే సినిమాలకి నేను ఇంతకుముందు ఎప్పుడూ సంగీతం అందించలేదు. తేజ గారు 'నేనే రాజు నేనే మంత్రి' కథ చెప్పినప్పుడు ఈ సినిమా నాకెంత ప్రత్యేకమో అర్థమైంది. అందుకే ఒక సవాల్‌గా భావించి ఈ సినిమా చేశా. డ్యూయెట్లు మొదలుకొని ప్రతి పాట కూడా కథలో భాగమై ఉంటుంది. తేజ గారితో ఎప్పట్నుంచో ప్రయాణం చేస్తున్నా. ఆయనతో కలిసి పనిచేసిన ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకొంటుంటా. నేపథ్య సంగీతం విషయంలో 'ఇష్క్', 'గుండెజారి గల్లంతయ్యిందే', 'గోపాల గోపాల', 'మనం' తర్వాత నాకు అంతగా పేరు తెచ్చిపెట్టిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. ఈ సినిమా ఫలితం నాకు మరింత ఉత్సాహాన్నిచ్చింది" అన్నారు అనూప్. బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'పైసా వసూల్'కి పనిచేయడం మరో కొత్త అనుభవం అన్నారు. "బాలకృష్ణగారికి సంగీతం అంటే చాలా ఇష్టం. ఆ మక్కువతోనే సినిమాలో పాట పాడారు. 'ఈ నాలుగు దశాబ్దాల్లో నాతో పాట పాడించాలని చాలామంది ప్రయత్నించారు కానీ... తొలిసారి నీ బాణీకే పాట పాడాను' అన్నారు బాలకృష్ణ. అఖిల్‌తో కూడా పాట పాడించా. ఆ పాటని త్వరలోనే విడుదల చేయబోతున్నామ"న్నారు అనూప్. "సంగీత విభాగంలో కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తోంది. వాళ్లకి అవకాశాలు కూడా అదే స్థాయిలో లభిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా పిల్లల్ని చదువుతో పాటు సంగీతం పరంగానూ ప్రోత్సహిస్తున్నారు. కొత్త గాయకులతో పాడించడం, కొత్త దర్శకులతో పనిచేయడమంటే నాకు ఇష్టం" అన్నారు అనూప్.

డొనాల్డ్ ట్రంప్‌కు హాలీవుడ్ పెన్షన్




ఇది విన్నారా!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏంటి? హాలీవుడ్ నుంచి పెన్షన్ తీసుకోవడమేంటి అని ఆశ్చర్యపోతున్నారా..? ఆయన దేశాధ్యక్షుడు కాకమునుపు సరదా కొద్దీ కొన్ని హాలీవుడ్ సినిమాల్లో నటించారు. 'ది లిటిల్ రాస్కెల్స్', 'వాల్‌స్ట్రీట్ 2: మనీ నెవర్ స్లీప్స్'తో పాటు మొత్తం 22 సినిమాల్లో నటించారు ట్రంప్. హాలీవుడ్ నటుడు విల్ స్మిత్‌తో కలసి ఓ టీవీ షోలో తెరను పంచుకున్నారు. అయితే ఆ చిత్రాల్లో ఎక్కువగా ఆయన నిజజీవిత పాత్రలోనే నటించారు. హాలీవుడ్ నటులకు చెందిన స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్‌లోనూ ట్రంప్‌కు సభ్యత్వం ఉంది. ఆ సంఘం వృద్ధులైన నటులకు పెన్షన్ రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంటుంది. అలా ట్రంప్‌కు కూడా ఏడాదికి లక్షా ఇరవై వేల డాలర్లు పెన్షన్‌గా అందుతోంది.

ఏమాటకామాటే!



"నటులు, నటీమణుల మధ్య చాలా అసమానత ఉంది. నాకన్నా నా తోటి మగ నటులకు మూడు రెట్లు ఎక్కువ పారితోషికం అందుతోంది. కథానాయకుల్లో చాలా మంది సూపర్‌స్టార్లు ఉన్నారు. కానీ స్టార్ హోదా అందుకున్న నాయికలు కొద్దిమందే. దీనికి కారణం పరిశ్రమలోని పరిస్థితులు మాత్రమే కాదు.. ప్రేక్షకులు కూడా. ఓ మహిళ సూపర్‌స్టార్ కాగలదన్న నిజాన్ని అంగీకరించలేకపోతున్నారు." – రాధికా ఆప్టే



"టాయిలెట్: ఏక్ ప్రేమ్‌కథ'ను ప్రభుత్వ అనుకూల ప్రచార చిత్రంగా కొందరు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన స్త్రీల సమస్య గురించి సినిమా ద్వారా అవగాహన కల్పించడం ప్రచారమా?. ఇప్పుడు 'ప్యాడ్‌మ్యాన్'లో పేదరికం వల్ల అత్యవసరమైన శానిటరీ న్యాప్‌కిన్లనూ కొనలేని స్త్రీల దుర్భర పరిస్థితులను చూపించబోతున్నాం. సమస్యల గురించి చర్చించడమే నా ఉద్దేశం. ప్రచారం కాదు." – అక్షయ్ కుమార్

ఎంత ముద్దొస్తున్నానో...

మగువలు తమ అందాలతో మగాళ్ల మతులు పోగొట్టేస్తుంటారు. కానీ ఇక్కడేమో బాలీవుడ్ భామ జాక్వెలైన్ ఫెర్నాండెజ్ తన అందాన్ని చూసుకుంటూ తానే మురిసిపోతోంది. గులాబీ రంగు లిప్‌స్టిక్, విరబోసిన శిరోజాలు, స్లీవ్‌లెస్ టాప్, పొట్టి షార్ట్స్‌లో ఎంత ముద్దొస్తున్నానో అంటూ సంబరపడుతోంది. పోనీ అలా ఊరుకుందా... 'చూడండి నా అందం' అన్నట్లు ఫొటో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఇక మగవారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకీ ఆమె పక్కనున్న అందమైన పూలను ఎవరన్నా పట్టించుకుంటారంటారా..!



క్లిక్ క్లిక్

మరోసారి నాన్నను కాబోతున్నాను

- వైరల్ అవుతున్న జుకెర్‌బర్గ్ 'ఫేస్‌బుక్' పోస్టింగ్



న్యూయార్క్: "చిన్నారి చిట్టితల్లి మాక్స్ తర్వాత మళ్లీ మా కుటుంబానికి మరో చిట్టిపొట్టి అతిథి జతకాబోతున్న శుభతరుణం ఇది. అందుకే, నేను మళ్లీ ఓ రెండునెలల పాటు పితృత్వ సెలవును తీసుకోబోతున్నాను. అయితే, ఈ దఫా పితృత్వ సెలవు విషయంలో మా సంస్థ ఇస్తున్న వెసులుబాటును ఉపయోగించుకుంటూ రెండువిడతలుగా తీసుకుంటాను. నెలలు నిండుతున్న భార్య ప్రిసిల్లా, చిట్టితల్లి మాక్స్‌లను కనిపెట్టుకునే ఉంటాను. పుట్టబోయే బుల్లిపాపాయితో పాటూ మా చిన్ని కుటుంబంతో డిసెంబరు నెలంతా గడిపేస్తాను.' అంటూ ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు జుకెర్‌బర్గ్ చేసిన పోస్టింగ్ వైరల్ అవుతోంది. పెద్దసంఖ్యలో అభిమానులు మహా ముచ్చటపడిపోతున్నారు. జుకెర్‌బర్గ్ ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ పెట్టిన 24 గంటల వ్యవధిలో 16వేల 'షేర్'లు నమోదైనాయి. రెండోసారి తండ్రి కాబోతున్న జుకెర్‌బర్గ్ ఆనందం వర్ణనాతీతం. భార్య ప్రిసిల్లా ఛాన్ పరిస్థితి కూడా అలాగే ఉంది.

ఫిన్లాండ్ ఘటన ఉగ్రవాద చర్యే

- తేల్చిన పోలీసులు

టుర్కు(ఫిన్లాండ్): ఫిన్లాండ్ టుర్కు నగరంలో విచ్చలవిడిగా కత్తిపోట్లకు పాల్పడిన ఘటన ఉగ్రవాద చర్యేనని పోలీసులు తేల్చారు. 18 ఏళ్ల మొరాకోవాసిని నిందితునిగా అనుమానిస్తున్నారు. శుక్రవారం కత్తితో దాడికి పాల్పడిన నిందితుడిపై కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. దాడుల్లో ఇద్దరు మహిళలు మరణించారు. క్షతగాత్రుల సంఖ్య ఆరు నుంచి 8 మందికి పెరిగింది. వీరిలోనూ ఆరుగురు మహిళలే. కత్తిపోట్ల దాడిలో మహిళలనే లక్ష్యంగా చేసుకున్నారనీ, వారికి రక్షణగా వచ్చిన పురుషులూ కత్తిపోట్లకు గురయ్యారని పోలీసులు పేర్కొన్నారు. తాజా సమాచారం మేరకు కత్తిపోట్ల ఘటనల్ని ఉగ్రవాద ఉద్దేశంతో కూడిన హత్యలుగా దర్యాప్తు జరుపుతున్నామనీ, వీటి వెనక ఉగ్రవాద ఉద్దేశం ఉన్నట్లు వెల్లడైందని ప్రకటించారు. దాడికి పాల్పడిన వ్యక్తి 2016లో దేశానికి వచ్చారనీ, శరణార్థి అని తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి టుర్కులోని ఓ అపార్టుమెంట్‌పై దాడిచేసి ఐదుగురు వ్యక్తుల్ని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు సహా మొత్తం ఆరుగురు తమ అదుపులో ఉన్నట్లు జాతీయ దర్యాప్తు బ్యూరో అధికారి మార్కస్ వెల్లడించారు.

స్పెయిన్‌లో నిందితుల కోసం కొనసాగుతున్న వేట

బార్సిలోనా: స్పెయిన్‌లోని బార్సిలోనా, క్యాంబ్రిల్స్‌లో వాహనాలతో పాదచారులపైకి దూసుకెళ్లిన ఘటనల్లో ఒకదానిలో నిందితుడిగా అనుమానిస్తున్న మొరాకో వాసి కోసం పోలీసులు వేటను తీవ్రతరం చేశారు. 22 ఏళ్ల యూనస్ అబూయాకూబ్ అనే అనుమానితుడి కోసం వెదుకుతున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. దాడుల వెనకున్న ఉగ్ర నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేసినట్లు స్పెయిన్ అంతర్గత మంత్రి జువాన్ ఇగ్నాసియో జోయిడో పేర్కొనగా, స్థానిక అధికారులు మాత్రం భిన్నాభిప్రాయాల్ని వ్యక్తం చేశారు.



బార్సిలోనా దాడి అనుమానితుడు మౌస్సా ఔకబీర్

స్పెయిన్ దాడుల వెనక 12 మంది యువతతో కూడిన ఉగ్రబృందం ఉన్నట్లు భావిస్తున్నారు. దాడులతో సంబంధం ఉన్న మరో ముగ్గురిని పోలీసులు గుర్తించారు. వీరిలో ఇద్దరు అల్కనార్ పట్టణంలో జరిగిన పేలుడులో మృతి చెందినట్లు భావిస్తున్నారు. క్యాంబ్రిల్స్‌లో పోలీసు కాల్పుల్లో హతమైన వారిని మొరాకో దేశస్థులైన మౌస్సా ఔకబీర్(17) సైద్ ఆల్లా(18), మొహమెద్ హైచమీ(24)గా గుర్తించారు. వాయు జాడీలను ఉపయోగించి వాహన బాంబు ద్వారా పలుచోట్ల భారీ పేలుళ్లకు ప్రణాళిక వేసి ఉంటారనీ పొరపాటున పేలుడు సంభవించి కుట్ర భగ్నమైందని పోలీసులు అంచనా వేస్తున్నారు. శనివారం అబ్దెల్‌బకీ అనే ఇమామ్ అపార్టుమెంట్‌పై దాడి చేశారు. సదరు ఇమామ్ అల్కనార్ పట్టణంలో జరిగిన పేలుడులో మరణించి ఉంటాడని స్పెయిన్ పత్రిక పేర్కొంది. క్యాంబ్రిల్స్‌లో వాహనంతో జరిపిన దాడి కూడా ఇస్లామిక్ స్టేట్ సైనికుల పనేనని ఐఎస్ ప్రకటించింది.

★ స్పెయిన్ ఉగ్రదాడులతో బ్రిటన్ అప్రమత్తమైంది. తమ పౌరులకు జాగ్రత్తలు సూచించింది. సిరియాలో ఇస్లామిక్ స్టేట్ నెట్‌వర్క్ దెబ్బతింటుండటంతో తమ దేశానికి ఉగ్రముప్పు పెరుగుతోందని బ్రిటన్ భద్రత మంత్రి బెన్‌వాలస్ పేర్కొన్నారు.



జర్మనీలోని డ్రెస్డెన్‌లో పాదచారి మార్గాలపై ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలివి.. పాదచారులపైకి వాహనాలు దూసుకు రాకుండా ఉండేందుకు వీటిని ఏర్పాటు చేశారు

రష్యాలో కత్తిపోట్లతో ఏడుగురికి గాయాలు

మాస్కో: ఫిన్లాండ్, జర్మనీలను వణికించిన కత్తిపోట్ల కలకలం రష్యాకూ పాకింది. శనివారం రష్యాలోని సుర్గుట్ నగరంలో రద్దీగా ఉండే ప్రాంతంలోపౌరులపై అగంతకుడు కత్తితో దాడిచేసి ఏడుగురిని గాయపరిచారు. సాయుధ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కాల్పులు జరపగా దాడిచేసిన వ్యక్తి హతమయ్యారు. కత్తిపోట్లకు గురైనవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని స్థానిక ప్రభుత్వం వెల్లడించింది. ఒకరి పరిస్థితి నిలకడగా ఉండగా, ఇద్దరు ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపింది. బాధితుల్లో ఇద్దరు మహిళలూ ఉన్నట్లు తెలుస్తోంది. దాడికి పాల్పడిన వ్యక్తిని గుర్తించామనీ, అతను స్థానికుడేననీ, మానసిక రుగ్మతల బాధితుడు కావచ్చని అధికారులు వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఉగ్రవాద కోణం ప్రధానాంశం కాదని రష్యా పోలీసులు ప్రకటించినా.. ఇది తమ పనేనని ఉగ్రసంస్థ ఐఎస్ ప్రకటించింది.

మూడుసార్లూ ముప్పు నుంచి తప్పించుకున్నా!

- ఆస్ట్రేలియా మహిళ జూలియా
- బార్సిలోనా... లండన్... పారిస్‌లలో భయానక అనుభవాలు

బార్సిలోనా: జూలియా మోనాకో అనేమహిళ ఏకంగా మూడుసార్లు ఉగ్రవాదుల దాడుల నుంచి తృటిలో తప్పించుకున్నారు. తాజాగా బార్సిలోనాలో జరిగిన తీవ్రవాదుల దాడి సమయంలో ఆమె అక్కడే టీ షర్టుల కోసం షాపింగ్ చేస్తున్నారు. అప్పుడే తెల్లటి వ్యానులో వచ్చిన తీవ్రవాదులు దాడికి తెగబడ్డారు. 13 మందిని పొట్టనబెట్టుకున్నారు. అయితే, తాను దగ్గరే ఉన్న తలుపుగుండా పారిపోయి దాడి నుంచి తప్పించుకున్నట్లు జూలియా ట్విటర్‌లో పేర్కొన్నారు. అది నిజంగా ఓ భయానక అనుభవం అంటూ ఆమె తెలిపారు.

అంతకుముందు అంటే... జూన్ మూడో తేదీన లండన్‌లో పర్యటిస్తున్నప్పుడు ముగ్గురు దుండగులు కత్తులతో స్వైరవిహారం చేసి ఎనిమిది మందిని చంపేశారనీ... అప్పుడూ తాను అలాగే తప్పించుకోగలిగానన్నారు. ఆ తర్వాత వెంటనే తాను పారిస్‌కు వెళ్లాననీ... నోట్రే డేమ్ చర్చ్‌వద్ద చేతిలో బలమైన సుత్తితో దాడులకు సిద్ధమైన ఓ వ్యక్తి బారిన పడకుండా తప్పించుకోగలిగానన్నారు. ఈ భయానక అనుభవాలతో తనకు తిరిగి సొంతదేశం ఆస్ట్రేలియాకు వెళ్లిపోదామా అనిపించిందన్నారు. అయితే, మరుక్షణమే తన మనసు గట్టిపరచుకున్నాననీ...ఎలాంటి అనుభవాలెదురైనా సరే తనకెంతో ఇష్టమైన పర్యటనలను కొనసాగించాలనీ దృఢంగా నిర్ణయించుకున్నట్లు జూలియా ఇటీవల ఓ ఆస్ట్రేలియా రేడియో ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.



'బ్లూ వేల్'కు కళ్లెం

(మొదటి పేజీ తరువాయి)

వేదికగా చేసుకుంటుండటంతో.. క్రీడకు సంబంధించిన లింకుల తొలగింపుపై గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సంస్థలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. బ్లూ వేల్‌కు ప్రచారం కల్పించేవారి సమాచారాన్ని పోలీసులు, ఇతర శాంతి భద్రత పర్యవేక్షణ సంస్థల దృష్టికి తీసుకురావాలని కూడా ప్రభుత్వం ఆయా సంస్థలను కోరింది.

పాఠశాలలకు సీబీఎస్ఈ సూచనలు

'బ్లూ వేల్' నిషేధం నేపథ్యంలో పాఠశాలల్లో అంతర్జాల వినియోగంపై కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సీబీఎస్ఈ) మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రమాదకర, చట్టవిరుద్ధమైన అంశాల బారిన చిన్నారులు పడకుండా.. సరైన ఫైర్‌వాల్, వడపోత వ్యవస్థలను ఉపయోగించాలని పాఠశాలలను కోరింది. చిన్నారుల అంతర్జాల, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంపై నియంత్రణ, పర్యవేక్షణ పెట్టాలని.. అంతర్జాల భద్రతపరమైన విధివిధానాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించింది.

అసలేంటీ క్రీడ?

కుంగుబాటు, ఆత్మన్యూనత, ఒంటరితనం అనుభవిస్తున్నవారిని లక్ష్యంగా చేసుకుని.. ఆత్మహత్యకు ప్రోత్సహించేదే బ్లూవేల్ క్రీడ. ఆత్మహత్యకు సంబంధించిన భావనలు ఉన్నవారికి.. ఇదొక అనుసంధాన వేదికలా పనిచేస్తుంది. 'చావుకు 50 మెట్ల'ను నిర్దేశించి.. వారు అఘాయిత్యానికి ఒడిగట్టేలా చేస్తుంది. ఈ క్రీడకు ఒక నిర్వాహకుడు ఉంటాడు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆడేవారికి అతడు ప్రమాదకర టాస్క్‌లను నిర్దేశిస్తుంటాడు. వాటిని ఆటగాళ్లు ఎప్పటికప్పుడు పూర్తి చేసి.. ఆఖరున నిర్వాహకుడి ఆదేశానుసారం ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంటుంది.

గుర్తించడమెలా?

క్రీడలో పాల్గొనేవారికి బ్లూవేల్ నిర్వాహకుడు ప్రమాదకర టాస్క్‌లు ఇస్తుంటాడు. బ్లేడుతో వివిధ ఆకారాలతో గాట్లు పెట్టుకోమని.. గాయపరుచుకోమని చెబుతుంటాడు. చిన్నారుల చేతులు, కాళ్లు, పెదవులపై ఇలాంటి విచిత్రమైన గాట్లు, గాయాలు కనబడితే.. అనుమానించాల్సిందే. తెల్లవారకముందే మేల్కొని ఎత్తైన భవనాలపైకి వెళ్లడం, రైలు పట్టాల వద్ద తిరగడం, వంతెనల కొనపై నిలబడటం లాంటి టాస్క్‌లు బ్లూ వేల్‌లో ఉంటాయి. ఇలాంటి విచిత్ర ప్రవర్తన, అలవాట్ల ఆధారంగా వారిని సులభంగానే గుర్తించవచ్చు. సామాజిక మాధ్యమాల్లో వారు పెట్టే పోస్టులను గమనించాలి. అంతర్జాలం, ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగిస్తున్న తీరుపైనా దృష్టి సారించాలి.

బ్లూ వేల్‌కు ఆకర్షితులైనవారిని రక్షించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల చొరవ అవసరం. ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా.. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలి. ఒకవేళ వసతిగృహాలు, బోర్డింగ్ పాఠశాలల్లో చిన్నారులు ఉన్నట్లయితే.. నిత్యం అందుబాటులో ఉంటూ వారి క్షేమ సమాచారాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలి.

దిల్లీలో బ్లూవేల్ బాధితుడు!

దేశ రాజధాని దిల్లీలో 16ఏళ్ల బాలుడు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. బుధవారం జరిగిన ఈ ఘటనకు.. బ్లూ వేల్ క్రీడే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కూడా ఆ కోణంలోనే తొలుత విచారణ జరిపారు. అయితే బాధితుడు ప్రస్తుతం మాట్లాడలేని స్థితిలో ఉన్నాడని.. అతడి శరీరంపై మాత్రం బ్లూ వేల్ క్రీడలో పాల్గొన్నట్లుగా సూచించే గాయాలేవీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. పాస్‌వర్డ్ రక్షణ ఉండటంతో బాలుడి ఫోన్‌లోని సమాచారం రాబట్టలేకపోయామని. . సమాచారం సేకరించిన అనంతరం ఈ కేసుపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

ఎన్నికల్లో పోటీకి 75 ఏళ్ల పరిమితి వర్తించదు

- భాజపా అధ్యక్షుడు అమిత్ షా స్పష్టీకరణ

భోపాల్: ఎన్నికల్లో పోటీ చేయడానికి 75 ఏళ్లు నిండిన వారు అనర్హులంటూ తమ పార్టీ ఎలాంటి నిబంధనా విధించలేదని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అలాంటి నిబంధనగానీ, సంప్రదాయంగానీ తమ పార్టీలో లేదని తెలిపారు. 75 ఏళ్లు నిండినందున మధ్యప్రదేశ్ మంత్రివర్గం నుంచి బాబూలాల్ గౌర్, సర్తాజ్ సింగ్‌లను తొలగించడంపై విలేకరులు ఆయనను ప్రశ్నించగా, అది ముఖ్యమంత్రి ఇష్టమని చెప్పారు. కోర్టు ఆదేశాలు, పరస్పర అవగాహనతో రామమందిరాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఇది తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఉందని అన్నారు. రాజకీయాల్లో అవినీతిని నిర్మూలించడానికి పార్టీలకు నగదు రూపంలో ఇచ్చే విరాళాలను రూ.20 వేల నుంచి రూ.2 వేలకు తగ్గించామని తెలిపారు.

కశ్మీర్ సమస్య పరిష్కారానికి తీవ్ర ప్రయత్నాలు: కశ్మీర్ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, గత రెండు మూడు నెలలుగా దాని ఫలితాలు కనిపిస్తున్నాయని అమిత్ షా చెప్పారు. వేర్పాటువాదులు, ఉగ్రవాదుల విషయంలో తగిన విధంగానే వ్యవహరిస్తోందని తెలిపారు. ఇటీవల కాలంలో పలువురు ఉగ్రవాదులు హతమైన నేపథ్యంలో ఆయనపై వ్యాఖ్య చేశారు. డోక్లాం సమస్యపై పార్లమెంటులోనే విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ వివరణ ఇచ్చారని తెలిపారు. నియంత్రణ రేఖ వెంబడి గత సెప్టెంబరులో మెరుపు దాడులు నిర్వహించిన తరువాత భారతపై ప్రపంచ వైఖరి మారిందని అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత తొలిసారిగా భారత సైనికులు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి వెళ్లి బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ పెరిగిందని అన్నారు.

మోదీతో ఇబ్బందిలేదు.. అమిత్‌షాది నిరంకుశత్వం: మమత

కోల్‌కతా, భోపాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు ఎలాంటి సమస్యా లేదనీ, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తీరు మాత్రం దేశంలో నిరంకుశత్వ వాతావరణాన్ని తీసుకువస్తోందనీ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. శుక్రవారం కోల్‌కతాలో ఒక టీవీ ఛానెల్ ముఖాముఖిలో ఆమె ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. షా పనితీరుపై ఆమె మాట్లాడుతూ- 'దేశంలో ప్రతిఒక్కరూ భయపడుతున్నారు. అత్యంత నిరంకుశత్వం నడుస్తోంది. ఒక పార్టీ అధ్యక్షుడు మంత్రులతో ఎలా సమావేశాలు నిర్వహిస్తారు. అసలు ప్రధాని మోదీయా, అమిత్ షానా?' అని ఆమె ప్రశ్నించారు. 'నేను మోదీని ఇష్టపడతాను గానీ అమిత్‌షాను కాదు. నేను ప్రధానిని నిందించబోను. నేనెందుకు ఆయన్ని నిందించాలి? ఆయన పార్టీ ఆ విషయాలను చూసుకోవాలి' అని మమత అన్నారు.



ఇప్పటికే చీలికలు పీలికలైన విపక్షాలను ఆమె వ్యాఖ్యలు మరింత ఇరకాటంలో నెట్టేశాయి.

మోదీ నాయకత్వాన్ని మెచ్చుకున్నందుకు మమతకి అమిత్‌షా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో అవినీతిని నిర్మూలించడానికి మోదీ సర్కారు గట్టిగా కృషి చేస్తోందని చెప్పారు.

బ్రిటన్‌ను వీడితే ప్రోత్సాహక నగదు!

- యూకేఐపీ నాయకుని ప్రకటన

లండన్: భారతీయులు బ్రిటన్ నుంచి తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాలనుకుంటే వారికి సొమ్ము చెల్లించే పథకాన్ని తీసుకొస్తామని యునైటెడ్ కింగ్‌డం ఇండిపెండెన్స్ పార్టీ (యూకేఐపీ) నాయకుడు జాన్ రీస్-ఎవాన్స్ ప్రకటించారు. భారతీయులతో పాటు, టాంజానియన్లు, ఇతర దేశీయులకూ ఇది వర్తిస్తుందని చెప్పారు. విదేశీయుల వలసలను వ్యతిరేకించడమే ఆ పార్టీ ప్రధాన అజెండాగా ఉంది. దాని అధినేత కావాలని ప్రయత్నిస్తున్న రీస్-ఎవాన్స్ బ్రిటన్‌లో 'అనవసర జనాభా'ను తొలగించాలన్న ఉద్దేశంతో ఈ 'విప్లవాత్మక' ప్రకటన చేశారు. వారు స్వదేశాలకు తిరిగి వెళ్లేందుకు 'ప్రోత్సాహకం'గా 9 వేల పౌండ్లు (దాదాపు రూ.7.40లక్షలు) ఇస్తామని తెలిపారు. 'ఇదేమీ అమానుషం కాదు. ఫాసిస్టు విధానమూ కాదు. ఏటా కనీసం పది లక్షల మంది ఇక్కడ నుంచి ఇతర దేశాలకు వలస వెళ్లేలా చేయడమే లక్ష్యం' అని ఆయన వివరించారు.

మాదక ద్రవ్యాల కేసులో ఎయిరిండియా సిబ్బంది అరెస్టు

దిల్లీ: మాదకద్రవ్యాలను సరఫరా చేశారన్న ఆరోపణలపై ఎయిరిండియా సిబ్బంది ఒకర్ని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. గత నెల 19న చెన్నైలోని ఎయిరిండియా విమానంలో ఆహార పదార్థాలను అందించే ట్రాలీ నుంచి 2 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని రవాణా చేసేందుకు ప్రయత్నించిన సిబ్బందిని అరెస్టు చేసినట్లు కస్టమ్స్ విభాగం శనివారం తెలిపింది.

కశ్మీర్‌లో పీడీపీ కార్యకర్తను కాల్చి చంపిన ఉగ్రవాదులు

శ్రీనగర్: ఉగ్రవాద మూకలు శనివారం ఉదయం అధికార పీపుల్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ)కి చెందిన కార్యకర్తను కాల్చి చంపాయి. అనంత్‌నాగ్ జిల్లా దియాల్గం చెందిన మహ్మద్ ఇషాఖ్ పర్రేను అతని నివాసం ఆవల కాల్చి చంపినట్లు పోలీసులు తెలిపారు. ఉగ్రవాదులు దాగిఉన్నారన్న ప్రత్యేక సమాచారంతో దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో భద్రతా దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

ఐఐటీల్లో పీహెచ్‌డీకి కేంద్ర ఫెలోషిప్ రూ.70వేలు

కోల్‌కతా: ఐఐటీ, ఐఐఎస్‌సీల్లోని పరిశోధక (పీహెచ్‌డీ) విద్యార్థులకు కేంద్రం ప్రతి నెలా రూ.70వేల ఫెలోషిప్‌ను అందించనుంది. ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక కారణాలతో దేశం విడిచి వెళ్లకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి ఫెలోషిప్ పథకంలో భాగంగా వీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కేంద్ర ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి కుమార్‌శర్మ తెలిపారు. ఐదేళ్లపాటు వీటిని అందజేస్తారని.. అయితే వీటిని పొందే సమయంలో విద్యార్థులు ఇతర ఉద్యోగాలు చేసేందుకు వీలు ఉండదని తెలిపారు. త్వరలోనే ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం లభిస్తుందని ఆయన వివరించారు.

తారు రోడ్డుకు చల్లని పైపూత

- ఉష్ణోగ్రతల కట్టడికి వినూత్న మార్గం
- పనులకు శ్రీకారం చుట్టిన లాస్ ఏంజెలిస్

లాస్ ఏంజెలిస్: ఆకాశాన్ని తాకే భవనాలు.. చిటికెలో గమ్యానికిచేర్చే రవాణా సదుపాయాలు.. ఆహ్లాదాన్ని పంచే షాపింగ్ సముదాయాలు.. "లాస్ ఏంజెలిస్" నగర ప్రఖ్యాతికి నిదర్శనాలు. ఇవన్నీ నాణేనికి ఒకవైపే. వాతావరణ మార్పులు రెండో వైపు ఈ నగరాన్ని కుదిపేస్తున్నాయి. ఎడారి ఉష్ణాన్ని గ్రహిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తారురోడ్లు విపరీత నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఆ ఉష్ణోగ్రతలకు కళ్లెం వేయడమే లక్ష్యంగా ఈ నగరం కొత్త మార్గంతో ముందుకువచ్చింది.

కాంక్రీటు అడవులతో భగభగలు: వేల కి.మీ.ల తారు రోడ్లు, కాంక్రీటు భవనాలు, ముదురు రంగుల్లోని ఇంటి పైకప్పులు ఇక్కడ ఉష్ణాన్ని విపరీతంగా గ్రహిస్తున్నాయి. దీంతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీన్నే "పట్టణ ఉష్ణ ప్రభావం"గా పిలుస్తారు. ప్రపంచంలోని మిగతా నగరాలతో పోలిస్తే.. ఈ ప్రభావం ఇక్కడ మరింత ఎక్కువగా కనిపిస్తోంది. శీతకాలంలోనూ ఇక్కడ వడదెబ్బ మరణాలు సంభవిస్తున్నాయంటే పరిస్థితులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కూల్.. కూల్‌గా...: ప్రస్తుతం ఉష్ణోగ్రతల కట్టడికి 'కూల్‌సీల్'గా పిలిచే ప్రత్యేక పదార్థాన్ని తెరపైకితెచ్చారు. బూడిద వర్ణంలో కనిపిస్తున్న దీన్ని తొలిసారిగా లాస్ ఏంజెలిస్ నగర రహదారులపై పైపూతగా వేస్తున్నారు. సూర్యకిరణాలను తిప్పికొట్టగల సామర్థ్యం దీని సొంతం. దీంతో తారు రోడ్ల ఉష్ణ ప్రభావం కొంతవరకూ తగ్గేవీలుంది. ఇప్పటికే ఫలితాలు కనిపిస్తున్నాయని నగర అధికారులు చెప్పడం విశేషం. 'వీధులు చల్లబడితే.. పరిసరాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. దీంతో ఏసీల వాడకం తగ్గుతుంది. భూతాపంతో సంభవించే మరణాలూ తగ్గుముఖం పడతాయి'అని వారు ఆశాభావం వ్యక్తంచేశారు. వచ్చే 20ఏళ్లలో నగర సగటు ఉష్ణోగ్రతలను మూడు డిగ్రీల వరకూ తగ్గించాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు.



రోడ్డుపై కూల్‌సీల్‌ను వేస్తున్న కార్మికులు

10 శాతం వరకూ తగ్గుదల: "శాన్ ఫెర్నాండో వేలీ"లోని ఓ పార్కింగ్ ప్రాంతంలో కూల్‌సీల్‌ను 2015లో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. నగరంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా నమోదయ్యే ప్రాంతాల్లో ఇది కూడా ఒకటి. వేసవిలో ఇక్కడ 80 డిగ్రీల ఫారెన్‌హీట్ కుపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. గత ఏడాదిలో అయితే రికార్డు స్థాయిలో 100 డిగ్రీలనూ మించిపోయాయి. ఇక్కడ కూల్‌సీల్ వేసినచోట మిగతా పరిసరాల కంటే 10 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. 'అందరికీ ఇంటిలో ఏసీలు బిగించుకునే శక్తి ఉండదు. కొన్ని అల్పాదాయ వర్గాలు భూతాపానికి బలయ్యే ముప్పుంది. అదే కూల్‌సీల్‌తో అయితే ప్రతిఒక్కరికీ ప్రయోజనం దక్కుతుంది. ముఖ్యంగా ఆరుబయట పనిచేయాల్సిన వారికి రక్షణ లభిస్తుంది"అని కాలిఫోర్నియా వర్సిటీ పర్యావరణ నిపుణులు అలాన్ బరెకా చెప్పారు. పెంపుడు జంతువులకూ ఇది సానుకూలమేనని వివరించారు. సాధారణ రోడ్లపై కంటే కూల్‌సీల్ రోడ్లపైనే జంతువులు చక్కగా నడవగలుగుతున్నట్లు పేర్కొన్నారు. కూల్‌సీల్ పైపూతకు మైలు దూరానికి 40,000 డాలర్లు (రూ.25.63 లక్షలు) వరకూ ఖర్చవుతుందని తెలిపారు.

ఉపగ్రహాలకు విమానాలు చిక్కకుండా..: గూఢచర్య ఉపగ్రహాలకు సైనిక విమానాలు చిక్కకుండా చూడటంలో "కూల్‌సీల్" చక్కగా పనిచేస్తుంది. అతినీలలోహిత కెమెరాలను ఇది సమర్థంగా తప్పుదోవ పట్టించగలదు. వైమానిక మార్గాల్లో ఉష్ణోగ్రతలను తగ్గించడం ద్వారా ఇది ఉపగ్రహాల కళ్లు కప్పేస్తుంది. ప్రస్తుతం రోడ్లపై ఉపయోగించేందుకు దీనిలో మార్పులు చేశారు. సూర్యకిరణాలను మరింత ఎక్కువగా తిప్పికొట్టేలా దీన్ని సిద్ధంచేశారు. దీని కోసం రక్షణ విభాగంతో కలిసి పనిచేస్తున్నామని తారు తయారీ సంస్థ గార్డ్‌టాప్ ఎల్ఎల్‌సీ తెలిపింది. ప్రయోగ పరీక్షలు ఫలితాలు ఇస్తుండటంతో చైనా, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా లాంటి దేశాలు ఈ పరిజ్ఞానం కోసం ఆరాతీస్తున్నాయి.

రూ.1000 కోట్ల చొప్పున 20 విద్యాసంస్థలకు కేంద్ర సాయం

కోల్‌కతా: అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో భారతీయ విద్యాసంస్థల స్థానాలను మెరుగుపరిచేందుకు కేంద్ర భారీగా ఆర్థిక చేయూతను అందించనుంది. దేశవ్యాప్తంగా 20 సంస్థలను ఎంపిక చేసి.. రూ.20 వేల కోట్ల నిధులను కేంద్ర మానవవనరులశాఖ అందజేయనుంది. ఈ జాబితాలో పది ప్రభుత్వ, పది ప్రైవేటు విద్యాసంస్థలకు చోటు కల్పిస్తారు. విద్యావసతులు మెరుగుపరుచుకునేందుకు ఒక్కో సంస్థకు రూ.1000 కోట్లు చొప్పున ఐదేళ్ల కాలంలో నిధులు అందుతాయి.

మరుగుదొడ్డి లేని ఇంట్లో సంసారం చేయను!

- మహిళకు విడాకుల మంజూరు

జయపుర: అత్తవారింట్లో మరుగుదొడ్డిలేదనీ.....దంపతులమైన తమకంటూ కనీసం ఓ గదికూడా లేదనీ.... ఈ పరిస్థితి నిజంగా క్రూరత్వం కిందకే వస్తుందంటూ ఓ ఇల్లాలు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఆమె అభ్యర్థనను విన్న న్యాయస్థానం విడాకులను మంజూరు చేసింది. రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాలో ఈ పరిణామం చోటు చేసుకుంది. 2011లో వివాహమైన ఆ మహిళ 2015లో విడాకుల కోసం అభ్యర్థించగా శుక్రవారం న్యాయస్థానం అందుకు సమ్మతించింది. ఈ దంపతులకు సంతానం లేదు. కార్మికుడైన భర్త చేయిపట్టుకుని అత్తవారింట అడుగుపెట్టిన తనకు ఈ దయనీయ పరిస్థితి ఎదురైందని ఆమె న్యాయస్థానానికి విన్నవించుకుంది. ఇలాంటి పరిస్థితి నిజంగా ఓ ఆడపడుచులకు అత్యంత అవమానకరమైనదే ఒక రకంగా చూస్తే హింసేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

ఎన్డీఏలో చేరిన జేడీ(యు)

- జాతీయ కార్యవర్గంలో తీర్మానం
- నాలుగేళ్ల తర్వాత మళ్లీ పాత కూటమిలోకి
- పార్టీలో చీలిక లేదు: త్యాగి
- నిర్ణయాన్ని స్వాగతించిన అమిత్ షా

పట్నా: నాలుగేళ్ల విరామం తర్వాత జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ)లో జేడీ(యు) మళ్లీ భాగస్వామిగా చేరింది. ఈ మేరకు బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ నేతృత్వంలోని పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం శనివారం తీర్మానించింది. బిహార్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో కూడిన మహా కూటమి నుంచి బయటపడి, భాజపాతో కలిసి సర్కారును ఏర్పాటు చేయాలని జేడీ(యు) రాష్ట్ర శాఖ తీసుకున్న నిర్ణయానికీ జాతీయ కార్యవర్గం ఆమోదం తెలిపిందని ముఖ్య ప్రధాన కార్యదర్శి కె.సి. త్యాగి విలేకరులకు తెలిపారు. పార్టీలో ఎలాంటి చీలికా రాలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర శాఖల అధ్యక్షులు సహా నేతలంతా హాజరై ఈ నిర్ణయాలు తీసుకున్నారనీ, ఇక చీలిక ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 27న ఆర్జేడీ తరఫున పట్నాలో జరిగే సభలో శరద్ యాదవ్ పాల్గొనేదీ లేనిదీ చూసి ఆయనపై చర్య తీసుకుంటామని చెప్పారు. పార్టీ తీసుకున్న తాజా నిర్ణయాన్ని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా స్వాగతించారు. ఎన్డీఏకి, బిహార్‌కు ఈ నిర్ణయం మేలు చేస్తుందన్నారు. బిహార్‌లో ఇకపై కొత్త అభివృద్ధి శకం మొదలవుతుందని చెప్పారు.

నీతీశ్, శరద్ వర్గీయుల ఘర్షణ

పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశానికి శరద్‌యాదవ్ గైర్హాజరయ్యారు. తన వర్గీయులతో కలిసి 'జన అదాలత్' పేరుతో విడిగా ఆయనొక సమావేశం నిర్వహించుకున్నారు. దీనికి పెద్దగా నేతలు హాజరు కాలేదు. సమావేశం సందర్భంగా నీతీశ్, శరద్‌యాదవ్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. యాదవ్ వర్గీయులు సమావేశానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహిస్తుండగా సీఎం నివాసం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. కొంతమంది కర్రలతో సీఎం నివాసంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. నీతీశ్ మద్దతుదారులు అడ్డుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది.

దమ్ముంటే చీల్చి చూడండి: నీతీశ్

కార్యవర్గ సమావేశానంతరం నీతీశ్ మాట్లాడుతూ- అసలైన జేడీ(యు) తమతోనే ఉందని చెబుతున్న పార్టీ నేత శరద్‌యాదవ్‌కు దమ్ముంటే పార్టీ శాసనసభా పక్షాన్ని చీల్చి చూడాలని సవాల్ విసిరారు.

సామాజిక మాధ్యమాల్లోనూ అగ్రగణ్యులు

- ఫేస్‌బుక్‌లో ప్రధాని మోదీకి 4.22 కోట్ల ఫాలోయర్లు
- భాజపా అధ్యక్షుడు అమిత్‌షా అనుచరులు కోటికిపైనే





దిల్లీ: దేశ ప్రజల ఆదరణ పొందటంలోనే కాదు సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్‌లలోనూ వారిద్దరి హవానే కొనసాగుతోంది. వీరిలో ఒకరు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాగా మరొకరు అధికార భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా. ఈ నెల తొలివారంలో అమిత్ షా అనుచరుల(ఫాలోయర్స్) సంఖ్య ఫేస్‌బుక్‌లో తొలిసారిగా కోటి దాటింది. అదే సమయంలో ప్రధాని మోదీ అనుచరుల సంఖ్య 4.22 కోట్లు. దేశంలో వీరిద్దరే అత్యధిక సామాజిక మాధ్యమ అనుచరులు ఉన్న అగ్రనేతలు. 2019 సాధారణ ఎన్నికలకు మరో ఏడాదిన్నర మాత్రమే మిగిలి ఉండగా నెట్‌జనులకు చేరువయ్యేందుకు వివిధ పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. వీరందరికీ అందనంత ఎత్తులో మోదీ, అమిత్ షాలు ఉన్నారు. ట్విటర్‌లోనూ మోదీకి అత్యధికంగా 3.29 కోట్ల అనుచరులు ఉండగా..అమిత్‌షాకు 62.10లక్షల మంది ఉన్నారు. తర్వాత స్థానంలో కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ ఉన్నారు. ఆమెకు ఫేస్‌బుక్‌లో 51.71 లక్షలు, ట్విటర్‌లో 68.6 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు.

రూ.45 లక్షల విలువైన వజ్రాలు తిరిగిచ్చిన బాలుడు

సూరత్: రూ. 45 లక్షల విలువ చేసే వజ్రాలు దొరికితే కష్టాలు తీరిపోతాయని సంబరపడతాం. కానీ ఓ కాపలాదారుడి కుమారుడు అలా చేయలేదు. తనకు దొరికిన రూ.45 లక్షల విలువ చేసే వజ్రాల సంచిని పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగిచ్చి తన నిజాయతీని చాటుకున్నాడు 15 ఏళ్ల విశాల్. దీంతో బాలుడిని, అతని తండ్రిని సూరత్ డైమండ్ అసోసియేషన్ శనివారం సన్మానించింది. సూరత్‌కు చెందిన మన్‌సుఖ్‌భాయి సావాలియా అనే వజ్రాల వ్యాపారి గతవారం బ్యాంకు నుంచి వజ్రాలు తీసుకొని వస్తూ దారిలో పోగొట్టుకున్నాడు. దగ్గర్లో క్రికెట్ ఆడుతున్న విశాల్ దాన్ని తీసుకుని తండ్రి ఫుల్‌చంద్‌కు ఇచ్చాడు. అతడు ఆ సంచిని తన కుమారుడితో కలిసి వెళ్లి డైమండ్ అసోసియేషన్‌కు అందజేశారు. నిజాయతీకి మెచ్చిన అసోసియేషన్ వారిని సన్మానించి ఒక సంవత్సరం విశాల్ చదువుకు ఆర్థిక సాయం చేస్తామంది.

మేధోసంపత్తి నిబంధనలు ఉల్లంఘిస్తున్న చైనా!

- దర్యాప్తు ప్రారంభించిన అమెరికా

వాషింగ్టన్: తమ దేశంతో భారీ స్థాయిలో వ్యాపార వాణిజ్యాలను నిర్వహిస్తున్న చైనా మేధోసంపత్తి నిబంధనలను పాటిస్తున్న తీరుపై అమెరికా దర్యాప్తును ప్రారంభించింది. చైనాతో వాణిజ్య లోటు ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్ టీఆర్) రాబర్ట్ లైథైజర్ ఈ దర్యాప్తును చేపట్టారు. అమెరికా వ్యాపార చట్టం(1974)లోని సెక్షన్ 301ను అనుసరించి ఈ దర్యాప్తు కొనసాగుతుంది. అమెరికా అధ్యక్ష కార్యనిర్వాహక కార్యాలయంలో ఓ భాగంగా ఉండే యూఎస్‌టీఆర్... ఇతర దేశాలతో కొత్త వ్యాపార ఒప్పందాలు, సంప్రదింపులు, ఒప్పంద ఉల్లంఘనలకు సంబంధించిన విషయాలను పరిశీలించి అధ్యక్షుడికి నివేదిస్తుంది. చైనా, అమెరికాల మధ్య జరుగుతున్న వస్తుసేవల వ్యాపార వార్షిక పరిమాణం రూ.42,43,200 కోట్లు(663 బిలియన్ డాలర్లు). ఈ మొత్తంలో అమెరికా వాణిజ్య లోటు రూ.22,20,800 కోట్లు(347బిలియన్ డాలర్లు). నూతన సాంకేతికతల ఆవిష్కరణ, అభివృద్ధి, పరిశోధనల రంగాల్లో ఎంతో ముందున్న అమెరికా..మేధోసంపత్తి హక్కుల ఉల్లంఘనల వల్ల నష్టపోతుందని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో చైనా అనైతిక చర్యలు అమెరికా ఎగుమతులపై ప్రభావం చూపుతున్నాయా? వ్యాపార ఒప్పందాలను ఉల్లంఘిస్తోందా, మేధోసంపత్తి హక్కులు కలిగిన అమెరికా సంస్థలు, కంపెనీలకు దీని వల్ల నష్టం వాటిల్లుతుందా? ఇక్కడి ఉద్యోగాలు చైనాకు తరలిపోతున్నాయా? అమెరికా వాణిజ్యలోటు పెరగటానికి ఇవన్నీ కారణమవుతున్నాయా అనే అంశాలను యూఎస్‌టీఆర్ క్షుణ్ణంగా పరిశీలించి అధ్యక్షుడికి నివేదిస్తుంది. అమెరికా సంస్థల పెట్టుబడులకు చైనా పలు ఆంక్షలు విధిస్తోందని, ఆధునిక సాంకేతికత, మేధోసంపత్తి హక్కులను చైనా కంపెనీలకు బదలాయించాలనేవి దీనిలో ప్రధానమైనవని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది.

కుంగదీస్తున్న 'మతిమరుపు'

- ఏటేటా పెరుగుతున్న కేసులు
- వృద్ధుల్లోనే కాదు..చిన్నవయసు వారిలోనూ వేగంగా వృద్ధి
- మానసిక ఒత్తిడి, ఆందోళనలే కారణమంటున్న నిపుణులు

◆ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో రేఖ పదో తరగతి చదువుతోంది. ప్రతి ప్రశ్నకు జవాబును చకచకా చెప్పే ఆమె పరీక్షల్లో మాత్రం వెనుకబడిపోతోంది. ప్రశ్నలకు తగ్గట్టు జవాబులు రాయగలిగే సామర్థ్యమున్నా అలా చేయలేకపోతోంది. పరీక్షలు రాసే సమయంలో జవాబులు గుర్తురావడంలేదని నిరాశ..నిస్పృహలకు గురవుతోంది. పరీక్షా కేంద్రం నుంచి వెలుపలికి రాగానే గుర్తువచ్చాయంటోంది.

◆ ఇంటర్ పరీక్షలు బాగానే రాసిన సంతోష్ 95% మార్కులు వస్తాయన్న ధీమాతో ఉన్నాడు. గణితంలో నూటికి నూరుశాతం వస్తాయనుకున్నాడు. ఫలితాలు వెలువడ్డాక గణితంలో అనుకున్న విధంగా మార్కులు రాకపోవడంతో ప్రత్యేక ఫీజు కట్టి నకలు తెప్పించుకున్నాడు. అందులో చూస్తే జవాబులు పూర్తిగా రాయని పరిస్థితి. దానిగురించి తండ్రి అడిగితే జవాబు అంతా రాశానని, ఇలా ఎందుకు జరిగిందో అర్థంకావడంలేదని సమాధానమిచ్చాడు.

◆ ప్రైవేట్ కంపెనీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోన్న సుబ్బారావు ద్విచక్ర వాహనం లేదా కారు తాళాన్ని ఇంట్లో...ఆఫీసులో ఎక్కడంటే అక్కడ పెట్టి మరచిపోవడం ఆనవాయితీగా మారింది. ఆఫీసుకు బయల్దేరే సమయంలో తాళం కనిపించకపోవడం, ఇంటిల్లిపాది దానికోసం హడావుడి పడిపోవడం సాధారణమైపోయింది.

◆ చదువులో ఉత్తమ ప్రతిభను కనబరిచిన కిరణ్మయి పెళ్ళయి బాబు పుట్టిన అనంతరం మతిమరుపుతో బాధపడుతోంది. స్టౌపై పాలు పెట్టి పాత్ర మాడి వాసన వచ్చే వరకు గుర్తించలేకపోతోంది.

◆ విద్యుత్తు బిల్లుల చెల్లింపు కేంద్రంలో పనిచేసే చిరుద్యోగి వినియోగదారుల నుంచి డబ్బు తీసుకుని...చిల్లర ఇవ్వకుండా అదే డబ్బును బిల్లుతో సహా ఇచ్చేస్తూ అడపాదడపా జీతంలో కోత పెట్టుకుంటున్నాడు.

పరీక్షకు వెళుతూ పెన్ను మర్చిపోతారు..అన్నీ చదివినా పరీక్ష ప్రారంభమయ్యే సరికి సగం గుర్తుకు రావు..మార్కెట్‌కు వెళ్తూ డబ్బులు తీసుకెళ్లడం మరిచిపోతారు..ఆఫీసుకు వెళ్లాక గానీ డ్రాయర్ తాళం తేలేదన్న విషయం గుర్తుకు రాదు..వర్షం వచ్చేలా ఉందని తెలిసినా గొడుగు, జర్కిన్ తీసుకెళ్లరు..చివరకు కళ్లెదుటే కావాల్సిన వస్తువు ఉన్నా దానిని గుర్తించలేని పరిస్థితి...కారణం మతిమరుపు. ఈమతిమరుపుకు వయసుతో నిమిత్తం ఉండడం లేదు. సహజంగా వృద్ధాప్యంలో వచ్చే మతిమరుపు ఒత్తిడి..ఆందోళన వంటి కారణాలతో చిన్న వయసులోనే వచ్చేస్తోంది. దాదాపు ప్రతి ఇంట్లోనూ ఎవరో ఒకరు మతిమరుపుతో ఇబ్బంది పడుతున్న పరిస్థితి.

మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురైనప్పుడు వచ్చే మతిమరుపును 'స్ట్రెస్ ఫర్‌గెటింగ్'గా వ్యవహరిస్తున్నారు. కంప్యూటరు లేదా సెల్‌ఫోన్‌లో సామర్థ్యానికి మించి సమాచారం పేరుకుపోతే తదుపరి సమాచారాన్ని తిరస్కరిస్తాయి. మరింత సమాచారాన్ని నింపేందుకు ప్రయత్నిస్తే..అప్పటి వరకు నిల్వ ఉన్న సమాచారం గల్లంతయ్యే ప్రమాదమూ ఉంటుంది. ఇదే సూత్రం మానవ మేధస్సుకూ వర్తిస్తోందని పరిశోధక మానసిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ తరహా కేసులు ఈ మధ్యకాలంలో పెరిగిపోతున్నాయని చెబుతున్నారు.

విద్యార్థులపై ఒత్తిడితో..

చాలా వరకూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై చదువు ఒత్తిడిని పెంచడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఇది..పరీక్షలకే పరిమితం తప్ప జీవితానికి పనికొచ్చే పరిజ్ఞానానికి తగ్గట్టు ఉపయోగపడడంలేదని పేర్కొంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పుస్తకాలతోనే కుస్తీపడుతున్నందున విద్యార్థులు చురుగ్గా ఉండలేకపోతున్నారు. ఈ ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఇంటర్నెట్ ఛాటింగులకు అలవాటు పడుతున్నారు. క్రమేణా అసలు చదువును మరిచి అంతర్జాలంలోనే సమయాన్నంతా గడిపేస్తున్నారు.

'పిల్లలకు శరీరక శ్రమ, మానసిక ఉల్లాసం ఉండటంలేదు. కొత్త విషయాలను నేర్చుకోవడమే కాదు..అనవసర విషయాల్ని తొలగించుకునే నైపుణ్యాన్నీ కూడా విద్యార్థులకు నేరించాలి.. లేకుంటే మతిమరుపు ఛాయలు పెరిగి నడివయసులోనే అల్జీమర్స్ డెమెన్షియా వంటి మానసిక రుగ్మతలకు గురయ్యే ప్రమాదం ఉందని' కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ సత్యమూర్తి హెచ్చరించారు.

భారత్‌లోని వృద్ధుల్లో..!

భారతదేశంలో 4.5 కోట్ల మంది వృద్ధులు అల్జీమర్స్ బారినపడినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెబుతున్నట్లు రాష్ట్ర కౌన్సెలింగ్ సైకాలజిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్‌బీ సుధాకర్ రెడ్డి అన్నారు. 'ప్రతి నలుగురు వృద్ధుల్లో ఒకరు మతిమరుపుతో బాధపడుతున్నారు. మధ్య వయస్కుల్లో డిమెన్షియా లాంటి రుగ్మతలు లేనప్పటికీ ఒత్తిడి, ఆందోళన, నిరాశవల్ల తాత్కాలికంగా మతిమరుపునకు గురయ్యే వారు 20%వరకు ఉంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థుల్లో 60% మంది వరకు ఒత్తిడి ఆందోళన, నిరాశ..నిస్పృహలతో బాధపడుతున్నట్లు అనధికారిక సర్వేలు చెబుతున్నాయి. పరీక్ష సమయంలో ఇది ఎక్కువగా ఉంటోంది' అని పేర్కొన్నారు.

యువతదీ అదే పరిస్థితి..

'దేశవ్యాప్తంగా 4.6 కోట్ల మంది యువత మతి మరుపుతో బాధపడుతోంది. ప్రతి ఏడాది ఇది 5% (ముఖ్యంగా కార్పొరేట్ సంస్కృతితో) పెరుగుతోందని దిల్లీలో ఓ ఆసుపత్రి జరిపిన అధ్యయనంలో తేలిందని' రాష్ట్ర సైకాలజిస్టుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ టీఎస్‌రావు అన్నారు. మిగిలిన వయస్సు వారిలో ఎంచుకున్న రంగంలో నిర్దేశించిన లక్ష్యాల్ని అధిగమించే ప్రయత్నంలో మతిమరుపుతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రపంచ జ్ఞాపకశక్తి పోటీల్లో..!

వరల్డ్ మెమరీ కౌన్సెలింగ్ 25 సంవత్సరాలుగా నిర్వహిస్తోన్న 'ప్రపంచ జ్ఞాపక శక్తి' పోటీల్లో ఒక్కసారి కూడా భారత్ విశ్వవిజేతగా నిలవలేదు. హైదరాబాద్‌కు చెందిన యార్లగడ్డ వైష్ణవి 2012 జూనియర్ 'వరల్డ్ మెమరీ' ఛాంపియన్ షిప్‌లో రన్నర్‌గా నిలిచింది.



2016లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన అలెగ్జాండర్ జోసెఫ్ ముల్లెన్ (అమెరికా) భారత మెమరీ ఛాంపియన్ పి.యాదవ్‌కు మధ్య అంతరం చాలా ఎక్కువగా ఉంది. ముల్లెన్‌కు 1042 పాయింట్లు రాగా..యాదవ్‌కు 577 వచ్చాయి. ప్రపంచ వ్యక్తిగత జ్ఞాపకశక్తి ర్యాంకుల్లో మొదటి పదిమందిలో భారతీయులు ఎవరూలేరు. 18వ స్థానం సాధించిన పి.యాదవ్‌తో కలిసి మొదటి 300 ర్యాంకుల్లో ఐదుగురు మాత్రమే భారతీయులున్నారు. జ్ఞాపకశక్తికి సంబంధించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో సుమారు 500 ఉండగా.. ఇందులో భారతీయులకు చెందినవి కేవలం ఎనిమిది మాత్రమే ఉన్నాయి.

వేగవంతమైన జీవన ప్రయాణం

జీవనశైలిలో మార్పు, వేగవంతమైన జీవన ప్రయాణం జ్ఞాపకశక్తిపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోంది. ఒత్తిడివల్ల కేంద్ర నాడీ మండంలో ప్రమాదకర నాడీ రసాయనాలు (న్యూరో ట్రాన్స్‌మీటర్లు) కేంద్ర నాడీ మండలం పనితనాన్ని మందగించేలా చేస్తుందని విజయనగరానికి చెందిన మానసిక విశ్లేషకులు డాక్టర్ ఏవీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఒత్తిడివల్ల జ్ఞాపకశక్తికి ప్రధాన ప్రక్రియ అయిన ధారణ సరిగా జరగదు. ఒత్తిడివల్ల సమాచార నిల్వ సమాచార విభజన అసంపూర్తిగా జరుగుతోంది.

మతిమరుపునకు కారణాలు	నియంత్రణ ఇలా..
◆ సమయం తక్కువ-పనులు ఎక్కువ	◆ ధ్యానం, యోగాతో ఒత్తిడినినియంత్రించుకోవచ్చు
◆ నిద్రలేమి పోషకాహార లోపం (బి12, ఐరన్ లోపం)	◆ సరైన అభ్యసన/ధారణ పద్ధతుల్ని అవలంబించాలి.
◆ కృత్రిమ/యాంత్రిక జ్ఞాపక శక్తి (సెల్‌ఫోన్, కంప్యూటర్)పై అతిగా ఆధారపడటం	◆ బట్టీ పద్ధతిలో కాకుండా లాజికల్ మెమరీ పద్ధతిని విద్యార్థులు అవలంబించాలి.
◆ సమాచార ప్రాధాన్యతను గుర్తించకపోవడం	◆ పనులను ప్రాధాన్య క్రమంలో చేసుకోవడాన్ని అలవర్చుకోవాలి. అనవసరమైన వాటిని విడిచిపెట్టాలి.
◆ ఏకాగ్రత, ఆసక్తి లేకపోవటం	◆ సూడోకు, పదబంధం, చదరంగం, పజిల్స్ పూరించడం, కొత్త నైపుణ్యాల్ని నేర్చుకోవడం ద్వారా..
◆ విద్యార్థుల్లో మార్కులపై, ప్రైవేట్ ఉద్యోగుల్లో అభద్రత	◆ సామాజిక సంబంధాల్ని మెరుగుపరుచుకోవాలి.

- ఈనాడు, అమరావతి

ఉత్తరకోస్తా మీదుగా అల్పపీడనం

నేడూ భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: ఒడిశా తీరం వైపు ఏర్పడిన అల్పపీడనం శనివారానికి ఉత్తర కోస్తాంధ్ర, దాని చుట్టు పక్కల ప్రాంతాలవైపు వచ్చిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసి కదులుతోంది. దీని ప్రభావంతో కోస్తాలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని.. రాష్ట్రవ్యాప్తంగా మరో 3, 4రోజులు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలుకురిసే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రం మీదుగా ఏర్పడిన ద్రోణి కొనసాగుతోందన్నారు.

ఏపీ మీదుగా వెళ్లే పలు రైళ్ల రద్దు

బిహార్, పశ్చిమబంగ సరిహద్దుల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా దక్షిణాది రాష్ట్రాలకు వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు ఉత్తర సరిహద్దు రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. కిషన్ గంజ్, పంజిపరా రైల్వేస్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌లపై వర్షాల ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. **రద్దయిన రైళ్ల వివరాలు తేదీల వారీగా... ఈనాడు.నెట్‌లో..**

ప్రభుత్వ ధనంతో నూతన సంవత్సర వేడుకలా..!

ఈనాడు, హైదరాబాద్: ఐఏఎస్‌లు 2017 నూతన సంవత్సరాన్ని ప్రభుత్వ వేడుకగా పరిగణనలోకి తీసుకుని రూ.20 లక్షల ప్రజాధనాన్ని వెచ్చించడంపై లోకాయుక్తలో ఫిర్యాదు దాఖలైంది. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడంపై జనతాదళ్ (యునైటెడ్) ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి. రమణ ఫిర్యాదు దాఖలు చేశారు. ఐఏఎస్‌లు, వారి కుటుంబ సభ్యులు, సిబ్బందితో సహా సుమారు 450 మందిపాల్గొన్న కార్యక్రమానికి ప్రభుత్వ సొమ్మును వినియోగించడం సరికాదన్నారు. విజయవాడ భవానీ ద్వీపంలో వేడుక నిర్వహించారన్నారు.

బాలకృష్ణ డబ్బుల పంపిణీపై విచారణకు ఆదేశం

ఈనాడు, కర్నూలు: సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ నంద్యాల రోడ్డు షోలో పాల్గొన్న సమయంలో డబ్బులు పంచుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫొటోలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లాయి. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం. . జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణను విచారణ చేయాలని ఆదేశించింది.



వైకాపా నాయకుడి ఇంట్లో రూ.47.40 లక్షలు స్వాధీనం

బనగానపల్లి, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధి పలుకూరు గ్రామంలో శనివారం వైకాపా నాయకుడు దస్తగిరిరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. పడక గదిలో దాచిన రూ.47.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదును వెంటనే నందివర్గం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దస్తగిరిరెడ్డి ఇంట్లో సోదాలు చేశామని స్థానిక అధికారులు తెలిపారు. సోదాల్లో పట్టుబడిన డబ్బును ఖజానా శాఖ ద్వారా ఐటీ అధికారులకు అప్పగిస్తామన్నారు.

నంద్యాలలో..: నంద్యాలలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల సోదాల్లో భాగంగా పోలీసులు పట్టణంలోని పలువురు ప్రముఖుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఇంట్లో, తెదేపా ఎన్నికల కార్యాలయంలో, అభిరుచి మధు, నందిపైపుల ఎం.డి.శ్రీధర్‌రెడ్డి ఇళ్లలో, పలువురు కౌన్సిలర్ల ఇళ్లలో సోదాలు చేశారు. అనుమానాస్పదమైన నగదు లభించలేదని పోలీసులు తెలిపారు.



నంద్యాలలో శనివారం మాట్లాడుతున్న కాంగ్రెస్ మైనార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు

బాబు, జగన్‌ల రాజకీయ గురువు మోదీనే

కాంగ్రెస్ మైనారిటీ విభాగం అగ్రనేతలు

నంద్యాల, న్యూస్‌టుడే: చంద్రబాబు, జగన్‌ల రాజకీయ గురువు ప్రస్తుతం నరేంద్రమోదీనే అనేది మైనారిటీలు గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ మైనారిటీ విభాగం జాతీయ అధ్యక్షుడు ఖుర్షీద్ అలంఖాన్, తెలంగాణ శాసనమండలి నేత షబ్బీర్‌అలీ, ఏపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, గుంటూరు మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ విమర్శించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ మోదీ మాట్లాడేది వికాసం(అభివృద్ధి) అని, ఆచరించేది వినాశనమేనని ధ్వజమెత్తారు. గుజరాత్‌లో దళితులు, ఝార్ఖండ్, రాజస్థాన్‌ల్లో ముస్లింలు, మైనారిటీలను సజీవదహనం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ సొంత రాష్ట్రంలో వందలాది ముస్లిం మహిళలు వితంతువులుగా మారారని పేర్కొన్నారు. ఇందిర, రాజీవ్‌గాంధీల బలిదానం, సోనియా త్యాగం, రాహుల్‌గాంధీ నాయకత్వం కాంగ్రెస్‌కు బలమని, లౌకిక భావాలున్న పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. వై.ఎస్. భాజపాతో ఎన్నడూ కలవలేదని, ఆయన కుమారుడు మాత్రం ఆర్ఎస్ఎస్‌కు దాసోహమయ్యాడని విమర్శించారు.

తెదేపా, వైకాపా అక్రమాలపై నేడు ఫిర్యాదు: ఉపఎన్నికల్లో వైకాపా, తెదేపా అక్రమాలపై ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో మాజీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఏపీసీసీ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయనున్నారు.

నంద్యాల ఉపఎన్నిక రిఫరెండం కానేకాదు

కేంద్ర మంత్రి సుజనాచౌదరి

ఈనాడు, న్యూస్‌టుడే బృందం: తెలుగుదేశం మూడున్నరేళ్ల పాలనపై నంద్యాల ఉపఎన్నిక ఫలితం ప్రజాభిప్రాయం (రిఫరెండం) కానే కాదని తెదేపా సీనియర్ నేత, కేంద్ర మంత్రి వై.సుజనాచౌదరి పేర్కొన్నారు. శనివారం విశాఖకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఉపఎన్నికల్లో తెదేపా విజయంపై ధీమా వ్యక్తం చేశారు. ఉపఎన్నికను తెదేపా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఈ కారణంగానే పార్టీ నేతలంతా అక్కడ పర్యటిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో వైకాపా తీరును ఆక్షేపించారు. ఆ పార్టీ నేతలు అక్రమాలకు పాల్పడుతూ తెదేపాపై బురదజల్లడం విడ్డూరమన్నారు. ఉపఎన్నిక నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు అంటూ ఉండబోదని, రాష్ట్రంలోని 13 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వైకాపా నేతలు చాపచుట్టేస్తారు: మంత్రి ప్రత్తిపాటి

నంద్యాల ఎన్నికల తరువాత జగన్, కాకినాడ నగరపాలక ఎన్నికల తరువాత ఆ పార్టీ నేత విజయసాయిరెడ్డి చాప చుట్టేస్తారని పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. కాకినాడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో తెదేపా ఘన విజయం సాధిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమర్థుడైన నేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని తెలిపారు. అధికారంలోకి రాక ముందే ఉన్మాదంతో వ్యవహరిస్తున్న జగన్ అధికారంలోకి వస్తే ఎలా తట్టుకోగలమనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని వివరించారు. ఉపముఖ్యమంత్రి ఎన్.చినరాజప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్యాంట్రీ కారులో డబ్బులు తరలిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడం వైకాపా దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పాదయాత్ర చేయడు, యాత్రకు అనుమతి తీసుకోడని ఎద్దేవా చేశారు.

వైకాపాకు ఓటమి భయం...: మంత్రి అచ్చెన్నాయుడు

ఓటమి ఖరారు కావడంతోనే వైకాపా అధ్యక్షుడు జగన్ తెదేపాపై దుష్ప్రచారానికి తెరతీశారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలులో రెండేళ్ల కిందటే తాత్కాలిక భవనంలో ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. అయినా జగన్‌కు ఉర్దూ విశ్వవిద్యాలయం ఎక్కడైనా కన్పించడం లేదా? అని ప్రశ్నించారు.

దిగజారుడు ప్రకటనలు: ఎంపీలు కొనకళ్ల, కేశినేని

ఓటమి భయంతోనే వైకాపా నేతలు దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారని ఎంపీ కొనకళ్ల నారాయణ ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై తప్పుడు విమర్శలు మానుకోవాలని వైకాపా నేతలకు హితవు పలికారు. జగన్ జైలుకెళ్లడం ఖాయమని విమర్శించారు. నంద్యాలలో తెదేపా ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ జగన్, ఆ పార్టీ నేతలు తప్పుడు నివేదికలతో ఎన్నికల కమిషన్‌ను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఓటర్ల ప్రజాభిప్రాయ సర్వే నిషేధంపై వ్యాజ్యం

ఈనాడు, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక ముగిసే వరకు విద్యార్థులు/ ఎన్జీవోలు/ ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా నిర్వహించే అన్ని ఓటర్ల ప్రజాభిప్రాయ సర్వేలను నిలువరిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో)/కర్నూలు జాయింట్ కలెక్టర్ ఈనెల 15న జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన 'సోషియో పొలిటిక్ అనాలసిస్ అండ్ రీసెర్చ్ సెంటర్(ఎస్‌పీఏఆర్‌సీ) కార్యదర్శి ఎన్.రాంబాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126ఏ(1) ప్రకారం ఎన్నికకు 48 గంటలకు ముందు 'ఎగ్జిట్ పోల్స్' నిర్వహణ, ఫలితాల ప్రచురణపై నిషేధం ఉందన్నారు. ఒపీనియన్ పోల్స్/పోల్ సర్వేలపై ఇప్పటి వరకు ఏచట్ట ప్రకారమూ నిషేధం లేదన్నారు. ఈనేపథ్యంలో ఆర్వో జారీచేసిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిగే అవకాశం ఉంది.

ఓట్ల చీలిక ప్రభావమెంత?

- 2014 నాటి ఫలితాలను విశ్లేషిస్తున్న పార్టీలు
- ఫలితాల్లో కీలకంగా మారనున్న యువ ఓటర్లు
- తటస్థులను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు
- రసవత్తరంగా నంద్యాల ఉపఎన్నిక

నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

నంద్యాల ఉపఎన్నికలో ఓట్ల చీలిక అంశం అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. ఈ ఎన్నికల్లో మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. ప్రధానంగా తెదేపా, వైకాపా మధ్య పోరు సాగుతోంది. 2014 ఎన్నికల్లో నంద్యాలలో ఇతర పార్టీల అభ్యర్థులందరికీ కలిపి 15,352 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో వివిధ పార్టీల తరపున 10 మంది, ఐదుగురు స్వతంత్రులు పోటీ చేశారు. హోరాహోరీగా సాగిన ఆ ఎన్నికల్లో 3,604 ఓట్ల మెజారిటీతో భూమా నాగిరెడ్డి గెలుపొందారు.

భూమా నాగిరెడ్డి మరణంతో ఇప్పుడు జరుగుతున్న ఉపఎన్నికల్లోనూ 15మంది అభ్యర్థులే బరిలో నిలిచారు. వీరిలో స్వతంత్రులు ఆరుగురు, 9మంది వివిధ పార్టీల తరపున పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో తెదేపా, వైకాపా మినహా స్వతంత్రులు, ఇతర పార్టీల వారికి వచ్చిన ఓట్లలో అత్యధికంగా ఎస్పీడీపీఐ అభ్యర్థికి 6,091 వచ్చాయి. ఈసారి ఆయన బరిలో లేనందున ఈ ఓట్లు ఎవరో ఒకరికి మళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఓట్ల చీలికపైనా పార్టీలు దృష్టిసారించాయి. ఈసారి ఇతర పార్టీలు ఎక్కువగా ఓట్లు చీల్చుకుంటే ఎవరికి నష్టం ఏర్పడుతుందనే దానిపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన సామాజికవర్గాల్లో ఓట్ల చీలిక ఏర్పడితే ఫలితాలు ఎలా ఉంటాయనే దానిపైనా నేతలు లెక్కలు కడుతున్నారు.



యువతా కీలకమే...: అభ్యర్థుల గెలుపు, ఓటములను యువ ఓటర్లు ప్రభావితం చేయనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,18,858 మంది ఓటర్లు ఉండగా వీరిలో దాదాపు 38శాతం మంది యువతే. 18-35 ఏళ్ల మధ్యవారు 83,166 మంది వరకు ఉన్నారు. ఈ నేపథ్యంలో యువతను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. యువ ఓటర్లు ఎక్కువగా వినియోగించే స్మార్ట్ ఫోన్ల ద్వారా వారికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. యువత ఫోన్ నంబర్లు తీసుకొని, వాట్సప్, ఫేస్‌బుక్‌ల్లో ప్రత్యర్థి పార్టీలకు వ్యతిరేకంగా పోస్టింగ్‌లు పెడుతూ ప్రచారం చేస్తున్నారు. ప్రతి ప్రచారం, కార్యక్రమాలను సెల్‌ఫోన్లలో బంధిస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నారు.

వారు ఎటువైపు...: ప్రధాన పార్టీలు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే సర్వేలు నిర్వహించాయి. ఇందులో 4-5శాతం వరకు తటస్థ ఓటర్లు ఉన్నట్టు అంచనాకు వచ్చారు. వీరు ఏ పార్టీకి అనుకూలంగా లేరు. దీంతో వీరిని ఆకట్టుకోవడంపై పార్టీలు దృష్టి సారించాయి. వీరు స్థానిక వర్గాలకు భయపడి సర్వేల్లో ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదా అనే దానిపైనా పార్టీలు ఆలోచిస్తున్నాయి. పార్టీలు దాదాపు ఇంటింటి సర్వే చేసిన నేపథ్యంలో తటస్థుల పూర్తి వివరాలు ప్రధాన పార్టీల వద్ద ఉన్నాయి. వీరిని పలకరించే ప్రయత్నాలు సాగుతున్నాయి.

ఎన్నికల సంఘానికి నిఘా విభాగం వినతి

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి కోసం వినియోగిస్తున్న ప్యాంట్రీకారులో నగదు తరలిస్తున్నారంటూ తప్పుడు ఫిర్యాదు చేసిన వారెవరో గుర్తించి చర్యలు తీసుకోవాలని నిఘా భద్రత విభాగం (ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్) అధికారులు శనివారం ఎన్నికల సంఘానికి లిఖితపూర్వకంగా విన్నవించారు. ఫిర్యాదు వెనుక ఏదైనా దురుద్దేశం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేయాలని వారు కోరారు. సీఎం ప్యాంట్రీ వాహనంలో భారీగా నగదు తరలిస్తున్నారంటూ అందిన ఫిర్యాదుపై ఎన్నికల సంఘం శుక్రవారం నంద్యాలలో తనిఖీ చేయగా ఆహారపదార్థాలు బయటపడ్డాయి. ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు కలిగించేందుకే ఎవరైనా దురుద్దేశపూర్వకంగా ఇలా చేసి ఉండొచ్చన్న అనుమానంతో అధికారులు శుక్రవారం రాత్రే ఎన్నికల సంఘం దృష్టికి ఈ విషయాన్ని మౌఖికంగా తీసుకెళ్లారు. ప్యాంట్రీ వాహనం బయల్దేరడం, దానిపై ఫిర్యాదులు రావడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలను వివరిస్తూ దీని వెనుక ఎవరున్నారో, ఏ ఉద్దేశంతో తప్పుడు ఫిర్యాదు చేశారో తేల్చాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మరోవైపు పోలీసులకు, అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంపై విచారణ బృందం రంగంలోకి దిగింది. వారు అటు గాజులపల్లె మెట్ట వద్ద, ఆర్డీవో కార్యాలయం వద్ద కొందరి నుంచి సమాచారం సేకరించినట్లు తెలిసింది.

తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

- అప్పుడే శాంతియుత ఎన్నికలకు అవకాశం
- ఐరన్‌కు చీర, రవిక కట్టినట్లు రోజా తీరు
- మంత్రి సోమిరెడ్డి ధ్వజం

నంద్యాల, న్యూస్‌టుడే: చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న వైకాపా నాయకులపై ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకుంటేనే 2019 ఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డబ్బులు పంచుతూ వైకాపా నాయకులు 43 మంది నేరుగా పట్టుబడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్యాంట్రీ వాహనాన్ని ఆపి డబ్బులున్నాయని యాగీ చేసిన వైకాపా నాయకుల తీరు సరైంది కాదని అన్నారు. వాళ్లు ఈసీకి ఫిర్యాదు చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చంద్రబాబు ఉంటే వర్షం రాదని రోజా చెప్పడం సిగ్గుచేటని, ఆయన వస్తుంటే భారీ వర్షం పడిందనే విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. రోజా చరిత్ర చూస్తే ఐరన్‌కు చీర, జాకెట్టు కడితే ఎలా ఉంటుందో అలా ఉంటుందని, ఆమె ఎక్కడ ఉంటే అక్కడ గోవిందా అని, ఆమె ఇంకా పదేళ్లు వైకాపాలో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. జగన్ వ్యాఖ్యలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

మీ ఓటుతో మా నాన్నను బతికించుకుందాం

'మీ ఓటుతో మా నాన్న భూమా నాగిరెడ్డిని బతికించుకుందామ'ని మంత్రి అఖిలప్రియ అన్నారు. నంద్యాల మండలంలోని అయ్యలూరు గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు. నంద్యాలలో రూ.1300 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇలాంటి సమయంలో భూమా బతికి ఉంటే సంతోషించేవారని అన్నారు. భూమా నాగిరెడ్డి మృతికి కారకులైన వారికి వైకాపా టిక్కెటిచ్చిందని, అలాంటి వారిని నంద్యాలనుంచే గాక జిల్లాలోనే లేకుండా చేయాలని సూచించారు.

'ఒకరున్నారు బుద్ధి మూర్ఖుడు, బుద్ధిహీనుడు టీవీలు, పేపర్లు లేవంటున్నారు. మరి పేపర్ ఎవరిది?' అని సినీ హాస్యనటుడు వేణుమాధవ్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబును నంద్యాలకు రావద్దని కోరానని, అభ్యర్థి ఆధిక్యాన్ని టీవీలో చూడమన్నానని పేర్కొన్నారు. తానే స్వయంగా వచ్చి ఆధిక్యం చూడాలనే ఉద్దేశంతో ఆయన వచ్చారని వివరించారు. అభివృద్ధి ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు.

ఎన్నికల సంఘానికి తెదేపా లేఖ

ఈనాడు అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్యాంట్రీ కారును అడ్డుకుని దానిలో రూ.వంద కోట్లు తరలిస్తున్నారంటూ అనవసరంగా రచ్చ చేసిన వైకాపా నాయకులు, వారి అనుచరులపై కేంద్ర ఎన్నికల సంఘానికి తెదేపా రాష్ట్ర కార్యాలయ సమన్వయ కార్యదర్శి టీడీ జనార్ధన్ శనివారం ఫిర్యాదు చేశారు. వారిని తక్షణం అరెస్టు చేయాలని కోరారు. 'శుక్రవారం సాయంత్రం నంద్యాలకు 18 కి.మీ.ల దూరంలో గాజులపల్లిమెట్ట గ్రామం వద్ద సీఎం ప్యాంట్రీ కారును వైకాపా నాయకులు, వారి అనుచరులు అడ్డుకున్నారు. నంద్యాలలో ఓటర్లకు పంచేందుకు కంటైనర్‌లో రూ.వంద కోట్లు తరలిస్తున్నారని, దాన్ని సీజ్ చేయాలని గొడవ చేశారు. తాళం వేసి ఉండటంతో పోలీసులు ఆ వాహనాన్ని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలించి తాళాలు బద్దలు కొట్టి తనిఖీ చేశారు. వాహనంలో ఆహార పదార్థాలు తప్ప వైకాపా నాయకులు ఆరోపిస్తున్నట్టు డబ్బులేమీ లేవని నిర్ధరించారు. ప్యాంట్రీ కారు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో ఉంటుంది. వైకాపా నాయకుల హడావుడి వల్ల పోలీసులు దాని తాళం బద్దలు కొట్టాల్సి వచ్చింది. ఇది ముఖ్యమంత్రి భద్రతకు విఘాతం కలిగించే పరిణామం' అని ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

వైకాపా విచ్చలవిడిగా డబ్బు పంచుతోంది

వైకాపా నాయకులు విచ్చలవిడిగా డబ్బు పంచుతున్నారని కూడా కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి టీడీ జనార్ధన్ తీసుకెళ్లారు. ఆ పార్టీ ఆగడాలపై గతంలో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. పలుకూరు గ్రామంలో వైకాపా నాయకుడు దస్తగిరిరెడ్డి ఇంట్లో రూ.47.40 లక్షలు లెక్కల్లో చూపని నగదును శనివారం పోలీసులు సీజ్ చేశారని తెలిపారు.

ఛాంపియన్స్

2019 వన్డే ప్రపంచకప్‌కు ఇంకా 20 నెలలకు పైగా సమయముంది. ఐతే ఇప్పట్నుంచే ఆ మెగా టోర్నీకి సన్నాహాలు మొదలుపెట్టేసింది టీమ్‌ఇండియా. ప్రపంచకప్‌లో ఆడబోయే జట్టుపై ఇంకో ఐదు నెలల్లోనే ఓ అంచనాకు రాబోతున్నట్లుగా చెప్పిన భారత క్రికెట్ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్.. ఇప్పట్నుంచే ఆటగాళ్ల ప్రదర్శనపై దృష్టిసారించనున్నట్లు సంకేతాలిచ్చాడు. శ్రీలంకతో ఆదివారం ఆరంభమయ్యే వన్డే సిరీస్ నుంచే సెలక్టర్ల పని మొదలవుతోంది. టెస్టు సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసిన నేపథ్యంలో శ్రీలంక సిరీస్‌కు అంత ప్రాధాన్యం లేదు కానీ.. సెలక్టర్ల ప్రణాళికల్ని బట్టి చూస్తే సీనియర్ ధోనికైనా.. కొత్త కుర్రాడు కుల్‌దీప్ యాదవ్‌కైనా ఈ సిరీస్ ఎంతో కీలకం. మరోవైపు టెస్టుల్లో ఎదురైన పరాభవానికి వన్డేల్లో అయినా ప్రతీకారం తీర్చుకోవాలని.. ఛాంపియన్స్ ట్రోఫీలో మాదిరే భారత్‌కు షాకివ్వాలని పట్టుదలతో బరిలోకి దిగుతోంది ఆతిథ్య జట్టు.

శ్రీలంకతో వన్డే సిరీస్ నేటి నుంచే

లక్ష్యం 2019

- ఆటగాళ్ల ప్రదర్శనపై సెలక్టర్ల దృష్టి
- ప్రపంచకప్ లక్ష్యంగా భారత్ అడుగులు



మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ సిక్స్, టెన్-3ల్లో

దంబుల్లా

టెస్టు సిరీస్‌లో శ్రీలంకను వైట్‌వాష్ చేసిన భారత్.. ఇక ఆ జట్టుతో వన్డే సమరానికి సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆదివారం జరగబోతోంది. టెస్టులతో పోలిస్తే శ్రీలంక మెరుగ్గా కనిపిస్తున్న నేపథ్యంలో ఆ జట్టును భారత్ తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. టెస్టు సిరీస్ ఏకపక్షంగా సాగడంతో నిరాశ చెందిన క్రికెట్ ప్రియులు.. వన్డేలైనా హోరాహోరీగా సాగుతాయని ఆకాంక్షిస్తున్నారు. 2019 ప్రపంచకప్ దిశగా సన్నాహాలు ఆరంభించిన నేపథ్యంలో ఈ సిరీస్‌పై భారత్ ప్రత్యేకంగా దృష్టిసారించగా.. శ్రీలంక కూడా అదే దృష్టితో ఈ సిరీస్‌ను కీలకంగా భావిస్తోంది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ ఎనిమిదో స్థానంలో ఉన్న లంక.. ఈ సిరీస్‌లో రెండు వన్డేలు గెలిస్తే ఆ స్థానాన్ని పదిలం చేసుకుని, ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధిస్తుంది. కాబట్టి ఇరు జట్లకూ ఈ సిరీస్ కీలకమే.

తుది జట్టు కోసం నువ్వా నేనా: ప్రతిభ ఉంది, ఫామ్ బాగుంది.. అయినప్పటికీ మనీష్ పాండేకు భారత తుది జట్టులో చోటు సందేహమే. గాయంతో ఛాంపియన్స్ ట్రోఫీకి దూరం కావడం అతడికి చేటు చేసింది. అప్పటికి ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్న ధావన్ మళ్లీ జోరందుకున్నాడు. తాజాగా టెస్టు సిరీస్‌లోనూ సత్తా చాటాడు. మరోవైపు కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధించడంతో పాటు, తాజాగా టెస్టు సిరీస్‌లో ఫామ్ చాటుకున్నాడు. దీంతో రోహిత్‌తో పాటు ఈ ఇద్దరికీ తుది జట్టులో చోటివ్వక తప్పదు. ధావన్, రోహిత్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనుండగా.. ఇంతకుముందు మనీష్ పాండే ఆడిన నాలుగో స్థానంలో రాహుల్ దిగే అవకాశముంది. మరోవైపు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో సత్తా చాటినప్పటికీ రహానెకు కూడా తుది జట్టులో అవకాశం లేనట్లే. స్పిన్నర్ల కోటాలో అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్‌లిద్దరికీ చోటు దాదాపుగా ఖాయం. పేస్ బాధ్యతలు బుమ్రా, భువనేశ్వర్ పంచుకుంటారు. మిడిలార్డర్లో ధోని, హార్దిక్ పాండ్య, కేదార్ జాదవ్ బరిలోకి దిగుతారు. పాండే, రహానె లాంటి ఆటగాళ్లకే తుది జట్టులో చోటు కష్టమంటే.. పోటీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మరి ఈ పోటీ నేపథ్యంలో లంకపై ఏ ఆటగాడు ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. మరోవైపు యువరాజ్‌పై వేటుతో తన మీదా ఒత్తిడి పెరుగుతుండటం, సెలక్టర్లు ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్న నేపథ్యంలో ధోని ఈ సిరీస్‌లో ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం.

జట్లు (అంచనా)... భారత్: ధావన్, రోహిత్, కోహ్లి (కెప్టెన్), రాహుల్, ధోని, హార్దిక్ పాండ్య, కేదార్ జాదవ్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, బుమ్రా, భువనేశ్వర్

శ్రీలంక: డిక్వెలా, గుణతిలక, కుశాల్ మెండిస్, తరంగ (కెప్టెన్), మాథ్యూస్, కపుగెదెర, హసురంగ, తిసార పెరీరా, అకిల ధనంజయ, మలింగ, చమీర



200

మలింగ 200 వన్డేలాడిన 13వ శ్రీలంక ఆటగాడు కాబోతున్నాడు. భారత్‌తో తొలి వన్డేతో అతనీ క్లబ్‌లో చేరతాడు. లంక బౌలర్లలో మురళీధరన్, చమిందా వాస్ తర్వాత ఈ ఘనత సాధిస్తున్నది మలింగనే.

లంక లేచేనా?

టెస్టు సిరీస్‌లో పేలవ ప్రదర్శనతో పాతాళానికి పడ్డ శ్రీలంక.. వన్డేల్లో ఎలా పుంజుకుంటుందో చూడాలి. ఇదే లంక జట్టు రెండు నెలల కిందట ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు దిమ్మదిరిగే షాకిచ్చిన నేపథ్యంలో ఆ జట్టును మరీ తక్కువ అంచనా వేయడానికి లేదు. మాథ్యూస్, కుశాల్ మెండిస్, తరంగ, కపుగెదెర, మలింగ, తిసార పెరీరా లాంటి నాణ్యమైన ఆటగాళ్లు ఆ జట్టు సొంతం. వీళ్లందరూ వన్డేల్లో బాగా ఆడగల వాళ్లే. పరిమిత ఓవర్ల క్రికెట్లో రెండు జట్ల మధ్య అంతరం తగ్గుతుందనడంలో సందేహం లేదు.

"మాకు ప్రత్యర్థి ఎవరన్నది ప్రధానం కాదు. ప్రపంచకప్‌కు రెండేళ్ల సమయం ఉంది. ఆటగాళ్లకు కొన్ని బాధ్యతలిచ్చి వాళ్లను తీర్చిదిద్దుకునే ప్రయత్నాల్లో ఉన్నాం. కేఎల్ రాహుల్ మిడిలార్డర్లోనే ఆడతాడు. ఐతే వన్డేల్లో, టీ20ల్లో ఏదో ఒక పద్ధతికే కట్టుబడి ఉండలేం. ఎవరు ఎక్కడైనా ఆడేలా ఉండాలన్నది మా ఉద్దేశం. మనీష్ పాండే బాగా ఆడాడు, అవకాశాలు అందుకున్నాడు. అతడి ప్రతిభేంటో మాకు తెలుసు. ఆస్ట్రేలియాలో సెంచరీ సాధించాడు. చక్కటి ఫిట్‌నెస్ ఉన్న పాండేకు మంచి భవిష్యత్తుంది. అతడికి అవసరమైన మద్దతు ఇస్తాం. మిడిలార్డర్లో రెండు స్థానాలకు రాహుల్, పాండే, జాదవ్‌ల మధ్య పోటీ ఉంది. ఎవరికీ జట్టులో స్థానం ఖాయం కాదు. ఈ ఆరోగ్యకరమైన పోటీ భారత క్రికెట్‌కు మంచిది. రహానె సామర్థ్యమేంటో కూడా మాకు తెలుసు. అతణ్ని మూడో ఓపెనర్‌గా పరిగణిస్తున్నాం"

– విరాట్ కోహ్లి

క్రికెట్ టికెట్లపైనా..

కోల్‌కతా: జీఎస్టీ ప్రభావం క్రికెట్ మ్యాచ్ టికెట్లనూ వదలట్లేదు. ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్‌లో సెప్టెంబరు 21న మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్ టికెట్లపై 28 శాతం జీఎస్టీ విధించారు. దాంతో టికెట్టు రేట్లు కనీస ధర రూ.500 నుంచి రూ.650కు, రూ.1000 నుంచి 1300కు, రూ.1500 నుంచి 1900కు పెరిగింది. "టికెట్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. వాటికి అదనంగా జీఎస్టీ కలిసింది" అని బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ అన్నాడు.

ముఖాముఖి	మొత్తం మ్యాచ్‌లు 150
భారత విజయాలు	83
శ్రీలంక విజయాలు	55
టై	1
ఫలితం తేలనవి	11



రాహుల్ 13 పాయింట్లు

టైటాన్స్ గెలిచిందోచ్..

యు ముంబాపై విజయం

లఖ్‌నవూ: వరుస పరాజయాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలుగు టైటాన్స్‌కు ఊరట. ఆ జట్టు ఎట్టకేలకు ఒక విజయం సాధించింది. శనివారం హోరాహోరీ పోరులో టైటాన్స్ 37-32తో యు ముంబాపై నెగ్గింది. కెప్టెన్ రాహుల్ చౌదరి (13) విజృంభించి టైటాన్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. రెండు సూపర్ రైడ్‌లు సాధించిన రాహుల్.. జట్టును ముందుండి నడిపించాడు. సోమ్‌బీర్ (8) నుంచి అతనికి సహకారం అందడంతో టైటాన్స్ ఏ దశలోనూ తగ్గలేదు. రాహుల్ రాణించడంతో ఒక దశలో టైటాన్స్ 12-7తో ముందంజలో నిలిచింది. అయితే అనూప్ కుమార్ (7 పాయింట్లు) కీలక సమయంలో సత్తా చాటడంతో ముంబా పుంజుకుంది. 19-17తో టైటాన్స్‌ను సమీపించిన ముంబా... ఆఖర్లో 27-27తో స్కోరు కూడా సమం చేసింది. అయితే కీలక సమయంలో రాహుల్ వరుస పాయింట్లు సాధించడం, ముంబా ఆటగాళ్లు రైడ్ పాయింట్లు తేవడంలో విఫలం కావడంతో వెనకబడిన ముంబా.. చివరికి 32-37తో ఓటమి చవిచూసింది. 7 ఓటముల తర్వాత టైటాన్స్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 36-29తో యూపీ యోధపై విజయం సాధించింది. వికాస్ (9 రైడ్ పాయింట్లు), సురేందర్ (7 ట్యాకిల్ పాయింట్లు) హరియాణాను గెలిపించారు.

ప్రో కబడ్డీలో ఈనాడు		
పట్నా పైరేట్స్ × పుణెరీ పల్టాన్	రాత్రి 8 గంటలకు	వేదిక: లఖ్‌నవూ
యూపీ యోధ × జైపూర్ పింక్ పాంథర్స్	రాత్రి 9 గంటలకు	స్టార్‌స్పోర్ట్స్ 2లో

పతకానికి ఇదే సమయం

- ఆత్మవిశ్వాసంతో ఉన్నా
- 'ఈనాడు'తో కిదాంబి శ్రీకాంత్

ఈనాడు – హైదరాబాద్



సూపర్ ఫామ్‌లో ఉన్న భారత యువ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ సమరోత్సాహంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సన్నద్ధమవుతున్నాడు. ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడానికి తనకు ఇదే సరైన సమయమని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు. ఈనెల 21న టోర్నీ ఆరంభం కానున్న నేపథ్యంలో శ్రీకాంత్ గ్లాస్గో (స్కాట్లాండ్) నుంచి ఈనాడుతో ప్రత్యేకంగా మాట్లాడాడు. కెరీర్‌లోనే అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నానని, దాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ఎలా సన్నద్ధమయ్యారని అడిగినప్పుడు.. "ప్రత్యేకంగా అంటూ ఏమీ చేయలేదు. ఎప్పట్లాగే సాధన చేశానంతే. కాకపోతే వరుసగా టోర్నీల తర్వాత ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సన్నద్ధమవడానికి రెండు నెలల సమయం దొరికింది. కావాల్సినంత విశ్రాంతి తీసుకున్నా. ప్రాక్టీస్ చేశా. ఆత్మవిశ్వాసంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు సిద్ధమయ్యా" అని చెప్పాడు.

ఆ నమ్మకం ఉంది..: వరుసగా ఇండోనేసియా ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిళ్లు గెలవడం సానుకూలాంశమే అయినా.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పరిస్థితులు భిన్నంగా ఉంటాయని శ్రీకాంత్ చెప్పాడు. "టైటిళ్లు గెలుస్తుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఐతే ఆ ప్రదర్శన గురించి ఆలోచిస్తూ ఉంటే ప్రపంచ ఛాంపియన్‌షిప్ నెగ్గలేం. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పరిస్థితులు, పోటీ భిన్నంగా ఉంటాయి" అని అన్నాడు. పతకం సాధిస్తానన్న నమ్మకం తనకు ఉందని చెప్పాడు. "ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడానికి నాకు ఇదే సరైన సమయం. కెరీర్‌లో అత్యుత్తమ ఫామ్‌లో ఉండటమే ఇందుకు కారణం. పతకం సాధిస్తానన్న నమ్మకం కూడా ఉంది. ఐతే పతకం గురించి అతిగా ఆలోచించి ఒత్తిడి పెంచుకోవాలనుకోవట్లేదు. బాగా ఆడాలన్నదే నా లక్ష్యం" అని శ్రీకాంత్ వివరించాడు. తనకు కఠిన డ్రా ఎదురైందని, పోటీ తీవ్రంగా ఉంటుందని చెప్పాడు.

మారిషస్‌పై భారత్ గెలుపు



రాబిన్ సింగ్

ముంబయి: ఏఐఎఫ్ఎఫ్ మూడు దేశాల ఫుట్‌బాల్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2-1 గోల్స్‌తో మారిషస్‌ను ఓడించింది. 37వ నిమిషంలో రాబిన్‌సింగ్ కొట్టిన గోల్‌తో ఖాతా తెరిచిన భారత్.. ద్వితీయార్థంలో బల్వంత్ (62వ ని) బంతిని గోల్‌పోస్ట్‌లోకి కొట్టడంతో విజయాన్ని ఖరారు చేసుకుంది.

లంకలో లోపించింది అదే



సౌరభ్ గంగూలీ

టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన భారత్ ఆదివారం శ్రీలంకతో వన్డే పోరును ఆరంభించనుంది. టెస్టు సిరీస్ సాగుతున్నకొద్దీ లంక ప్రదర్శన క్షీణించింది. బలహీన జట్లలో ఉన్న సహజ లక్షణమే ఇది. తొలి టెస్టు తర్వాత ఆత్మవిశ్వాసం కోల్పోతే పతనం వేగవంతమవుతుంది. శ్రీలంక లాంటి జట్టు సొంత గడ్డపై చిత్తుగా ఓడుతున్నప్పుడు సంధికాలం అనే మాటను చాలా తేలిగ్గా వాడుతుంటారు. ఇలాంటి జట్లు భారత్ వైపు చూడాలి. చాలా మంది దిగ్గజ ఆటగాళ్లు నిష్క్రమించినప్పటికీ భారత క్రికెట్ కొంతకాలంగా బలంగానే ఉంది. కోహ్లి,

పుజారా, రాహుల్, రహానె, రోహిత్, అశ్విన్, పాండ్య వంటి నాణ్యమైన ఆటగాళ్లను భారత్ తయారు చేస్తూనే ఉంది. సంధికాలం ప్రభావం ఎప్పుడూ జట్టుపై పడనీయలేదు. కోహ్లి బృందం మైదానంలో సగర్వంగా కనపడుతుంది. శ్రీలంక జట్టులోనూ ప్రతిభావంతులకు కొదవ లేదు. కానీ పోరాటతత్వమే లోపించింది. క్రికెట్ అంటే కేవలం ప్రతిభే కాదు.. పట్టుదల, ధైర్యం చాలా ముఖ్యం. టెస్టు సిరీస్‌లో ఓటమి ఆ జట్టుకు మేలుకొలుపు కావాలి. రోహిత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం మంచి నిర్ణయం. ఐపీఎల్‌లో రాణించినందుకు ఇది బహుమతి. కెప్టెన్‌గా అతడు ముంబయి ఇండియన్స్‌ను సమర్థంగా నడిపించాడు. వన్డేల్లో నేను అందరి ఆటనూ నిశితంగా చూస్తా. ఐతే అందరికన్నా పాండ్య ఎక్కువ ఆసక్తిరేపుతున్నాడు.



నాదల్‌కు కిర్గియోస్ షాక్

సిన్సినాటి: నంబర్‌వన్ కానున్న రఫెల్ నాదల్‌కు షాక్. సిన్సినాటి మాస్టర్స్ క్వార్టర్‌ఫైనల్లో ఆస్ట్రేలియా కుర్రాడు నిక్ కిర్గియోస్ 6-2, 7-5తో 15 సార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ నాదల్ (స్పెయిన్)ను మట్టికరిపించాడు. అతడు ఆద్యంతం పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. మరోవైపు సానియా మీర్జా, రోహన్ బోపన్నల కథ ముగిసింది. తమ భాగస్వాములతో కలిసి వీళ్లు డబుల్స్ నుంచి నిష్క్రమించారు. పురుషుల క్వార్టర్‌ఫైనల్లో బోపన్న, ఇవాన్ దోడిగ్ (క్రొయేషియా) జోడీ 1-6, 7-6, 7-10తో కుబోట్ (పోలెండ్), మార్సెలో మెలో (బ్రెజిల్) ద్వయం చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో సానియా, షు పెంగ్ (చైనా) ద్వయం 4-6, 6-7తో సీ సు వీ (తైవాన్), మోనికా నికులెస్కు (రొమేనియా) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

ఆ ఒక్కడు తప్ప..

అర్జున, ద్రోణాచార్య అవార్డుల జాబితాకు పచ్చజెండా

దిల్లీ: ద్రోణాచార్య అవార్డుల జాబితా నుంచి పారా క్రీడల కోచ్ సత్యనారాయణ పేరును క్రీడల మంత్రిత్వ శాఖ తొలగించింది. అతనిపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉండడమే దీనికి కారణం. ఖేల్‌రత్న, అర్జున అవార్డుల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. దీంతో అర్జున అవార్డుల జాబితాలో తమ పేర్లను చేర్చాలన్న టెన్నిస్ డబుల్స్ నిపుణుడు రోహన్ బోపన్న (టెన్నిస్), వెయిట్‌లిఫ్టర్ సంజితా చానులకు నిరాశే ఎదురైంది. అంతేకాదు రియో పారాలింపిక్స్‌లో రజతం గెలిచిన దీప మలిక్ పేరును ఖేల్‌రత్నకు పరిశీలించాలన్న ప్రతిపాదన కూడా తిరస్కారానికి గురైంది. "క్రిమినల్ కేసు ఉన్న సత్యనారాయణ పేరును ద్రోణాచార్య అవార్డుల జాబితా నుంచి తొలగించాం. మిగిలిన ప్రతిపాదనల్లో ఎలాంటి మార్పులు లేవు. అవార్డులు గెలుచుకున్న వాళ్లకు మెయిల్ ద్వారా సమాచారం అందించాం" అని క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అర్జున అవార్డు కోసం సెలక్షన్ ప్యానల్ 17 మంది పేర్లను ప్రతిపాదించింది. వీరిలో ఇద్దరు పారా అథ్లెట్లు కూడా ఉన్నారు. ద్రోణాచార్య అవార్డుల జాబితా నుంచి తన పేరు తొలగించడం అన్యాయమని పారా క్రీడల కోచ్ సత్యనారాయణ ఆవేదన చెందాడు. "ద్రోణాచార్య జాబితా నుంచి నా పేరు తొలగించడం అన్యాయం. గిట్టని వాళ్లు ఇలా తప్పుడు ఆరోపణలు చేశారు. పరువు నష్టం కేసు ఆధారంగా నా పేరు తీసేయడం బాధ కలిగిస్తోంది" అని సత్యనారాయణ చెప్పాడు.

విండీస్.. ఓటమి దిశగా

బర్మింగ్‌హామ్: ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు (డేనైట్)లో వెస్టిండీస్ ఇన్నింగ్స్ ఓటమి దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 168 పరుగులకే కుప్పకూలిన ఆ జట్టు.. ఫాలో ఆన్ ఆడుతూ మూడో రోజు, శనివారం టీ విరామానికి రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. కీరన్ పావెల్ (10), కైల్ హోప్ (12), షాయ్ హోప్ (4) వెనుదిరిగారు. చేజ్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే విండీస్ ఇంకా 270 పరుగులు చేయాలి. అంతకుముందు అండర్సన్ (3/34), బ్రాడ్ (2/47), రోలాండ్ జోన్స్ (2/31)ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ విలవిలలాడింది. ఓ దశలో ఆ జట్టు 85 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అయితే బ్లాక్‌వుడ్ (79; 76 బంతుల్లో 9×4, 2×6) రాణించడంతో ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌ను 514/8 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.



బ్లాక్‌వుడ్ (79)



● హారిక గేమ్ డ్రా

అబుదాబి: అబుదాబి అంతర్జాతీయ చెస్ టోర్నీ ఆరో రౌండ్లో భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక డ్రా చేసుకుంది. శనివారం అంటోనియో (స్పెయిన్)తో గేమ్‌లో హారిక పాయింట్లు పంచుకుంది. దీంతో ఆమె 3.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతోంది. భారత ఆటగాడు శార్దూల్ (4.5) మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



ద్విచక్ర వాహనంపై వెళుతున్న కిరణ్‌బేడీ (వెనుక కూర్చున్న మహిళ)

మహిళా భద్రతకు కిరణ్‌భేరీ!

అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై తిరుగుతూ గవర్నర్ పరిశీలన

పుదుచ్చేరి, న్యూస్‌టుడే: అర్ధరాత్రి వేళ మహిళలకు ఎంతవరకు రక్షణ ఉందనే విషయాన్ని తెలుసుకునేందుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ యత్నించారు. శుక్రవారం అర్ధరాత్రి రాజ్‌నివాస్ నుంచి ఆమె తన సిబ్బందిలోని ఓ మహిళతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ముఖానికి ముసుగు వేసుకుని కిరణ్‌బేడీ వాహనం వెనుక భాగంలో కూర్చున్నారు. పుదుచ్చేరిలోని ప్రధాన రహదారులు, పలు వీధుల్లో సుమారు గంటపాటు తిరిగారు. అనంతరం మళ్లీ రాజ్‌నివాస్‌కు చేరుకున్నారు. తర్వాత దీని గురించి ఆమె తన ట్విట్టర్‌లో ప్రస్తావిస్తూ.. "పుదుచ్చేరి ప్రజలకు తగిన భద్రత ఉంది. మహిళలకు తగిన రక్షణ లభిస్తోంది" అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ పోలీసులు గస్తీ పెంచాలని సూచించారు. ఈ విషయమై పోలీసుశాఖ ఉన్నతాధికారులకు కొన్ని సూచనలు, ఆదేశాలు ఇచ్చానని కిరణ్‌బేడీ తెలిపారు.



పేలుడు ధాటికి కుప్పకూలిన ఇంటి పైకప్పు

బాణసంచా తయారుచేస్తుండగా పేలుడు

- అయిదుగురు మృతి
- ఒడిశాలో ఘటన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అక్రమంగా బాణసంచా తయారీ కేంద్రం నడుపుతున్న ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు పేలుడు సంభవించి అయిదుగురు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రగాయాలపాలయ్యారు. ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లా జింఖియ ఠాణా పరిధిలోని సికో గ్రామంలో శనివారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సికో గ్రామానికి చెందిన సనాతన సెఠి అనే వ్యక్తి తన ఇంట్లో కొన్నాళ్లుగా అక్రమంగా బాణసంచా సామగ్రి తయారుచేస్తున్నారు. వీటి తయారీలో సనాత సహా కుటుంబ సభ్యులు, స్థానిక మహిళలు కొందరు పాల్గొంటున్నారు. శనివారం ఉదయం ఎప్పటిలాగే సామగ్రి తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు జరిగింది. పేలుడు తీవ్రతకు భవనం పైకప్పు కూలి బాణసంచా తయారు చేస్తున్న వారిపై పడింది. స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి అయిదుగురి మృతదేహాలను వెలుపలికి తీశారు. తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని ఖుర్దా జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సనాతన భార్య, ముగ్గురు కుమార్తెలు, పొరుగున ఉండే మరో మహిళ మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. సనాతన సెఠి పరారీలో ఉన్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి అన్ని పాఠశాలల్లో రేడియో పాఠాలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 21వ తేదీ నుంచి రేడియో పాఠాలు వినిపించనున్నారు. ఈ మేరకు సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు వారంలో నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) పాఠాలు ప్రసారమవుతాయి.

విద్యా సంస్థలకు ఎకరం రూ.50 లక్షలకే..!

- రాజధానిలో భూమి కేటాయింపులపై ప్రభుత్వ నిర్ణయం
- అమరావతికి రావాలని ప్రముఖ సంస్థలకు లేఖలు

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతిలో జాతీయ, అంతర్జాతీయ పాఠశాలలకు ఏర్పాటుకు ఎకరం రూ.50 లక్షలకు కేటాయించాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. అమరావతిలో ఏర్పాటయ్యే ప్రముఖ ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, కళాశాలకు కూడా దాదాపుగా ఇదే విధానం వర్తించనుంది. రాజధానిలో ఎస్ఆర్ఎం, విట్, అమృత వంటి విశ్వవిద్యాలయాల ఏర్పాటుకి ప్రభుత్వం ఎకరం రూ.50 లక్షల చొప్పున భూములు కేటాయించింది. రాజధానిలో మొదట వస్తున్న సంస్థలు కాబట్టి, వీటిని ప్రత్యేకంగా పరిగణించి తక్కువధరలకు భూములు కేటాయించింది. జాతీయ, అంతర్జాతీయ పాఠశాలల ఏర్పాటుకి మాత్రం బిడ్‌లు ఆహ్వానించి, అర్హత నిబంధనలు సరిపోవడంతో పాటు, ఎక్కువ మొత్తం కోట్ చేసిన విద్యా సంస్థలకు భూములు కేటాయించాలని ప్రభుత్వం మొదట భావించింది. బిడ్‌లు ఆహ్వానిస్తూ ప్రకటన కూడా జారీ చేసింది. కానీ పేరెన్నికగన్న విద్యాసంస్థలు ముందుకి రాకపోవడంతో ప్రభుత్వం నిర్ణయం మార్చుకుంది. పాఠశాలల నిర్వహణలో దేశంలోనే మొదటి 20 స్థానాల్లో ఉన్న సంస్థల్ని రాజధానికి ఆహ్వానించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పాఠశాలలకు భూకేటాయింపుల విధానంలోను మార్పులు చేశారు. పాఠశాలలకు ఎకరం రూ.50 లక్షల చొప్పున భూములు కేటాయించాలని సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ఇటీవల నిర్ణయించారు.

భూములు ఇచ్చేది ఇలా..!

★ అంతర్జాతీయ డే స్కూళ్లకు 4 ఎకరాలు
★ బోర్డింగ్ స్కూళ్లకు 8 ఎకరాలు
★ జాతీయ డే స్కూళ్లకు 2 ఎకరాలు
★ బోర్డింగ్ స్కూళ్లకు 4 ఎకరాలు

నిర్దేశించిన అర్హతలున్న సంస్థలు ఎన్ని ముందుకు వచ్చినా స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న 20 విద్యా సంస్థలకు ఇప్పటికే సీఆర్‌డీఏ లేఖలు రాసింది. అమరావతిలో పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసింది.

పరిశీలనలో యూనివర్సిటీల ప్రతిపాదనలు..!: గీతం, సవితా, పీఈఎస్ వంటి యూనివర్సిటీలు, ఎక్స్ఎల్ఆర్ఐ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థ ఏర్పాటు ప్రతిపాదనలు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలోఉన్నాయి. సవితా 250 ఎకరాలు, గతం 125 ఎకరాల వరకు భూములు ఇవ్వాలని కోరాయి. వాటికి ఎన్ని ఎకరాలు కేటాయించాలన్న దానిపై ఆయా సంస్థల ప్రతిపాదనలు ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. పీఈఎస్ సంస్థ స్థలమైతే కోరిందిగానీ పూర్తి ప్రతిపాదనలు అందజేయలేదని సమాచారం.

ఇంత వరకు స్థలాలు పొందిన సంస్థలు..!: రాజధానిలో ఇంత వరకు ఎస్ఆర్ఎం, విట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ), అమృత, బీఆర్ షెట్టి, ఐయూఐహెచ్ సంస్థలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఎస్ఆర్ఎం, విట్ సంస్థలకు 200 ఎకరాల చొప్పున ఇచ్చింది. ఈ రెండు సంస్థలకు మొదట 100 ఎకరాల చొప్పున కేటాయించింది. దాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాక మరో 100 ఎకరాలు చొప్పున ఇస్తామన్నది షరతు. ఈ రెండు సంస్థలు ఇప్పటికే కొంత మేర నిర్మాణాలు పూర్తి చేసి, తరగతులు ప్రారంభించాయి. ఎన్ఐడీకి 50 ఎకరాలు ఇచ్చింది. ఆ సంస్థ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఐయూఐహెచ్‌కి మొదట 50 ఎకరాలు, రెండో దశలో 100 ఎకరాలు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ సంస్థ ఇటీవలే కింగ్స్ కాలేజీ హాస్పిటల్, వైద్య కళాశాలల ఏర్పాటుకి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించింది. బీఆర్‌షెట్టి సంస్థ కూడా వైద్య విద్యా సంస్థలు, ఆస్పత్రి వంటివి ఏర్పాటుకి శంకుస్థాపన చేసింది. ఈ సంస్థకు ప్రభుత్వం 100 ఎకరాలు కేటాయించింది. అమృత యూనివర్సిటీకి ప్రభుత్వం తొలి దశలో 150 ఎకరాలు కేటాయించింది. రెండో దశలో 50 ఎకరాలు ఇవ్వనుంది. త్వరలోనే ఈ ప్రాజెక్టుకి శంకుస్థాపన చేయనున్నారు.

ఆసుపత్రుల నియంత్రణ చట్టం సరిపోతుంది

- ఎంఐసీ వల్ల యాజమాన్యాలకు ఇబ్బందులే
- భారత వైద్యసంఘం ప్రతినిధుల వెల్లడి
- అభిప్రాయాలపై నివేదిక ఇస్తానన్న జేపీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆసుపత్రుల యాజమాన్యాల్లో జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి వైద్య ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న 'ఆస్పత్రుల నియంత్రణ చట్టం' రాష్ట్రంలో బాగా అమలవుతోందని భారత వైద్య సంఘం(ఐఎంఏ) రాష్ట్ర శాఖ ప్రతినిధులు తెలిపారు. ఫీజుల వివరాలను బహిరంగంగా వెల్లడిస్తున్నామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కేవలం ముగ్గురు వైద్యులే 200 నుంచి 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. అందువల్లే అక్కడికి వెళ్లలేని కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారన్నారని తెలిపారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ గుంటూరు వైద్య కళాశాలలో ఐఎంఏ ప్రతినిధులతో శనివారం సమావేశమయ్యారు. వైద్య విద్య కమిషన్(ఎంఐసీ) ఏర్పాటుపై ఐఎంఏ ప్రతినిధుల అభిప్రాయాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎంఐసీ.. ఆస్పత్రుల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టే విధంగా ఉందన్నారు. అనంతరం జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ.. ప్రైవేటు వైద్యశాలల్లో అనవసర వైద్య పరీక్షల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజా వైద్యానికి జీడీపీలో కేటాయిస్తున్న నిధులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ ఆరోగ్య లక్ష్యాలను అందుకోవడానికి ప్రైవేటు సేవలను స్వీకరించాల్సి ఉందన్నారు. వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యకర జీవనశైలిని అవలంబించేలా చేపట్టే కార్యక్రమాలకు ప్రోత్సాహం కల్పించాలని సూచిస్తానన్నారు. సదస్సులో సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయాలతో నివేదిక తయారు చేసి ఆరోగ్య శాఖ మంత్రికి అందజేస్తానని తెలిపారు. సదస్సులో భారత వైద్య సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షులు గంగాధరరావు, పూర్వ అధ్యక్షులు కిషోర్, ఉపాధ్యక్షులు నందకిషోర్, నాయకులు ఎన్.అప్పారావు, పట్టాభితోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

చనిపోయిన ఉద్యోగి కుటుంబానికిచ్చే పరిహారం పెంపు

ఈనాడు అమరావతి: ప్రభుత్వ ఉద్యోగి చనిపోయి, వారి కుటుంబంలో కారుణ్య నియామకం పొందేందుకు అర్హులైన వారెవరూ లేని పక్షంలో ఆ కుటుంబానికి ఇస్తున్న పరిహారాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు నాలుగో తరగతి ఉద్యోగులకైతే రూ.40 వేలు, నాన్ గెజిటెడ్ అధికారులకు రూ.60 వేలు, గెజిటెడ్ అధికారులకు రూ.80 వేలు చొప్పున పరిహారం ఇస్తున్నారు. 'దాన్నిప్పుడు రూ.5 లక్షలు, రూ.8 లక్షలు, రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకుందని' ఉద్యోగ సంఘాల ఏపీ జేఏసీ-అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00